


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 93 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 13 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 93 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 13 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## పదేళ్లు నేనే సీఎం..
## నాకు పోటీ లేదు

- వచ్చే పదిన్నరేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానన్న రేవంత్ రెడ్డి
- ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చివరి దశకు చేరిందని వెల్లడి
- కిషన్ రెడ్డి కోరితే సీబీఐ విచారణకు సిద్ధమని ప్రకటన
- కేసీఆర్‌ను జైల్లో పెట్టాల్సిన అవసరం లేదన్న సీఎం
- జూబ్లీహిల్స్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని కీలక ప్రకటన



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా మీడియాతో మాట్లాడుతూ పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే పదిన్నరేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని, తనకు రాష్ట్రంలో ఎవరూ పోటీ లేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే కాకుండా, ప్రతిపక్షాల్లో కూడా తనకు పోటీ ఇచ్చే నాయకుడు లేడని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఫోన్ ట్యాపింగ్ కేసుపై సీబీఐ విచారణకు సిద్ధం రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చివరి దశకు చేరుకుందని రేవంత్ రెడ్డి తెలిపారు.

- మిగతా 2లో



## భారత్ బంద్.. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల నిరసనలు..
## తెలంగాణలో భారీ ర్యాలీలు

**హైదరాబాద్ పెన్ పవర్:**కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా కార్మిక లోకం కదంతొక్కింది. 10 కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం(ఫిబ్రవరి 12) జరిగిన సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు. నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, ప్రైవేటీకరణ ,(వీ+బీ=జు+రూ) రక్షణ, విద్యుత్ సవరణ చట్టం ఉపసంహరణ కోసం నిరసనలు, ర్యాలీలు నిర్వహించారు. కార్మిక సంఘాలు చేపట్టిన భారత్ బంద్ కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపింది. కార్మికులు ఎన్నో పోరాటాలు ఉద్యమాల ద్వారా సాధించుకున్న హక్కులను , చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని కార్మికులు ఆందోళన బాట పట్టారు. మోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి, అంబానీ, అదానీలకు వ్యతిరేకంగా ప్లాకార్డులు ప్రదర్శించారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో జరిగిన ర్యాలీలు, నిరసనల్లో కాంగ్రెస్ నేతలు , కార్యకర్తలు పాల్గొని మద్దతు తెలిపారు. సమ్మెలో భాగంగా హైదరాబాద్లోని బాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్ నుంచి ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు.

- మిగతా 2లో





## బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయి

- తెలంగాణ వచ్చినా ఉద్యమకారుల కుటుంబాలకు అన్యాయం జరిగిందన్న కవిత
- బడ్జెట్ లో ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్
- త్వరలోనే కొత్త రాజకీయా పార్టీ పెడతామని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ఉద్య మం సాగినప్పుడు ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని భావించామని...

- మిగతా 2లో

## రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి..
## సభలో ఎంపీ నోటీసు

- అమెరికాతో భారత్ ట్రేడ్ డీల్ పై రాహుల్ ఆరోపణలు
- నరవణె బుక్ పై మాట్లాడకుండా అడ్డుకుంటోందని ప్రభుత్వంపై విమర్శలు
- దేశాన్ని అమ్మేశారన్న రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీల ఆగ్రహం



- మిగతా 2లో

## 85% కంటిచూపు కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్

పెన్ పవర్ డెస్క్:పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న పాకిస్థాన్ మాజీ ప్ర ధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితి ఇటీవల చర్చనీ యాంశమైన సంగతి తెలిసిందే. అయితే, రావల్పిండిలోని జైల్లో ఉన్న ఆయన పట్ల అక్కడి

- మిగతా 2లో





## కార్మికుల కష్టంతోనే ఈ దేశం నడుస్తోంది

**హైదరాబాద్ పెన్ పవర్:** కార్మికుల హక్కులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆ హక్కు మోదీకి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో, ఆర్టీసీ యూనియన్లు, వివిధ వర్గాల కార్మికులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, సీపీఐ, సీపీఎం,


- మిగతా 2లో

## మాదాపూర్‌లోని ఖానామెట్‌లో
## హైడ్రా కూల్చివేతలు.. ఉద్రిక్తత

- రోడ్డు నెంబర్ 55లోని దుకాణాలను కూల్చివేసిన హైడ్రా అధికారులు
- నిర్మాణాలు కూల్చివేస్తుండగా అడ్డుకున్న స్థానికులు
- ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేతలు చేపట్టారని ఆందోళన

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్‌లోని మాదాపూర్ ఖానామెట్‌లో ఉద్రిక్తత నెలకొంది. సర్వే నెంబర్ 55లో రోడ్డుపై ఉన్న దుకాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఇక్కడి అర్ధనారీశ్వర ఆలయం సమీపంలోని నిర్మాణాలను కూల్చివేస్తుండగా ఆలయ కమిటీ సభ్యులు, పుజారులు, స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఈ నిర్మాణాలపై స్టేటస్ కో ఉందని అయినప్పటికీ హైడ్రా అధికారులు కూల్చివేశారని స్థానికులు ఆవేదన

- మిగతా 2లో






## తెలంగాణ పంచాయతీలకు శుభవార్త...
## కేంద్రం నుంచి రూ.387 కోట్లు విడుదల

- వారం క్రితం తొలి విడతలో రూ.259.63 కోట్లు విడుదల
- రెండు విడతల్లో కలిపి రూ.646.46 కోట్ల నిధులు విడుదల
- పెండింగ్‌లో ఉన్న మరో రూ.2,400 కోట్ల నిధులు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం రూ.387 కోట్ల నిధులు విడుదల చేసింది. వారం రోజుల క్రితం తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల చేసింది. తాజాగా మరోసారి విడుదల చేయడంతో రెండు విడతల్లో కలిపి రూ.646.46 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్టయింది. ఈ నిధులతో, గ్రామపంచాయతీల్లో

- మిగతా 2లో



## విద్యార్థులకు మూడవ తరగతి నుంచి
## అందుబాటులోకి 'ఏఐ'

- విద్య సహా అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తోందన్న కేంద్ర మంత్రి
- పరిశోధనలు నిర్వహించే విద్యార్థులు వరకు ఏఐని అందుబాటులోకి తెస్తామన్న మంత్రి
- కృత్రిమ మేధ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతోందన్న ధర్మేంద్ర ప్రధాన్

కృత్రిమ మేధస్సు (ఏఐ) విధానాన్ని భారతదేశంలోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విద్య సహా అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తోందని అన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి విద్యార్థుల నుంచి ఆధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు కృత్రిమ మేధను అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు.ఢిల్లీలో జరిగిన ఏఐ-కాంక్లేవ్-2026 సదస్సులో పాల్గొన్న ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ, కృత్రిమ మేధ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన వద్ద మేధో సామర్థ్యానికి లోటు లేదన్నారు. కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నట్లు తెలిపారు. ఏఐకి సంబంధించిన పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను సృష్టించడంలో సాంకేతిక సంస్థలు నిమగ్నమయ్యాయని అన్నారు.

## ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ..
## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ

- వివిధ విమానాశ్రయాల అభివృద్ధి పనులకు సంబంధించి చర్చ
- మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడి
- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్ పెన్ పవర్:**దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడుపుతున్నారు. ఈరోజు ఆయన కేంద్ర మంత్రి రామ్మో హన్ నాయుడుతో భేటీ అయ్యా రు. రాష్ట్రంలోని

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# వాణిజ్య ఒప్పందం భారత్‌కు నష్టమా?

భారత్ అమెరికా యూరోపియన్ యూనియన్ల మధ్య కొన్నేళ్లుగా జరిగిన చర్చలు ఒక కొలిక్కి వచ్చి వాణిజ్య ఒప్పందాలు కుదిరిన పూర్వరంగంలో అవి భారత ఆర్థికాభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఏ మేరకు తోడ్పడుతాయనే తర్జనభర్జనలు సాగుతున్నాయి. జనవరి 27న 27 దేశాల ఇయుతో ఒప్పందం కుదిరి అంతర్జాతీయ వాణిజ్యంలో కొత్త శకం ప్రారంభమైంది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరినట్టు, ప్రధాని మోడీతో ఫోన్‌లో మాట్లాడినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలుత ప్రకటించగా మోడీ ఆ తర్వాత ధ్రువీకరణ చేశారు. చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేసుకుని ఈ ఒప్పందాలు వచ్చే ఏడాది ఆరంభంలో అమలులోకి వస్తే మనం ఆ దేశాలకు ఎగుమతి చేసే వస్తువుల ధరలు తగ్గి, గిరాకీ పెరిగి వాణిజ్యం ఇతోధికంగా వృద్ధిచెంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడి సత్వర ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు. మన ఎగుమతులలో 20 శాతం అగ్రరాజ్యం అమెరికాకే జరుగుతున్నాయి. డొనాల్డ్ ట్రంప్ అమెరికాను గొప్పదేశంగా చేసేపేరిట ఇన్నాళ్లూ భారత సహా అనేక దేశాలపై ఎడాపెడా సుంకాలు విధిస్తూ ప్రపంచ వాణిజ్య విస్తరణకు అవరోధాలు కల్పించడం, అనిశ్చితి నెలకొనడం తెలిసిందే. ప్రపంచ జిడిపిలో 23% వాటా కలిగి, 200 కోట్ల జనాభాకు ప్రాతినిధ్యం వహించే భారత, 27 యూరోపియన్ దేశాల మధ్య ఇలాంటి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడం ఏ రకంగా చూసినా పెద్ద ముందడుగు. ట్రంప్ భారత దిగుమతులపై తొలుత 10% ఉన్న సుంకాలను 25 శాతానికి, తదుపరి రష్యాతో చమురు కొంటున్నారనే కుంటి సాకుతో 25 శాతం అదనపు సుంకాలను విధించడం వల్ల అవి 50 శాతానికి పెరిగి మన వస్తువుల ఖరీదు పెరిగి, మహిళలు, శ్రామిక వర్గం అధికంగా పని చేసే రొయ్యలు, చేపలు, తదితర సముద్రపు ఉత్పత్తులు, తోలు ఉత్పత్తులు, రెడీమేడ్ దుస్తుల పరిశ్రమలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆంధ్రప్రదేశ్, కేరళ తదితర రాష్ట్రాల నుండి రొయ్యలు, చేపలు, ఇతర సముద్ర ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావంపడి లక్షలాది మంది మహిళలు, శ్రామికులు ఉపాధి కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్ నుండి 90% రొయ్యల ఎగుమతులు, అదీ అమెరికాకే జరుగుతున్నాయి. వెనెజువె లా చమురు నిల్వల దోపిడీకి ట్రంప్ ఆ దేశం అధ్యక్షుడు మదురోను రహస్య ఆయుధాలు ప్రయోగించి సైనిక విమానాలలో తరలించి అమెరికాలో నిర్బంధించారు. ఇప్పుడు ఆ చమురును భారత్‌కు అమ్మజూపుతున్నారు. డెన్మార్క్ అధీనంలోని గ్రీన్‌లాండ్‌ను బలప్రయోగంతో స్వాధీనం చేసుకోవడానికి చేసిన యత్నాలను, అదనంగా 10% దిగుమతి సుంకం విధించడాన్ని డెన్మార్క్ ప్రభుత్వం, నాటో కూటమి సభ్యదేశాలు తీవ్రంగా వ్యతిరేకించి ప్రతిఘటించడంతో ట్రంప్ తోకముడవక తప్పలేదు.

ఇన్నాళ్లు నాటో కూటమి సభ్యదేశాలుగా అమెరికాకు వంతపాడినా తమపై కూడా ట్రంప్ బెదిరింపులకు దిగడంతో ఇయు దేశాలు 145 కోట్ల జనాభాతో పెద్ద మార్కెట్‌గా ఉన్న భారతతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. అమెరికా పెత్తందారీ, బెదిరింపు వైఖరి వల్ల భారతదేశం కూడా మన ఉత్పత్తులకు అనువైన ప్రత్యామ్నాయ మార్కెట్‌ల కోసమే ఇయుతో ఒప్పందాన్ని ఖరారు చేసుకుంది. చైనా చవక ఉత్పత్తులు వచ్చి పడుతున్న వేళ ధరలు తగ్గడానికి ఈ స్వేచ్ఛా వాణిజ్యం ఉభయులకు శ్రేయస్కరమని నేతలు భావిస్తున్నారు. 200 బిలియన్ డాలర్ల వాణిజ్యంతో ఇయు భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. వస్తు సేవల వాణిజ్య శేషం భారత్‌కు అనుకూలంగా ఉంది. దాదాపు 98% వాణిజ్యం సుంకాలులేకుండా స్వేచ్ఛగా జరగడం వల్ల భారత ఉత్పత్తుల ధరలుతగ్గి గిరాకీ మరింత పెరిగి దేశీయంగా వస్త్ర పరిశ్రమ, రెడీమేడ్ దుస్తులు, తోలు, సముద్ర ఉత్పత్తుల పరిశ్రమల్లో మన మహిళలు, శ్రామికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మరింత పెరిగి ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుంది. భారీ జనాభాతో మొదటి స్థానంలో ఉన్న భారత్‌లో మధ్య తరగతి, ఉన్నత వర్గాల సంఖ్య క్రమేపీ పెరుగుతున్నందున చాక్లెట్‌లు, బిస్కెట్‌లు, పాస్తా, పేస్ట్రీలు తదితర ఉత్పత్తులను సుంకం లేకుండా అనుమతి ఇస్తారు. వివిధ రకాల కార్లపై ప్రస్తుతం ఉన్న 110% ఉన్న దిగుమతి సుంకాలను భారత్ క్రమేణా 10 శాతానికి తగ్గిస్తుంది. ధరలు తగ్గి విదేశీ కార్లకు, మద్యానికి గిరాకీ పెరగవచ్చు. అది ఉన్నతవర్గాలకు ఉపయోగం. గత ఏడాది జులైలో బ్రిటన్ భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం ఇంకా అమలు కాలేదు. అందువల్ల 27 ఇయు దేశాలు ఆమోదించాకే ఈ ఒప్పందం అమలులోకి వస్తుంది. అందుకు దౌత్యపర కృషి అవసరం. మిషన్- 500 పేరుతో 2030 నాటికి భారత అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలనే ప్రయత్నాలు ఇప్పుడు అమలు కావచ్చు. మొక్కజొన్న, సోయాబీన్ తదితర వ్యవసాయ ఉత్పత్తులు అధికంగా కొనడానికి భారత్ అంగీకరించిందని ట్రంప్ చెప్పగా, వ్యవసాయ, పాడి పరిశ్రమల ఉత్పత్తులను అనుమతించబోమని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేసినా, నాలుగైదు రోజుల్లో అసలు ఒప్పందం వెలుగులోకి వస్తేగానీ అది దేశానికి మేలు చేస్తుందా లేక అమెరికా దిగుమతులు సున్నా సుంకాలతో కుప్పతెప్పలుగా వచ్చి చేటు చేస్తాయా అనేది తేలుతుంది.

అమెరికా 18% సుంకాలు విధిస్తున్న తరుణంలో మనం సున్నా సుంకాలను అనుమతించడం అమెరికా బెదిరింపులకు భయపడి లొంగిపోవడమేనని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేయగా లోక్‌సభ పదేపదే వాయిదా పడింది. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చకు సమాధానం ఇవ్వకుండా ప్రధాని మోడీ దాటవేయడం, మహిళా ఎంపిలు దాడి చేసే ప్రమాదం ఉందని, సభకు రావద్దు అని స్పీకర్ ప్రధానికి చెప్పడం శోచనీయం. పార్లమెంటులో ప్రధానికే రక్షణ కల్పించలేని ఎన్‌డిఎ ప్రభుత్వం దేశప్రజలను ఏమి రక్షిస్తుందని ప్రతిపక్షాలు నిగ్గ దీశాయి. భారత- ఇయు ఒప్పందం దరిమిలా దుందుడుకు వైఖరివల్ల ఏకాకిగా మారుతున్న అమెరికా వారం రోజుల్లో భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడం గమనార్హం. అమెరికా, ఇయు దేశాల కఠిన నియంత్రణా విధానాలు, భారత ఉత్పత్తులపై, మొక్కలు, పశువులకు సంబంధించిన నిబంధనలు అమలులో అవరోధ కారణాలు కావచ్చు. ఉక్కు, సిమెంట్, అల్యూమినియం, పరిశ్రమల నుండి వెలువడే బొగ్గు పులుసు వాయువులు, కార్బన్ బోర్డర్ నియమ నిబంధనలున్నాయి. ఈ కాలుష్యాన్ని నివారించడానికి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడానికి మరిన్ని పెట్టుబడులు కావాలి. అయితే భారత్, ఇయు దేశాలు విలువ గొలుసులో వేర్వేరు స్థాయిల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఉత్పత్తి కార్యకలాపాలలో విరుద్ధ అంశాలు లేవు. ఉభయులూ ఎవరి పరిశ్రమల్లో ఉత్పాదకశక్తి, నాణ్యత పెంచుకోవచ్చు. ప్రపంచంలో అమెరికా పెద్ద ఆర్థిక వ్యవస్థ కాగా, ఇయు రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థ. భారత్‌ది 4వ పెద్ద ఆర్థిక వ్యవస్థ. భారత్‌లో కోట్లాది మంది జీవితాలతో ముడిబడ్డ సేద్యం, పాడి పరిశ్రమ, కోళ్ల ఉత్పత్తులను, ఆహార ధాన్యాలను ఈ ఒప్పందాలలో చేర్చలేదని పాలకులు చెప్పడంలో నిజమెంతో అమలులోకి వచ్చాక తెలుస్తుంది. యూరప్ దేశాలనుండి అత్యాధునిక యంత్రా లు, వైద్యపరికరాలు, మందులు, సుంకాలు తగ్గి భారతీయులకు అందుబాటులోకి రావడం, ఆస్పత్రుల చికిత్సా రంగానికి, ప్రజారోగ్యం రంగాలకు మేలు. భారత చరిత్రలో ఇది అతిపెద్ద స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమనీ, అన్ని వాణిజ్య ఒప్పందాలకు మాతృక అని ప్రధాని మోడీ అభివర్ణించారు. కొత్త ఢిల్లీలో జరిగిన భారత ఇయు 16 వ అగ్రనాయక సభకు మోడీ, ఇయు కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వన్ డెరిలియన్ ఇయు కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా అధ్యక్షత వహించారు. భారత 77వ గణతంత్ర దినోత్సవాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఇయు నేతలను మన సాయుధ దళాల సాహస విన్యాసాలు, సాయుధ, వైజ్ఞానిక సంపత్తి ముఖ్యంగా బహుభాషలు, విభిన్న సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబి స్తూ దేశంలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన 2500 మంది కళాకారులు తమతమ భాషలలో భిన్నత్వంలో ఏకత్వమని భారతీయ ఆత్మలా చేసిన అద్భుత నృత్య గాన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.భారత మహిళలు, తదితర శ్రామికులు అధికంగా పనిచేసే రెడీమేడ్ దుస్తులు, పాదరక్షలు, ఆటో విడిభాగాలు, మందులు, ఔషధాలు, స్మార్ట్ ఫోన్‌లు, సానపెట్టిన వజ్రాలు, డీజిల్, విమాన ఇంధ నాలు ఎగుమతి చేస్తుంది. ఇయు దేశాలు మరిన్ని పెట్టుబడులు పెడతాయి. మన ఐటి, ఐటి ఆధారిత, ఆర్థిక, టూరిజం, నిర్మాణ తదితర రంగాల నిపుణుల సేవలను ఇయు దేశాలు ప్రోత్సహిస్తాయి. ఆ మేరకు వీసాలు ఇస్తారు. భారత ఇయు వాణిజ్యం ఇప్పటికే 220 బిలియన్ డాలర్లు. ఈ ఒప్పందం ద్వారా అది మరింత పెరిగే అవకాశముంది. అతిపెద్ద పొరుగు దేశం చైనాతో మనకు దిగుమతులు ఎక్కువ. వాణిజ్య శేషం భర్తీకి మరిన్నిఎగుమతులు పెరగాలి. ఇలాంటి వాణిజ్య ఒప్పందాలు మరిన్ని కుదిరి, వాణిజ్యం ఉభయ తారకంగా పెరిగితేనే భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగగలుగుతుంది.

# పదేళ్లు నేనే సీఎం.. నాకు పోటీ లేదు

- మొదటి పేజి తరువాయి

ఈ కేసులో తాము పూర్తిగా ఆధారాల ప్రకారమే ముందుకు వెళు తున్నామని స్పష్టం చేశారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరితే సీబీఐ విచారణ జరిపించేందుకు కూడా తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ మేరకు కేంద్రానికి లేఖ రాస్తామని సవాల్ విసిరారు. ఇటీవలే ఈ కేసులో సిట్ అధికారులు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులను విచారించిన నేపథ్యంలో సీఎం వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది.

**కేసీఆర్‌పై వ్యాఖ్యలు**

బీఆర్ఎస్ నేతల విమర్శలపై స్పందిస్తూ, తనను విమర్శించిన వారికే తాను సమాధానం ఇస్తున్నానని, ఎవరిపైనా వ్యక్తిగత కక్ష సాధించడం లేదని అన్నారు. “కేసీఆర్‌ను జైల్లో పెట్టాలనుకుంటే ఎప్పుడో పెట్టేవాడిని. కానీ, ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమై స్వీయ శిక్ష విధించుకున్నారు. అలాంటి వ్యక్తిని జైల్లో వేయాల్సిన అవసరం నాకు లేదు“ అని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలు ఉన్నప్పటికీ కేటీఆర్‌ను ఈడీ ఎందుకు విచారించడం లేదని ఆయన ప్రశ్నించారు.

**సింగరేణి, కాళేశ్వరం అంశాలు**

సింగరేణి బొగ్గు గనుల కేటాయింపు వివాదంపై రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పూర్తి వివరాలతో చర్చిస్తామని సీఎం తెలిపారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి ఈ వ్యవహారంలో వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాసినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని అన్నారు.

**రాజకీయ వ్యూహాలు, భవిష్యత్ ప్రణాళికలు**

2029లో దేశవ్యాప్తంగా ‘జమిలి‘ ఎన్నికలు జరుగుతాయని రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, జూబ్లీహిల్స్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఎన్టీఆర్ జాతీయ నాయకుడని, ఆయనకు సరిహద్దులు లేవని కొనియాడారు. ఈ ప్రకటనను రాజకీయ వర్గాలు వ్యూహాత్మక ఎత్తుగడగా విశ్లేషిస్తున్నాయి.

# భారత్ బంద్.. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల నిరసనలు..

# తెలంగాణలో భారీ ర్యాలీలు

- మొదటి పేజి తరువాయి

పెద్ద ఎత్తున పాల్గొన్న అన్ని కార్మిక సంఘాల నేతలు అసంఘటిత కార్మికులు ఆటో యూనియన్లు పాల్గొన్నాయి. మోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎన్నో పోరాటాలు ఉద్యమాల ద్వారా సాధించుకున్న హక్కులను, చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక , రైతు , ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా... వామపక్ష పార్టీ నేతలు నారాయణగూడ ఫ్లై ఓవర్ కింద నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, జాన్ వెస్లీ మాట్లాడుతూ...కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ , కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందని విమర్శించారు. కార్మికులు సమ్మె చేసే హక్కులను కాలరాస్తూ , అమెరికా సామ్రాజ్య విధానాన్ని మోదీ ప్రభుత్వం అనుసరిస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తన కార్మిక వ్యతిరేక వైఖరి మార్చుకోవాలని సూచించారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమంలో వామపక్ష పార్టీలు భాగస్వామ్యం అయ్యి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచుతామని హెచ్చరించారు.దేశవ్యాప్తంగా సమ్మెలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో పలు పారిశ్రామిక వాడల్లో సంపూర్ణంగా బంద్ పాటించారు కార్మికులు. లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మరోవైపు హనుమకొండలో కూడా పెద్ద ఎత్తున కార్మికులు ఆందోళనల్లో పాల్గొన్నారు. ఆర్ట్స్ కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారనాణి , సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగుల రమేష్, కార్మిక సంఘాల నేతలు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జయశంకర్ భూపాల పల్లి జిల్లాలో సింగరేణి కార్మికులు ఒక రోజు సమ్మెలో పాల్గొన్నారు. లేబర్ కోడ్ చట్టాలను వ్యతిరేకిస్తూ నిరసనలు చేపట్టారు. అత్యవసర సిబ్బంది మినహా 4 అండర్ గ్రౌండ్ రెండు ఓపెన్ కాస్ట్ లలోని మిగతా కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో సింగరేణి కి కోట్లలో నష్టం వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి..

లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ బీజేపీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు లోక్ సభలో బీజేపీ ఓ నోటీసును ఫైల్ చేసినట్లు సమాచారం. అయితే, రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ దాఖలు చేయలేదని తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రసంగించిన విషయం తెలిసిందే.రాహుల్ తన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్రం అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకుందని, ప్రధాని మోదీ దేశాన్ని అమెరికాకు అమ్మేశాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన బుక్ లో చైనా ఆక్రమణ విషయం స్పష్టంగా ఉందని, ఆ విషయంపై సభలో మాట్లాడకుండా అధికార పక్షం తనను అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు.ఈ ప్రసంగంపై కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు సభలోనే అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రేడ్ డీల్ తో భారత్ కు ఎలాంటి నష్టం లేదని వివరించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు దేశాన్ని అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ నోటీసు ఇచ్చారు.

# మాదాపూర్‌లోని ఖానామెట్‌లో హైడ్రా కూల్చివేతలు.. ఉద్రిక్తత

- మొదటి పేజి తరువాయి

వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా కూల్చివేతలు చేపట్టారని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని బాధితులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాగా, అనుమతులు లేకుండా భవనాలు, షెడ్డు నిర్మించారని ఆరోపిస్తూ హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ప్రభుత్వ భూమిలో రోడ్డు పక్కన అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేశారని, అవి అక్రమ నిర్మాణాలని హైడ్రా అధికారులు చెబుతున్నారు.

# కార్మికుల కష్టంతోనే ఈ దేశం నడుస్తోంది

- మొదటి పేజి తరువాయి

సీపీఐఎంఎల్ న్యూడెమెక్రసీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఒక రోజు బంద్‌లో మహేశ్ గౌడ్ పాల్గొన్నారు. వీఎస్టీ నుంచి ఆర్టీసీక్రాస్ రోడ్ మీదుగా ఇందిరాపార్క్ వరకు భారీ ర్యాలీ తీశారు. అనంతరం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు.

“కార్మికుల చెమట కష్టంతో ఈ దేశం నడుస్తోంది. కార్మికుల పరిపూర్ణమైన హక్కులను ప్రధాని మోదీ అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారు. దేశవ్యాప్తంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ పిలుపుమేరకు కార్మికులు ధర్నా చేస్తున్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం పెట్టుబడి వ్యవస్థకు దారులు తెరిచింది. మోదీ, అమిత్ షాలను కేంద్రంలో రాహుల్ గాంధీ ధైర్యంగా ఎదుర్కొంటున్నారు. పేదల హక్కులను కాలరాయడమే కాకుండా.. నరేగా ఉపాధి హామీకి పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగించారు. కేంద్రం తీసుకువచ్చిన ఆ చట్టాలపై అసెంబ్లీలో చర్చిస్తాం. నాలుగు కోడ్‌ల రద్దు విషయంలో కాంగ్రెస్ పార్టీ కార్మికులకు సంపూర్ణ మద్దతు ఇస్తుంది. కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షపాతి. ప్రధాని మోదీ దిగొచ్చి కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి. అప్పటి వరకు ఈ ఉద్యమం కొనసాగాలి” అని మహేశ్ గౌడ్ అన్నారు.

# తెలంగాణ పంచాయతీలకు శుభవార్త...

# కేంద్రం నుంచి రూ.387 కోట్లు విడుదల

- మొదటి పేజి తరువాయి

పెండింగ్‌లో ఉన్న పనులకు, మౌలిక సదుపాయాల కల్పనకు ఊతం లభించనుంది. కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు మరో రూ.2,400 కోట్ల నిధులు రావాల్సి ఉంది. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా ఉండటానికి పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ

మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి విడతలుగా నిధులు వస్తున్నాయి.

# బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయి

- మొదటి పేజి తరువాయి

కానీ రాష్ట్రం వచ్చాక తీరని అన్యాయం జరిగిందని కేసీఆర్ కుమార్తె, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బాగ్ లింగంపల్లిలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో కవిత మాట్లాడుతూ... ఉద్యమ సోయి లేని రేవంత్ రెడ్డి సీఎం కావడం తెలంగాణ చేసుకున్న దౌర్భాగ్యమని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాబోయే బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్, ఆకునూరి మురళి వంటివారు రేవంత్‌తో కలవడంతోనే తాము కాంగ్రెస్‌ను నమ్మామని... కానీ రెండున్నరేళ్లుగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడటం లేదని కవిత విమర్శించారు. బడ్జెట్ లో హామీలకు సంబంధించిన నిర్ణయాలు లేకపోతే కోదండరామ్ ను ప్రశ్నిస్తామని హెచ్చరిం చారు. త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ పెడతామని కవిత ప్రకటించారు. అది పక్కా రాజకీయ పార్టీ కాదని, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే పార్టీ అని స్పష్టం చేశారు. సహనశీలత లేకపోవడం, అహంకారం కారణంగానే బీఆర్ఎస్ ద

అధికారం కోల్పోయిందని, మంచితనం, భోళాతనం తెలంగాణ తత్వమని చెప్పారు. అవి కోల్పోతే మనల్ని మనం కోల్పోయినట్టేనని అన్నారు.ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల వైపే ధర్మం ఉందని, వారి కోసం పోరాటం చేస్తామని కవిత ప్రకటించారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో తెలంగాణ బిడ్డలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జయశంకర్ సార్ విగ్రహం కేబీఆర్ పార్క్‌లో లేదా ట్యాంక్ బండ్‌పై పెట్టాలని అప్పట్లో మున్సిపల్ శాఖ మంత్రిని ఎన్నోసార్లు అభ్యర్థించినా సాధ్యం కాలేదని అన్నారు.

# పార్టీ లైన్ దాటితే చూస్తూ ఊరుకోబోం..

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా పార్టీతోనే ఆయనకు గుర్తింపు వచ్చిందని, వ్యక్తిగతంగా ఆయన జీరో అనే విషయాన్ని గుర్తించాలంటూ పల్లా శ్రీనివాస్ హితవు పలికారు. అది గుర్తించి నడుచుకోవాలని సూచించారు.పార్టీ లైన్ దాటితే ఉపేక్షించబోమని టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలను కొలికపూడికి తెలియజేశారు. వాట్సప్ స్టేటస్ లతో ఎవరిపై పోరాటం చేస్తున్నారని పల్లా ఆయనను నిలదీశారు. మందలించినా కూడా పద్ధతి మార్చుకోకుంటే పార్టీ ఆయనను ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని స్పష్టం చేశారు. కాగా, అనుభవరాహిత్యం వల్లే పొరపాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ వివరణ ఇచ్చారు. సీనియర్లు తనకు మార్గనిర్దేశం చేయాలని ఆయన కోరారు.

# 85% కంటిచూపు కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్

- మొదటి పేజి తరువాయి

సిబ్బంది అమానవీయంగా ప్రవర్తిస్తున్నారని సమాచారం. జైలు గదిలో సుదీర్ఘకాలంగా ఒంటరిగా ఉంచడంతో ఆయన కంటి చూపు కోల్పోతున్నారని, ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని తెలిసింది. ఈ మేరకు సుప్రీం కోర్టు నియమించిన న్యాయవాది పరిశీలనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఈ పరిణామాలపై స్పందించిన సుప్రీం కోర్టు, వెంటనే ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. మూడు, నాలుగు నెలల క్రితం వరకు తన కుడి కన్ను చూపు సరిగ్గానే ఉందని, ఆ తర్వాత మసకగా కనిపించడం మొదలైందని న్యాయవాదితో ఇమ్రాన్ ఖాన్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని జైలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదన్నారు. దాంతో పరిస్థితి విషమించి పూర్తిగా కంటిచూపు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని న్యాయవాదికి వివరించారు. ప్రస్తుతం తన కుడికన్ను 85 శాతం చూపు కోల్పోయినట్లు చెప్పారు.

**‘కామరూప’ పిశాచి.. ఎవరీ జెఫ్రీ ఎప్‌స్టీన్?**

ఇమ్రాన్ ఖాన్‌ను జైల్లో ఏకాంతంగా ఉంచడంతోపాటు ఆయనకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించడం లేదని, కుటుంబీకులను కూడా కలవకుండా జైలు అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే కోర్టు నియమించిన అమికస్ క్యూరీ.. జైల్లో ఉన్న ఇమ్రాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను వివరిస్తూ కోర్టుకు నివేదిక సమర్పించారు. రెండున్నరేళ్లుగా ఒంటరిగా గదిలో ఉంచారని, దీంతో మానసికంగా, శారీరక సమస్యలు ఎదుర్కొంటున్నారని అందులో పేర్కొన్నారు.

# ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ..

- మొదటి పేజి తరువాయి

వివిధ విమానాశ్రయాల అభివద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు.వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, ఈ క్రమంలో తదుపరి పనులు చేపట్టాలని కేంద్రమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. కొత్తగూడెం విమానాశ్రయానికి సంబంధించి పాల్వంచలో స్థలం గుర్తించామని తెలిపారు. ఓఎల్ఎస్ సర్వే, ఫీజబిలిటీ స్టడీ నిర్వహించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి, అదనంగా 249.82 ఎకరాలు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కూడా కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టులపై ఆయనతో చర్చించారు. ముఖ్యమంత్రి నిన్న రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తదితరులతో భేటీ అయ్యారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



మల్లంపేట్ ఫంక్షన్ హాల్ ఎదురుగా అనుమతుల్లేని కమర్షియల్ షట్టర్‌లు..

# టిజి-బిపాస్ చట్టాలెందుకు..?
# చర్యలు చేపట్టలేని అధికారులెందుకు..?



మల్లంపేట్ ఏపిఆర్ ప్రహరీగోడ ఆనుకుని..



## అక్రమ కట్టడాలపై చర్యలకు..! ఆమడ దూరంలో "దుండిగల్ టౌన్‌ప్లానింగ్"..!

- దుండిగల్ మున్సిపాలిటీ జీహెచ్‌ఎంసిలో విలీనమైనా తీరుమారని యంత్రాంగం..
- మూడు నెలలుగా వార్తాలు వస్తున్నా..! "దున్నపోతు మీద వర్షంపడిన చందం"..!
- మల్లంపేట్‌లో చైన్‌మెన్‌ల 'తొలగింపు-నియామక' ప్రక్రియ జాప్యంతో ..
- రెండు నెలల వ్యవధిలోనే తాత్కాలిక చైన్‌మెన్ ప్రమేయంతో వసూళ్ళ దందా..?
- అధికారులకు ఒప్పందం కుదర్చడంలోనూ ఆ చైన్‌మెన్ కీలకపాత్రపై ఆరోపణలు..?
- ఆ ఒప్పందాలే ప్రస్తుతం చర్యలకు ఆటంకంగా మారినట్లు సమాచారం..?
- అప్పుడు-ఇప్పుడు-ఎప్పుడైనా ఉత్సవ విగ్రహంలా డిప్యూటీ కమిషనర్..
- నూతనంగా అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసిపి) బాధ్యతలు చేపట్టినా ప్రయోజనం శూన్యం..
- మూడేళ్ళుగా సుదీర్ఘంగా ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్న "టిపిఎస్" తీరు మారని వైనం..
- దుండిగల్ జీహెచ్‌ఎంసి సర్కిల్-59లో అధికారులు అందరూ అఖండులే..?







-4లో

అక్రమ నిర్మాణాల సెటిల్మెంట్‌ల కోసమే..!టౌన్‌ప్లానింగ్ విధులా..? అన్నట్టు అధికార యంత్రాంగం వ్యవహరిస్తోంది.. టిజి-బిపాస్ చట్టాలంటే విలువలేదు..! చర్యలకు తావులేదు..! అంతా బహిరంగమే..! నిబంధనలు పాటించక పోయినా పర్వాలేదు..! బల్దియాలో విలీనమైనా..! అక్రమ నిర్మాణాల దందా షరా మామూలే..! అలాంటప్పుడు అవసరం లేని అధికారులు దేనికి..? అందుకోసం ప్రత్యేకంగా ఓ టౌన్‌ప్లానింగ్ విభాగం ఎందుకని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.. దుండిగల్ జీహెచ్‌ఎంసి సర్కిల్-59 పరిధిలో..! "టిజి-బిపాస్" చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారనే ఆరోపణలకు, బలం చేకూరే విధంగా అధికారులు వ్యవహరిస్తుండగా..! పుట్టగొడుగుల్లా అక్రమ కట్టడాలు వెలుస్తున్నా అధికారుల చర్యలు తీసుకోకపోవడం గమనార్హం..! అప్పుడు కమిషనర్.. ఇప్పుడు డిప్యూటీ కమిషనర్‌గా యధావిధిగా, అదేచోట విధుల్లో కొనసాగటం శోచనీయం..! నాటి మున్సిపల్ నుండి నేటి జీహెచ్‌ఎంసి వరకు టిపిఎస్ సుదీర్ఘకాలం దుండిగల్‌లోనే విధుల్లో ఉండటం పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.. విలీనమైన 27 మున్సిపాలిటీ లలో చాలా వరకు "కమిషనర్-టిపిఎస్‌లు" బదిలీ అయినప్పటికీ..! దుండిగల్ సర్కిల్‌లో బదిలీకి అవకాశం లేకపోవడం పలు అనుమానాలను రేకెత్తిస్తుంది.. అక్రమ కట్టడాల నియంత్రణకోసం ఉన్న ప్రత్యేక విభాగమైన "పట్టణ ప్రణాళిక", కొందరు అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదకర అక్రమ కట్టడాలు నిర్మితమవుతున్నాయి.. దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా జీహెచ్‌ఎంసి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగాలు తయారైందనే విమర్శలు వెల్లువెత్తాయి..? ఇప్పటికే జీహెచ్‌ఎంసిలోనే ఈ అక్రమ నిర్మాణాల దందాను అరికట్టడంలో విఫలం అవుతున్న తరుణంలో..! ఆలీబాబా అరడజన్ దొంగలు..? 40 దొంగల్లో విలీనమైన చందంగా తయారైందని, సర్వత్రా వ్యంగ్యారోపణలు వెల్లువెత్తుతున్నాయి..? మొత్తం 300 డివిజన్‌లతో తయారైన హైదరాబాద్ మహానగర పాలక సంస్థను, ఇప్పుడు మూడు కార్పొరేషన్‌లుగా విభజనలో ఎంతవరకు పరిపాలనా సౌలభ్యం సాధ్యమవుతుందో వేచి చూడాలి..ప్రస్తుతం ప్రమాదకర కట్టడాలు ప్రోత్సాహించే అధికారుల విధుల్లో..! భవిష్యత్తులో మరెన్ని అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తారో చూడాలి..!

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 12:

## 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు.. తెలంగాణలోనూ అప్పుడే



హైదరాబాద్ పెన్ పవర్: దేశ వ్యాప్తంగా 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయని, అప్పుడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో

- మిగతా 5లో...

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై
## అఖిల భారత సార్వత్రిక సమ్మె..

### ప్రజావ్యతిరేక చట్టాలు ఉపసంహరించాలని కాంగ్రెస్ లేబర్ సెల్ హెచ్చరిక..

- కేంద్ర ప్రభుత్వ నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు..!
- ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి హక్కులు దెబ్బతింటాయని ఆందోళన..!
- విద్యుత్ సవరణ బిల్లుతో విద్యుత్ చార్జీలు పెరిగి రైతులు, పేదలపై భారం పడే ప్రమాదం.
- విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసీలో 100 శాతం విదేశీ పెట్టుబడుల అనుమతితో ప్రైవేట్..
- విదేశీ కంపెనీల పట్టు పెరుగుతుందని ఆందోళన కారులు ఆగ్రహం..
- ఉపాధి హామీ పథకం మార్పులు పేదల జీవనోపాధిని ప్రభావితం చేస్తాయని హెచ్చరిక..
- ప్రజావ్యతిరేక చట్టాలను ఉపసంహరించక పోతే దేశవ్యాప్తంగా నిరసనలు ఉధృతం..
- అఖిల భారత సమ్మెకు తెలంగాణ కాంగ్రెస్ లేబర్ సెల్ సంపూర్ణ మద్దతుకు ప్రకటన..




-5లో

కేంద్రంలోని బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక మరియు కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా అఖిల భారత సార్వత్రిక సమ్మెకు కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపింది.. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాలు కలిసి కూకట్‌పల్లి నియోజకవర్గంలో భారీ ర్యాలీ నిర్వహించి ధర్నాలో పాల్గొన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ నుంచి విద్యుత్ సవరణ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసీలో విదేశీ పెట్టుబడుల అనుమతి వరకు కేంద్ర నిర్ణయాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులు, సామాజిక భద్రత, రైతుల ప్రయోజనాలు ప్రమాదంలో పడుతున్నాయని నాయకులు ఆరోపించారు.. ప్రజావ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కాంగ్రెస్ లేబర్ సెల్ హెచ్చరించింది. దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెకు తెలంగాణ కాంగ్రెస్ లేబర్ సెల్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఫిబ్రవరి 13:

## తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు
## 15 రోజుల్లో కొత్త ఆరోగ్య పథకం





హైదరాబాద్ పెన్ పవర్: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు కొత్త ఆరోగ్య పథకాన్ని 15 రోజుల్లో ప్రారంభించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. సచివాలయంలో సీఎస్ రామకృష్ణారావు అధ్యక్షతన ఉద్యోగుల హెల్త్‌కేర్ ట్రస్ట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకంపై చర్చించారు. ఉద్యోగుల మూల వేతనంలో 1.5శాతం ఆరోగ్య పథకానికి చెల్లించేలా నిర్ణయించారు. ఉద్యోగులు చెల్లించిన అంతే మొత్తం ప్రభుత్వం కూడా చెల్లించేలా ట్రస్టు నిర్ణయించింది. కొత్త హెల్త్ స్కీమ్‌కు ఉద్యోగులు ఏటా రూ.528 కోట్లు, ప్రభుత్వం కూడా తన వాటాగా రూ.528 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని ఈహెచ్ఎస్ ట్రస్టు అంచనా వేసింది. నూతన ఈహెచ్ఎస్ వివరాలను వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో లక్షా 44 వేల మంది ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు.. వారి డిపెండెంట్లు 12.84లక్షల మంది ఉన్నారని తెలిపారు. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ లో ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు ప్రతినిధులు, పెన్షనర్ల నుంచి ఇద్దరు సభ్యులు ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నుంచి ఒకరిని ట్రస్టు సీఈవోగా నియమిస్తారు. త్వరలో మార్గదర్శకాలు రూపొందించడంతో పాటు... భవిష్యత్తులో అవసరమైన మార్పులు, చేర్పులు చేయనున్నట్లు సీఎస్ తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, మోడల్ స్కూల్స్, గురుకులాల సిబ్బందికి కూడా ఈహెచ్ఎస్ వర్తింపజేయాలని ఉద్యోగ సంఘాలు కోరగా.. పథకం ప్రారంభమైన తర్వాత ట్రస్టులో తీర్మానం చేయవచ్చని సూచించారు. పక్క రాష్ట్రాల్లో అత్యవసరంగా చికిత్స పొందినప్పుడు జునా వర్తింపజేసే విషయం కూడా పరిశీలిస్తామన్నారు. నగదు రహిత వైద్య సేవల కోసం ఇప్పటి వరకు 515 ఆసుపత్రులను గుర్తించినట్లు అధికారులు వివరించారు. సమావేశంలో ఉన్నతాధికారులు సీవీ ఆనంద్, మహేష్ దత్ ఎక్కా, సందీప్ కుమార్ సుల్తానియా, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# టిజి-బిపాస్ చట్టాలెందుకు..? చర్యలు చేపట్టలేని అధికారులెందుకు..?




సెట్‌బ్యాకులు జీరో.. అదనపు అంతస్తులు.. అపురూప కాలనీలో



దుండిగల్ విలేజ్‌లో కాంగ్రెస్ నాయకుని అక్రమ షెడ్డు నివేదికల కోసం, ఫోటోషూట్ చర్యలు..




గాగిల్లాపూర్‌లో ఇటుక బట్టీ వ్యాపారి అక్రమ నిర్మాణం..

## బౌరంపేట్‌లో రెండు సార్లు కూల్చేసి సెటిల్మెంట్‌లు..?

దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్ బౌరంపేట్ పరిధిలోని గండిమైసమ్మ-మియాపూర్ రహదారిపై సాయిబాబా ఆలయం సమీపంలో, అక్రమంగా సెల్లార్‌తో, అనుమతులకు మించి అదనపు అంతస్తుల నిర్మాణంపై ఇటీవల దుండిగల్ మున్సిపల్ అధికారులు బ్రేకర్‌లతో కూల్చివేసిన భవన నిర్మాణంలో యధావిధిగా పనులు చేపట్టడం, ఓ గల్లీ నాయకుని సిఫార్సులు అంటూ, చర్యలు తీసుకోకుండా జీహెచ్ఎంసి పట్టణ ప్రణాళిక అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.. ఈ వ్యవహారంలో భారీగా ముడుపులు ముట్టాయనే ఆరోపణలు ఉండగా..! అధికారులకి తెలియకుండా సాధ్యమేనా అంటూ విమర్శించే వారు ఉన్నారు..! మరోవైపు టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో సిబ్బంది నిత్యం పర్యవేక్షణ ఉన్నప్పటికీ, అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా నిర్లక్ష్యమే..!టిపిఎస్, డిప్యూటీ కమిషనర్, అండ్ ప్రస్తుతం ఏసిపి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్ళినా, ప్రయోజనం శూన్యం.. అధికారుల చర్యలేమో కానీ, నిర్మాణం పూర్తి కావడానికి దగ్గరలోనే ఉంది.. బ్రేకర్‌ల హంగామా "ఫోటోషూట్" చర్యలతో మమాః అనిపించడం కొత్తేమికాదు.. హాస్యాస్పద విషయం ఏమిటంటే, ఈ అక్రమ నిర్మాణాన్ని రెండు సార్లు కూల్చేశామని చైన్‌మెన్ కితాబివ్వడం హాస్యాస్పదం..

## అక్రమ కమర్షియల్ షట్టర్‌లు.. నిర్మాణాలు..

మల్లంపేట్ ఫంక్షన్ హాల్ ఎదురుగా "8 కమర్షియల్ షెట్టర్లకు" పర్మిషన్ జీరో..? మాదాసు రామచంద్ర కాలనీలో, ఆకాశ్ లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే..! గత రెండు నెలలుగా దుండిగల్ సర్కిల్ "ఉప కమిషనర్, మొదలుకొని టౌన్‌ప్లానింగ్ టిపిఎస్, నాటి చైన్‌మెన్" దృష్టికి పలుమార్లు తీసుకెళ్ళినా.. ప్రోత్సహిస్తున్నారే కానీ, చర్యలు చేపట్టడం లేదు..! టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ ఉన్నదే, అక్రమ కట్టడాలు ప్రోత్సాహం, సెటిల్మెంట్‌ల కోసమే అన్నట్టు తయారైంది..? ఇదేనా టిజి-బిపాస్ చట్టం

అమలు చేయడం అంటే..! దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్‌లో ఉప కమిషనర్ నిర్లక్ష్యం, టౌన్‌ప్లానింగ్ అధికారులు టిపిఎస్ నుంచి, ప్రస్తుత అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసిపి) వరకు చర్యలకు తావివ్వకుండా, ప్రమాదకర అక్రమ నిర్మాణాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు..


- 3 పేజి తరువాయి

దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్-59 పరిధిలోని మల్లంపేట్ గ్రామం.. మున్సిపల్ అధికారులకు కామధేనువుగా మారింది.. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి సిరులు కురిపించే కల్పవృక్షంంగా తయారైందని ఆరోపణలు వస్తున్నాయి.. మరోవైపు దుండిగల్ మున్సిపాలిటీపై గతంలోనూ అటు "విజిలెన్స్ వ్యవస్థ" ఇటు లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ సహా, "సిడిఎంఎ"(కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తెలంగాణ) అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించారని, అనడానికి వందల సంఖ్యలో నిదర్శనాలు ఉన్నాయి..

"టిజి-బిపాస్" చట్టాన్ని అమలు చేసిన దాఖలాలు మచ్చుకు కూడా లేవంటే అతిశయోక్తి కాదు.. అక్రమ కట్టడాల నియంత్రణ సంగతేమో కానీ..! టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరు బరితెగింపుకు 'బ్రాండ్ అంబాసిడర్' అని చెప్పవచ్చు..!

ప్రస్తుతం దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్‌గా మారినా, అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదంటే అతిశయోక్తి కాదు.. మల్లంపేట్‌లో పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయని వరుస కథనాలు వచ్చినా..! మామూళ్ళ మత్తులో జోగుతున్నారు.. దుండిగల్ జీహెచ్ఎంసి పరిధిలోని మల్లంపేట్, బౌరంపేట్, గాగిల్లాపూర్, గండిమైసమ్మ, దుండిగల్‌లో అక్రమ నిర్మాణాల చిట్టాను అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం..






మల్లంపేట్ సాయిబాలాజీ లో ఎంట్రన్స్‌లోనే..

## ఇక్కడ అపురూపలో.. అక్కడ గాగిల్లాపూర్‌లో..

గండిమైసమ్మ అపురూప కాలనీలో, గాగిల్లాపూర్‌లో ఇటుక బట్టీల వ్యాపారులు, భావ బామ్మర్దులు, అనుమతులు ఒకరకం, నిర్మాణాలు మరో రకంగా నిర్మించారని వార్తా కథనాలతో దుండిగల్ సర్కిల్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా చర్యలు తీసుకోలేదు.. సెటిల్మెంట్‌లు చేసుకుని సైలెంట్ అయినట్టు ఆరోపణలు వస్తున్నాయి.. గాగిల్లాపూర్ సర్వే నెం.235లో..! ఇటుక బట్టీల వ్యాపారి ఏడాదిన్నర క్రితం నిర్మించిన పాతింటిపై కొత్తగా, రెండంతస్తులు అదనంగా నిర్మిస్తున్నా అధికారుల తీరు "ముడుపుల కోసమే" విధులు అన్నట్టు వ్యవహరిస్తూ, చర్యలకు దూరంగా ఉండటం గమనార్హం.. గాగిల్లాపూర్‌లో చంద్రన్న అక్రమ కట్టడంలో.. పార్కింగ్ ఆక్రమణ.. పైన అదనంగా రెండంతస్తులు.. గండిమైసమ్మ అపురూప కాలనీలో, స్టిల్ట్ +3 పర్మిషన్‌తో అదనంగా రెండు అంతస్తులు.. అధికారులు అందరూ మనవారే..! అంటూనే చంద్రన్న టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి కూడా దమ్కి ఇస్తూనే..! కావాలంటే ఫోన్ చేయాలా అంటూ, ప్రశ్నించిన వారికి కూడస చెప్పడం విశేషం..

అధికారుల లాలూచికి అక్రమార్కుల బరితెగింపు అందుకు ఈ బావా బామ్మర్దికి చెందిన రెండు అక్రమ నిర్మాణాలు ప్రత్యేక నిదర్శనం.. కొందరు అవినీతి అధికారుల పరిచయాన్ని అదనుగా తీసుకుని, తమకు అందరూ తెలుసని, ఏం చేస్తారో చేసుకోమని చెప్పడం విశేషం.. సంబంధిత అక్రమ నిర్మాణ దారులు వ్యవహార శైలి, అధికారుల చేతివాటాన్ని బట్టబయలు చేస్తోంది..





మల్లంపేట్ కేవిఆర్ వ్యాలీలో, పాత ఇంటిపై కొత్తగా అక్రమ నిర్మాణం..




దుండిగల్ సర్కిల్ అధికారులు కూల్చేశామని చెప్పిన అక్రమ నిర్మాణం ఇదే..



మల్లంపేట్ ఆకాశ్ లేఅవుట్‌లో అదనపు అంతస్తులు..



# మంచిర్యాల జిల్లాలో కొర్రమీను క్లస్టర్

**అదిలాబాద్, ఫిబ్రవరి 12, పెన్ పవర్:**
తెలంగాణలో కొర్రమీను క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మంచిర్యాల జిల్లాలో ఈ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ లోక్‌సభలో స్పష్టం చేశారు. దాంతో పాటుగా
హైదరాబాద్ నగరంలో అతిపెద్ద హోల్‌సేల్ చేపల మార్కెట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇవి అందుబాటులోకి వస్తే తక్కువ ధరకే చేపలు దొరకనున్నాయి.తెలంగాణకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలోప్రత్యేకంగా కొర్రమీను క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. దాంతో పాటుగా నాలుగు పట్టణాల్లో ఫుడ్ స్ట్రీట్ల ఏర్పాటుకు సాయం చేస్తామంది. ఈ మేరకు లోక్‌సభలో కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌స్పష్టం చేశారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు బదులిచ్చిన ఆయన ప్రధాన మంత్రి మత్స్య యోజన కింద తెలంగాణలో రూ.196.80 కోట్ల విలువైన ప్రతి పాదనలకు ఆమోదం తెలిపినట్లువెల్లడించారు. రాజధాని హైదరాబాద్ నగరంలో అత్యాధునిక హోల్‌సేల్ చేపల మార్కెట్, మంచిర్యాల జిల్లాలో కొర్రమీను ఉత్పత్తి, ప్రాసెసింగ్ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారుఇక రాష్ట్రంలోని మరో నాలుగు పట్టణాల్లోహెల్తీ అండ్ హైజీనిక్ ఫుడ్ స్ట్రీట్స్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి ప్రతాప రావు జాదవ్ ప్రకటించారు. బీఆర్ఎస్ ఎంపీ సురేష్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ శివారునార్సింగి, వరంగల్, నల్లగొండ, సిద్దిపేటలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద వీటిని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఒక్కో ఫుడ్ స్ట్రీట్‌కు రూ.కోటి చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల
జిల్లాల్లోని పత్తి రైతుల కోసం సీసీఐ కొనుగోలు కేంద్రాల సంఖ్యను కూడా పెంచినట్లు కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గరీటా వెల్లడించారు. ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించిన వార్షిక ఆదాయ పరిమితిని పెంచే
ప్రతిపాదన ఏదీ తమ వద్ద లేదని కేంద్ర మంత్రి బీఎల్ వర్మ వెల్లడించారు.కాగా, హైదరాబాద్ నగరంలో అతిపెద్ద చేపల మార్కెట్, మంచిర్యాలలో
కొర్రమీను క్లస్టర్ ఏర్పాటు చేయటం ద్వారా తక్కువ ధరకే చేపల లభించేఛాన్స్ ఉంది. ప్రస్తుతం తెలంగాణలోని చెరువులతో పాటు ఏపీ సముద్రతీరం నుంచి ఎక్కువగా చేపలు వస్తుంటాయి. అయితే సుదూర ప్రాంతాల నుంచి చేపలు దిగుమతి చేసుకుంటుండటం వల్ల చేపల ధరలు ఎక్కువగా
ఉంటున్నారు. అతిపెద్ద హోల్‌సేల్ మార్కెట్లు అందుబాటులోకి వస్తే భోజన ప్రియులకు తక్కువ ధరకే చేపలు దొరకనున్నాయి

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి





# కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై
# అఖిల భారత సార్వత్రిక సమ్మె




## ప్రజావ్యతిరేక చట్టాలు ఉపసంహరించాలని కాంగ్రెస్ లేబర్ సెల్ హెచ్చరిక..

కేంద్రంలోని బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక మరియు కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా అఖిల భారత సార్వత్రిక సమ్మెకు కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపింది.. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాలు కలిసి కూకట్‌పల్లి నియోజకవర్గంలో భారీ ర్యాలీ నిర్వహించి ధర్నాలో పాల్గొన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ నుంచి విద్యుత్ సవరణ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసీలో విదేశీ పెట్టుబడుల అనుమతి వరకు కేంద్ర నిర్ణయాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులు, సామాజిక భద్రత, రైతుల ప్రయోజనాలు ప్రమాదంలో పడుతున్నాయని నాయకులు ఆరోపించారు.. ప్రజావ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కాంగ్రెస్ లేబర్ సెల్ హెచ్చరించింది. దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెకు తెలంగాణ కాంగ్రెస్ లేబర్ సెల్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.. **కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఫిబ్రవరి 13:**





కేంద్రంలోని బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రకటించిన కార్మిక వ్యతిరేక మరియు కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ మరియు కేంద్ర-రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల భారత సార్వత్రిక సమ్మెకు విస్తృత స్పందన లభించింది. టీపీసీసీ లేబర్ సెల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు కందాడి సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో సీఐటీయు, ఐఎన్‌టియుసి తదితర సంఘాల నాయకులు, కార్యకర్తలు కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా నుంచి బాలానగర్ ఇండస్ట్రియల్ ఏరియా మీదుగా రాజు కాలనీ డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నాలో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం పెరుగుతున్న సమయంలో ఉపాధి హక్కులను దెబ్బతీసే విధానాలు అమలు చేయడం అన్యాయమని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్స్ ద్వారా బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు సాధించుకున్న 29 చట్టాలను బలహీన పరుస్తూ యాజమాన్యాలకు లాభం చేకూర్చే పరిస్థితి తీసుకొచ్చిందన్నారు. ఉద్యోగ భద్రత తగ్గిపోవడంతో పాటు సామాజిక భద్రతా పథకాల నుంచి కార్మికులు దూరమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.. విద్యుత్ సవరణ బిల్లు అమల్లోకి వస్తే విద్యుత్ చార్జీలు పెరిగి రైతులు, పేదలకు ఇబ్బందులు తలెత్తుతాయని, రాష్ట్రాల హక్కులు కూడా తగ్గిపోతాయని పేర్కొన్నారు..

### దేశీయ భీమా రంగం విదేశీ ఆధీనంలోకి వెళ్లే ప్రమాదం..!

విత్తన సవరణ బిల్లు ద్వారా విత్తనాల ధరల నియంత్రణ ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లి సాగు ఖర్చులు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ఐసీలో నూటికి నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతి ఇవ్వడం వల్ల దేశీయ భీమా రంగం విదేశీ ఆధీనంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆరోపించారు.. ప్రజలకు మేలు చేస్తున్నట్టు కేంద్రం తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించిన ఆయన, ఈ ప్రజావ్యతిరేక నిర్ణయాలను కాంగ్రెస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని స్పష్టం చేశారు. చట్టాలను ఉపసంహరించక పోతే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అన్ని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల అనుబంధ సంస్థలు ఒకే తాటిపైకి వచ్చి సామాన్య ప్రజల హక్కుల కోసం పోరాడతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న అఖిల భారత సార్వత్రిక సమ్మెకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు

- కేంద్ర ప్రభుత్వ నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు..!
- ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి హక్కులు దెబ్బతింటాయని ఆందోళన..!
- విద్యుత్ సవరణ బిల్లుతో విద్యుత్ చార్జీలు పెరిగి రైతులు, పేదలపై భారం పడే ప్రమాదం.
- విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసీలో 100 శాతం విదేశీ పెట్టుబడుల అనుమతితో ప్రైవేట్..
- విదేశీ కంపెనీల పట్టు పెరుగుతుందని ఆందోళన కారులు ఆగ్రహం..
- ఉపాధి హామీ పథకం మార్పులు పేదల జీవనోపాధిని ప్రభావితం చేస్తాయని హెచ్చరిక..
- ప్రజావ్యతిరేక చట్టాలను ఉపసంహరించక పోతే దేశవ్యాప్తంగా నిరసనలు ఉధృతం..
- అఖిల భారత సమ్మెకు తెలంగాణ కాంగ్రెస్ లేబర్ సెల్ సంపూర్ణ మద్దతుకు ప్రకటన..


# 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు.. తెలంగాణలోనూ అప్పుడే

-3 పేజి తరువాయి
కేంద్రమంత్రులను కలిసిన అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు బుల్లెట్ రైలు వచ్చిందని, హైదరాబాద్‌ను బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు హబ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు ఫ్యూచర్ సిటీ, ఎయిర్‌పోర్టు సమీపంలో 500-700 ఎకరాలు ఇవ్వాలనుకుంటున్నట్టు చెప్పారు.
"ఎన్టీఆర్ జాతీయ నాయకుడు.. అమీర్‌పేటలో ఆయన విగ్రహం పెట్టి తీరుతాం. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తా. నూటికి నూరు శాతం మా ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ లేదు. నాలుగు గోడల మధ్య జరిగే వ్యవహారం నాకు అవసరం లేదు. నేను ప్రజల అభిప్రాయం మాత్రమే తెలుసుకుంటాను. ఎస్ఐబీలో పరికరాల మాయంతో ఫోన్ ట్యాపింగ్ కేసు బయటపడింది. ఎస్ఐబీ ఫిర్యాదుతోనే ఆ కేసు దర్యాప్తు జరుగుతోంది. కిషన్‌రెడ్డి లేఖ రాస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు కూడా సీబీఐకి ఇస్తాం. నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. 2018లో తెచ్చిన నిబంధనల మేరకే సింగరేణిలో టెండర్లు. సింగరేణి టెండర్లపై ప్రతి డాక్యుమెంట్‌ను అసెంబ్లీలో పెడతాం. ఆరోపణలు తప్పని తేలితే కిషన్‌రెడ్డి క్షమాపణలు చెబుతారా? సింగరేణి సంస్థ అప్పులు మా హయాంలో పెరగలేదు. సింగరేణికి కేసీఆర్ పెట్టిన బకాయిలే ఎక్కువ. సింగరేణి విషయంలో కేసీఆర్‌ను కిషన్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదు. మెత్తగా ఉన్నానని.. కిషన్‌రెడ్డి నన్ను మాత్రమే ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్‌కు రాజకీయ ప్రత్యర్థులే తప్ప.. శత్రువులు లేరు. కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ లేఖ రాసి 6 నెలలు అయ్యింది. దీనిపై కేంద్రం ఇంతవరకు ఎందుకు నిర్ణయం తీసుకోలేదు. విద్యుత్ కొనుగోలు వ్యవహారం కేసును త్వరలోనే సీబీఐకి ఇస్తాం" అని సీఎం తెలిపారు.

# కొత్త సీఎస్ జయేష్ రంజన్..?

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మార్చి 31న పదవీ విరమణ చేయనున్నారు. వాస్తవానికి ఆయన 2025 ఆగస్టు 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే, ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం ఆయన పదవీ కాలాన్ని మరో ఏడు నెలల పాటు అంటే ఈ ఏడాది మార్చి 31 వరకూ పొడిగించారు. అందుకే మరోసారి ఆయనకు పొడిగింపు వచ్చే అవకాశం లేదని భావిస్తున్నారు. ఆయన పదవీ విరమణ దగ్గర పడుతుండటంతోనే, ఇప్పుడు కొత్త సీఎస్ ఎంపికపై చర్చ మొదలైంది. నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రేసులో సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్ పేరుప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుత పరిణామాలను గమనిస్తుంటే, 1992 బ్యాచ్‌కు చెందిన ఆయన ఈ అత్యున్నత పదవికి ప్రధాన పోటీదారుగా ఉన్నట్లు సచివాలయ వర్గాల సమాచారం. రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంపైపూర్తి పట్టు ఉండటంతో పాటు, గత దశాబ్ద కాలంగా కీలక శాఖల్లో ఆయన అందించిన సేవలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ దిశగా మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం జయేష్ రంజన్ మెట్రోపాలిటన్‌ప్రాంతం, పట్టణాభివృద్ధి శాఖకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని పట్టణ పాలనతో పాటు.. యువజన పురోగతి, పర్యాటక, సాంస్కృతిక శాఖ, క్రీడల శాఖ , పురావస్తు శాఖడైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా, దేశవ్యాప్తంగా యువ సివిల్ సర్వెంట్లకు మార్గనిర్దేశం చేసే నేషనల్ పూల్ ఆఫ్ ట్రైనర్స్ ఇన్ లీడర్‌షిప్‌లో ఆయన సభ్యులుగాకొనసాగుతున్నారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఐటీ, పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖల సారథిగా జయేష్ రంజన్ చెరగని ముద్ర వేశారు. దాదాపు పదేళ్ల పాటు ఈ శాఖలను పర్యవేక్షించిన ఆయన, రాష్ట్రానికి భారీపెట్టుబడులను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా భారత్‌లోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్ అయిన 'టీ-హబ్' ఏర్పాటు, వినూత్నమైన ఐటీ , పారిశ్రామిక విధానాల రూపకల్పనలో ఆయన కృషిమరువలేనిది. విదేశీ పర్యటనల ద్వారా గ్లోబల్ ఇన్వెస్టర్లను తెలంగాణ వైపు ఆకర్షించడంలో ఆయన ప్రత్యేకత చూపిస్తారు. జయేష్ రంజన్ 1992 ఐఏఎస్ బ్యాచ్ ఆల్ ఇండియా టాపర్‌గా నిలిచారు. ఐఐఎం కలకత్తా , సింగపూర్‌లోని లీ క్వాన్ యూ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల నుంచి విద్యనభ్యసించిన ఆయన, విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో దిట్టగా పేరు పొందారు. గత ఏడాది కాలంగా వివిధపాలనాపరమైన మార్పుల్లో భాగంగా డిసెంబర్ 2025లో ఆయన పరిశ్రమల శాఖ నుంచి పట్టణాభివృద్ధి శాఖకు బదిలీ అయ్యారు.రాష్ట్ర బ్యూరోక్రసీలో అగ్రస్థానంలో మార్పులు జరగనున్న తరుణంలో, జయేష్ రంజన్‌అనుభవం , ప్రభుత్వ ప్రాధాన్యతలపై ఆయనకున్న అవగాహన సీఎస్ పదవికి ఆయనను ముందు వరుసలో నిలబెడుతున్నాయి. అధికార వర్గాల్లో ఉన్న క్లీన్ ఇమేజ్, పాలనాపరమైన కొనసాగింపు దక్కుతుందన్ననమ్మకం అధికార వర్గాల్లో ఉంది. ప్రభుత్వం త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.జయేష్ రంజన్ కంటే సీనియర్లు శశాంక్ గోయల్ , అరవింద్ కుమార్ ఉన్నారు. అరవింద్ కుమార్ పై ఫార్ములా ఈ రేసు కేసు ఉంది. దాంతో ఆయన పేరు పరిశీలనలోకి తీసుకునే అవకాశం లేదు. మరో సీనియర్‌అధికారి వికాస్ రాజ్ కూడా రేసులో ఉన్నారు. అయితే ప్రభుత్వ పెద్దలకు అన్నీ తానై వ్యవహిరంచే జయేష్ రంజన్ కే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లుగా భావిస్తున్నారు

# సీసీ కళ్లతో ఇంటర్ పరీక్షలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 12, పెన్ పవర్:**
తెలంగాణలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 17వ తేదీ వరకు జరగనున్న సంగతి తెలిసిందే. ఇక ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయి. సీసీ కెమెరాల నిఘాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఇంటర్ బోర్డ్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య తెలిపారు. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గత ఏడాది నుంచే కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభించామన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు పెట్టి సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూమ్‌లో మోనిటర్ చేస్తుంటారు. సరిగ్గా ఇదే మాదిరి ఇంటర్ పరీక్షలను కూడా నిర్వహిస్తున్నామని కృష్ణ ఆదిత్య పేర్కొన్నారు. అయితే ఎన్నికలు ఒక్క రోజు మాత్రమే ఈ విధానం ఉంటుంది. కానీ 2 వారాల పాటు జరిగే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు, మూడు వారాలు నిర్వహించే థియరీ పరీక్షలు అన్ని రోజుల్లో సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూమ్‌లో మోనిటర్ ఉంటుందని వివరించారు.గతేడాది కొన్ని ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో సమస్యల కారణంగా పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలను ఇన్‌స్టాల్ చేయలేదని, ఈసారి అకడమిక్ క్యాలెండర్ మొదలైనప్పటి నుంచి సర్క్యులర్ జారీ చేసిటన్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల మేనేజ్మెంట్లు దీనిలో భాగస్వామ్యమయ్యాయని అన్నారు. కాలేజీల్లోని ఈ కెమెరాలను కంట్రోల్ రూమ్ సర్వర్‌తో అనుసంధానం చేసుకున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాల్లో 1440 సీసీ కెమెరాలు ఉన్నట్లు తెలిపారు. బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమెస్ట్రీ ల్యాబ్‌తో పాటు ప్రశ్న పత్రం ఓపెన్ చేసే గదుల్లో, మార్కులు వేసే ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మానిటరింగ్‌కు కమాండ్ కంట్రోల్లో 100 మంది స్టాఫ్ ఉన్నారని ఆయన తెలిపారు. మొత్తం 36 స్క్రీన్లు అందుబాటులో ఉండగా.. ఒక్కో స్క్రీన్‌కు ముగ్గురు స్టాఫ్‌లను కేటాయించామని అన్నారు.ప్రశ్న పత్రం ఓపెన్ చేసినప్పటి నుంచి పరీక్ష పూర్తయ్యే వరకు వీరు నిరాటంకంగా మానిటరింగ్ చేస్తారని బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య తెలిపారు. ఈ ప్రక్రియలో ఏ సెంటర్లలో అయినాస్లిప్స్ వచ్చినట్లు గుర్తించినా, కాపీ కొడుతున్నట్లు మోనిటరింగ్‌లో తేలితే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. వీరితో పాటు ప్రతి జిల్లాలో డీఈసీ (డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ)కి సంబంధించిన ఫ్లైయింగ్ స్క్వాడ్స్, సిటింగ్ స్క్వాడ్స్ పూర్తిగా అందుబాటులో ఉంటారు. వీరి విధులను కూడా సీసీకెమెరాల ద్వారా మోనిటరింగ్ ఉంటుంది. మోనిటరింగ్‌కి ముందు స్పెల్ ప్రక్రియ జరిగినట్లు తెలిపారు. ఫిబ్రవరి 2 నుంచి 6 వరకు సుమారు 968 సెంటర్లలో ఈ పరీక్ష ప్రక్రియ జరిగింది. ఈ మానిటరింగ్ సమయంలో ఏదైనా పరీక్షా కేంద్రం తప్పుజరిగినట్లు అధికారులు గుర్తిస్తే అప్పటి కప్పుడు ఇన్స్పెక్షన్ టీమ్‌ను పంపించి, వారి రిపోర్టు ఆధారంగా అక్కడి ఎగ్జామినర్‌ను రీకాల్ చేస్తున్నామన్నారు. ఏదైనా కంప్లైంట్స్ వస్తే మాల్ ప్రాక్టీస్ కమిటీ అందరినీ రిఫల్ చేస్తుందని, పైగా సీసీ కెమెరాల ఫుటేజీ ఒక నెల రోజులపాటు ఉంటుందని వివరించారు. పరీక్షలు రాస్తున్న సమయంలో విద్యార్థులు కదిలిన ప్రతి సారీ ఓ గ్రీన్ లైట్ వెలుగుతుందని, దీంతో ఆ విద్యార్థిపై నిఘా పెట్టడం మరింత సులభతరం అవుతుందని తెలిపారు.

# మూసీ భూసేకరణ ప్రక్రియ ప్రారంభం



**హైదరాబాద్, ఫిబ్రవరి 12, పెన్ పవర్:**
మూసీ నదిని ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా కీలక ప్రాజెక్టు చేపడుతున్న తెలంగాణ సర్కార్.. దానికి సంబంధించి కీలక చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్టులో అతి ముఖ్యమైన భూసేకరణ ప్రక్రియనుప్రారంభించింది. 50 ఎకరాల భూమిని సేకరించేందుకు చర్యలు చేపట్టింది. భూ సేకరణకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసిన సర్కార్.. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని పేర్కొంది. మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపింది.మూసీ సుందరీకరణ కోసం కంకణం కట్టుకున్న రేవంత్ రెడ్డి సర్కార్.. ఆ దిశగా కీలక ముందడుగు వేసింది. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు సంబంధించి కీలక అప్‌డేట్‌ను అధికారులు వెల్లడించారు. మూసీ ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియను మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలోనే మూసీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు భూసేకరణ కోసం.. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) కీలక ప్రకటన చేసింది. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న వారు ఏవైనా అభ్యంతరాలు ఉంటే.. నిర్ణీత గడువులో తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.ఫేజ్ ‒1 కింద.. హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు మొత్తం 9.2 కిలోమీటర్ల మేర భూ సేకరణ చేయనున్నారు. ఫేజ్‒2 లో భాగంగా ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు ఉన్న 11.8 కిలోమీటర్ల భూమిని సేకరించనున్నారు. హైదరాబాద్ జిల్లా గోల్కొండ మండలం.. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో ఉన్న భూముల సేకరణ కోసం తాజాగా ఎంఆర్‌డీసీఎల్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగానే సుమారు 50 ఎకరాలకు పైగా భూమిని సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.మార్కెట్ విలువ ఆధారంగా భూమిని ఇచ్చే యజమానులకు పరిహారం ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందులో భాగంగానే వారి భూమి పట్టాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్లకు సంబంధించిన వివరాలను ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది. ఇక అభ్యంతరాల కోసం గడువు ప్రకటించిన ప్రభుత్వం.. ఆలోగా ఏదైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే ఆయా భూముల సర్వే నంబర్లు.. గ్రామాల వారీగా పూర్తి లిస్ట్‌ను విడుదల చేసింది.భూ సేకరణ చట్టం-2013 నిబంధనల ప్రకారం ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను చేపట్టనుంది. మొత్తం 4 జిల్లాల పరిధిలో భూసేకరణ చేపట్టనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మూసీ డెవలప్‌మెంట్ పనులు చేపట్టనున్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల పరిధిలో.. 14 మండలాల్లోని మొత్తం 46 గ్రామాల్లో పలు దశల వారీగా మూసీ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు

## కడుపు నొప్పితో ఇంటర్ విద్యార్థిని మృతి

**యాకత్‌పురా, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం.డి.సనా (16) అనే విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. కళాశాల నుంచి ఇంటికి వచ్చిన సనా రాత్రి భోజనం తర్వాత నిద్రించింది. అర్ధరాత్రి కడుపు నొప్పితో బాధపడగా, కొద్దిసేపటికి తగ్గింది. తెల్లవారుజామున తీవ్రమైన నొప్పితో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు ఆమెను శంషాబాద్‌లోని లిమ్స్ ఆసుపత్రికి, అనంతరం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఒకే కుటుంబం.. మూడు తరాల ఓట్లు!

**స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల్లో సుదర్శనం-సరోజన దంపతులతో పాటు వారి కుటుంబంలోని మూడు తరాలకు చెందిన తొమ్మిది మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపల్ పరిధిలోని శివునిపల్లిలో ఒకే వార్డులో వీరంతా ఓటు వేశారు. ఇందులో కొడుకులు, కోడళ్లు, మనుమరాళ్లు, బిడ్డ, అల్లుడు ఉన్నారు.

# కార్మిక వ్యతిరేక కోడ్ లకు వ్యతిరేకంగా సీపీఐ ఆందోళన

**కొత్తగూడెం, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** కొత్తగూడెం జిల్లాలో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తిప్పి కొట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. దేశాన్ని దోచుకుంటున్న కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సవరించి, నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందని, వీటిని పార్లమెంటులో ప్రతిపక్షాల వ్యతిరేకత మధ్య ఆమోదింప చేసుకున్నారని తెలిపారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 2025 నవంబర్ లో నోటిఫై చేసి, 2026 ఏప్రిల్ నుండి అమలుకు సిద్ధమవుతోందని ఆయన పేర్కొన్నారు.

## అశ్వారావుపేటలో ఎన్నికల అనంతర వింత:
# డబ్బు, కుక్కర్ల వెనక్కి డిమాండ్

**అశ్వారావుపేట, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీలో ఎన్నికల అనంతరం ఒక వింత సంఘటన వెలుగులోకి వచ్చింది. పదో వార్డులో కొందరు వ్యక్తులు అర్ధరాత్రి ఇళ్లకు వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని డబ్బులు, కుక్కర్లు పంచినట్లు ఓటర్లు తెలిపారు. ఎన్నికల తర్వాత, డబ్బులు, కుక్కర్లు పంచిన వ్యక్తి వాటిని వెనక్కి ఇవ్వాలని వేధిస్తున్నాడని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. తమకు అడగకుండానే బహుమతులు ఇచ్చి, ఇప్పుడు వెనక్కి అడగడం ఏమిటని, కౌంటింగ్ జరగకముందే ఓట్లు ఎలా వేశారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మహిళలు తమకు ఇచ్చిన కుక్కర్లను రోడ్డుపై పడేశారు.

# మైనార్టీ మహిళలను నిర్బంధించిన సీఐపై nKm ఆగ్రహం

**పినపాక, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ 49వ డివిజన్‌లో మైనార్టీ మహిళలను దొంగ ఓటు వేస్తుందన్న ఆరోపణలతో పోలీస్ స్టేషన్లో నాలుగు గంటల పాటు నిర్బంధించడం హేయమైన చర్య అని అఖిఎ జిల్లా కార్యదర్శి అన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పార్టీ నాయకులు అక్కడికి చేరుకుని సీఐ సతీష్‌ను బయటకు రావాలని నిరసన తెలిపారు. అధికార పార్టీ నాయకులు, పోలీసుల అతి ఉత్సాహంతో అన్ని డివిజన్ బూత్‌ల వద్ద వన్ సైడ్ వార్‌గా వ్యవహరించారని ఆరోపించారు.

# సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన

**ఇల్లందు, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** కొత్తగూడెం జిల్లాలో, సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు గురువారం కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే నిలిపివేయాలని, 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని, కొత్త బొగ్గు బావులను ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, కార్మిక చట్టాలను మార్చడం వల్ల కార్మిక వర్గం నష్టపోతుందని, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఈ సమ్మె దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు తలపెట్టిన ఒకరోజు సమ్మెలో భాగంగా జరిగింది.

## గ్రామీణ క్రీడాకారులకు సీఎం కప్ తో ప్రోత్సాహం:

**భూపాలపల్లి, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని చెల్పూర్ ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో సోమవారం సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడాపోటీలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తోందని, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతిభ కనబరిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపుతో పాటు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు.

# 828 హుండీలతో రూ.13.25 కోట్లు ఆదాయం

**ములుగు, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** ప్రపంచ ప్రఖ్యాత మేడారం సమ్మక్క?సారలమ్మ మహాజాతర హుండీ లెక్కింపు ప్రక్రియ తో ముగిసింది. హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన ఈ లెక్కింపులో మొత్తం 828 హుండీలను తెరిచి, నగదు, ఆభరణాలను లెక్కించారు. వారం రోజుల పాటు సుమారు 400 మంది సిబ్బంది, దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఈ లెక్కింపు చేపట్టారు. మొత్తం రూ. 13,25,83,269 ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. హుండీల్లో నగదుతో పాటు విదేశీ కరెన్సీ, రద్దు నోట్లు, బంగారు ఆభరణాలు కూడా లభించాయి.

## లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కార్మికుల నిరసన




**నర్సంపేట, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం భారతదేశ వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ పిలుపులో భాగంగా వరంగల్ జిల్లాలోని నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం, నెక్కొండ మండల కేంద్రాలలో ఏఐఎఫ్టియు న్యూ మరియు ఇతర కార్మిక సంఘాలు కలిసి సమ్మె సందర్భంగా ప్రదర్శనలు, రాస్తారోకోలు నిర్వహించాయి.

# వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద కార్మిక సంఘాల నిరసన

**జనగామ, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా, వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద కార్మిక సంఘాలు భారీ నిరసన చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ ట్రేడ్ యూనియన్ల నాయకులు, వామపక్ష పార్టీల కార్యకర్తలు నినదించారు. రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రదర్శన నిర్వహించి, కార్మికుల హక్కులను కాలరాసే నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని వారు కోరారు.

## రసూల్ పల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం: ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

**మంచిర్యాల, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** జైపూర్ మండలం రసూల్ పల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు బైక్ పై వెళుతుండగా ప్రమాదానికి గురయ్యారు. ఈ దుర్ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## వర్క్ షాప్ లో చోరీ

**చెన్నూరు, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** మందమర్రి వర్క్ షాప్ లో నిలువ ఉంచిన ట్రాన్స్ఫార్మర్ల నుంచి కాపర్ వైరు చోరీ జరుగుతున్న విషయం గురువారం వెలుగు చూసింది. ఏరియాలోని గనులు, డిపార్ట్మెంట్లలో వినియోగించిన ట్రాన్స్ఫార్మర్లను వర్క్ షాపులలో నిలువ ఉంచుతారు. దుండగులు బాక్సులను తెరిచి కాపర్ దొంగిలించి, తిరిగి కవర్లు బిగించారు. ఈ చోరీలో సుమారు లక్ష రూపాయల విలువైన కాపర్ దొంగిలించబడినట్లు సమాచారం. విషయం బయటకు పొక్కడంతో అధికారులు విచారణ చేపట్టారు.

## ఓటుకు దూరంగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** నెన్నెల మండలం జెండా వెంకటాపూర్ లో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఓటు నమోదు కాకపోవడంతో, జరిగిన బెల్లంపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో ఆయన తన ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. మున్సిపల్ ఎన్నికలకు ముందుండి నడిపించినప్పటికీ, పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు వేయలేకపోయారు. దీంతో మాజీ ఎమ్మెల్యే తన ఓటుకు దూరమయ్యారు.

## త్రాగునీటి బోరింగ్‌పై అటవీశాఖ అడ్డంకి, గ్రామస్తుల రాస్తారోకో

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగపూర్ మండలం మోతిగూడ గ్రామంలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామస్తులు తమ నిధులతో బోరుబావి తవ్వించేందుకు ప్రయత్నించగా, రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉందని, అనుమతి లేకుండా పనులు చేయరాదని అటవీశాఖ అధికారులు సాయంత్రం అడ్డుకున్నారు. దీనికి నిరసనగా, తాము తాతల కాలం నుంచి ఇక్కడే నివసిస్తున్నామని పేర్కొంటూ గ్రామస్తులు రోడ్డుపై వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. అటవీశాఖ అధికారులు, గ్రామస్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు శాంతింపజేసే ప్రయత్నం చేసినా, కొంతసేపు ఉద్రిక్తత నెలకొని వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

**సిర్పూర్, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న కలపను అటవీ శాఖ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఈ మేరకు వివరాలను ఎఫ్‌డీవో విశ్వనాథ్ వెల్లడించారు. ఇచ్చోడకు చెందిన గుత్తేదారు క్రాంతి, గుండాలకు చెందిన హాతీం రూ.64 వేలు విలువైన 18 టేకు దుంగలను గౌట్కూరికి చెందిన వడ్రంగి ద్వారా కొనుగోలు చేశారు. అనంతరం షేక్ అబ్బుకు చెందిన వాహనంలో తరలిస్తుండగా ఆదిలాబాద్ దస్నాపూర్ వద్ద అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్ షేక్ అబ్బును అరెస్ట్ చేశామని, మరో ముగ్గురు పరారిలో ఉన్నట్లు తెలిపారు.

## వేంపల్లిలో బేటి బచావో - బేటి పడావో కార్యక్రమం



**కోరుట్ల, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామంలోని ప్రైమరీ స్కూల్లో గురువారం బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గుగ్లావత్ రాజేందర్, వెంకట్రావుపేట్ సర్పంచ్ కనుమల వెంకటేష్, పోస్ట్ మాన్ సుమతి, పాలకవర్గం, స్కూల్ టీచర్లు, విద్యార్థినిలు, మరియు వివిధ అధికారులు పాల్గొన్నారు. ఆడపిల్లలను కాపాడటం, వారికి విద్యను అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది.

## పట్టపగలే చైన్ స్నాచింగ్.. దుండగుల పరార్

**జగిత్యాల, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** జగిత్యాల అరవింద్ నగర్ కాలనీలో రోడ్డుపై నడుచుకుంటూ వెళు_న్న తల్లి కూతుళ్ల మెడలోంచి ఇద్దరు దుండగులు బుల్లెట్ బైక్ పై వచ్చి బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఒంటరిగా వెళ్తున్న మహిళలను గమనించి, వారిపై దాడి చేసి చైన్ లాక్కోవడంతో మహిళకు గాయాలయ్యాయి. కూతురు కేకలు వేసినా దుండగులు అక్కడి నుంచి పారిపోయారు.

## బావిలో పడి విద్యార్థి మృతి

**ధర్మపురి, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లిలో విషాదం చోటుచేసుకుంది. రేగు పండ్ల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి 6వ తరగతి విద్యార్థి మృతి చెందాడు. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి రాగా, కుమారుడు కనిపించలేదు. ఉదయం వ్యవసాయ బావి వద్ద బాలుడి చెప్పులు కనిపించడంతో అనుమానంతో నీటిని తోడించగా మృతదేహం లభ్యమైంది. రేగు పండ్ల కోసం వెళ్లి బావిలో పడినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక ఏఎస్సై వెంకట్రెడ్డి తెలిపారు.

## బాల సదన్‌లో కల్తీ ఆహారం.. 32 మంది విద్యార్థులకు అస్వస్థత!

**పెద్దపల్లి, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** పెద్దపల్లి బాల సదన్‌లో రాత్రి కల్తీ ఆహారం తిని 32 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. సంక్షేమ శాఖ అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అయితే, అధికారులు మాత్రం అస్వస్థత కాలేదని, రెగ్యులర్ చెకప్ కోసం ఆసుపత్రికి వెళ్లామని, రాత్రి పూట చెకప్ అంటూ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని సమాచారం. ఈ ఘటనపై విచారణ జరగాలని బాధితుల బంధువులు కోరుతున్నారు.

## సీనియర్ నటుడు సత్యనారాయణ కన్నుమూత

**రామగుండం, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరిఖని పరిశ్రమ ప్రాంతానికి చెందిన సీనియర్ నటుడు సత్యనారాయణ అనారోగ్యంతో మార్కండేయ కాలనీలోని ఆయన నివాసంలో కన్నుమూశారు. ఆయన 150 పైగా టెలి ఫిలిమ్స్, సీరియల్స్, నాటకాలలో నటించారు. పలువురు నటులు ఆయన పార్థివ దేహానికి పుష్పగుచ్ఛాలు అర్పించి నివాళులు అర్పించారు.

## లేబర్ కోడ్ లను రద్దు చేయాలని నిరసన

**మంథని, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** గురువారం గోదావరిఖని సింగరేణి ప్రాంతంలో నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం- ఐఎఫ్ టీయు ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వెంటనే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్ లు రద్దయ్యే వరకు నిరంతరం పోరాడాలని ఐఎఫ్ టీయు నాయకులు పిలుపునిచ్చారు.

## దాడిని తీవ్రంగా ఖండించిన బీజేపీ జిల్లా కన్వీనర్



**వికారాబాద్, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** వికారాబాద్ మున్సిపాలిటీ 28వ వార్డులో బీజేపీ నాయకుడు పోకల సతీష్‌పై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడాన్ని బీజేపీ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద్ రావు తీవ్రంగా ఖండించారు. 'కాంగ్రెస్ గుండాలు ఖబడ్దార్' అంటూ ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ దౌర్జన్యాలు మితిమీరిపోతున్నాయని, హిందూ ధర్మం కోసం పోరాడే వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి


# యువతకేదీ భరోసా?

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, పెన్ పవర్:** యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా 2026-27 బడ్జెట్ కేటాయింపులు ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెడుతూ చెప్పిన మాట. అ అంశాలనే ప్రధాని మోడీ ప్రస్తావించారు. ఈ బడ్జెట్‌లో యువజన సంక్షేమం, క్రీడల అభివృద్ధికి మొత్తం ఇరవై ఐదు కేటగిరిల వారిగా రూ.4,479.88 కోట్లు కేటాయించారు. గతేడాదితో పోల్చితే కొద్దిగా పెరిగినట్లు కనిపించినా అవి నామమాత్రమే. ఈ బడ్జెట్‌లో రూ.500 కోట్లు క్రీడా వస్తువుల తయారీకి ప్రత్యేకంగా కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ కొద్దిపాటి బడ్జెట్ కేటాయింపులతోనే, యువశక్తిని ఎలా పరుగులు పెట్టిస్తారో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి? ముఖ్యంగా క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కేంద్రం చెబుతోంది. క్రీడారంగం క్రమంగా భారీ స్థాయిలో ఉపాధి కల్పించే రంగంగా మారుతోందని, అందుకు ఖేలో ఇండియా మిషన్ ద్వారా సాకారం చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ట్రైనింగ్, కోచింగ్, క్రీడాపోటీల నిర్వహణ, క్రీడారంగంలో మౌలిక వసతుల కల్పన, క్రీడాకారులకు తగిన అవకాశాలు కల్పించడం 'ఖేలో ఇండియా మిషన్' లక్ష్యంగా ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. ఈ రంగానికి 2025-26 బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించి, 700 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు చూపించింది. మిగతా రూ.300 ఎక్కడి దారి మళ్లించింది? దాని గురించి చెప్పలేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెబుతున్న ఖేలో ఇండియా మిషన్‌కు 974 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లో కామన్వెల్త్ క్రీడలకు 28కోట్లు కేటాయించగా ఈసారి బడ్జెట్లో దాన్ని యాభై కోట్లకు పెంచినట్లు చూపింది. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ పథకానికి గత బడ్జెట్‌లో 42 కోట్లు కేటాయించగా, ఈసారి కేవలం కోటి రూపాయలతో సరిపెట్టింది. నెహ్రూ యువకేంద్రాల ప్రాధాన్యతను ప్రభుత్వం విస్మరించింది. మేరా యువభారత్ స్కీంకు 655 కోట్లు కేటాయింపులు చూపింది. నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి గత బడ్జెట్లో 78.64 కోట్లు కేటాయించింది. ఈ బడ్జెట్‌లో కేవలం 46.98 కోట్లకు పరిమితం చేసింది. ఈ బడ్జెట్ కేటాయింపులు ప్రపంచవ్యాప్తంగా క్రీడారంగంలో పోటీతత్వాన్నీ ఎదుర్కొనేందుకు, దేశంలో సమగ్ర క్రీడా విధానాన్ని అమలు చేసేందుకు సరిపోవు. క్రీడల్లో, పథకాల్లో ప్రపంచ దేశాలతో పోటీపడటంలో మన దేశం అట్టడుగు స్థానంలో ఉంటుంది. ఒలంపిక్స్‌లో అత్యధిక పథకాలు సాధించిన దేశంగా యూఎస్ఏ అగ్రభాగంలో నిలిచింది. ఇప్పటివరకు జరిగిన అన్ని ఒలంపిక్స్ క్రీడల్లో 2,629 పథకాలు సాధించింది. రెండో స్థానంలో రష్యా,సోయట్ యూనియన్ దేశాలు 1010, బ్రిటన్ 916, చైనా 636, ఫ్రాన్స్ 751, ఇటలీ 618, జర్మనీ 655, హంగేరి 511, జపాన్ 497, ఆస్ట్రేలియా 547. భారత్ 56 వ స్థానంలో ఉంది. యువతీ యువకులు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో మరింత ముందుకు వెళ్లడమే దేశాభివృద్ధికి సూచిక. నేడు దేశంలో విపరీతంగా పెరుగుతున్న నిరుద్యోగం, క్షీణిస్తున్న ఉపాధి అవకాశాలు, ప్రభుత్వరంగ సంస్థల్లో త్వరితగతిన ఉద్యోగాల భర్తీ వంటి అంశాల గురించి బడ్జెట్‌లో ఏమాత్రం ప్రస్తావించలేదు. 2014లో మొదటిసారి బీజేపీ అధికారం చేపట్టకు ముందు దేశ యువతకు చేసిన వాగ్దానం, ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు కల్పిస్తామనీ, ఆ లెక్కన ఇప్పటివరకు 24 కోట్ల ఉద్యోగాలు భర్తీచేయాల్సి ఉంది. మరి ఆ వాగ్దానం ఎక్కడికి పోయింది? మేకిన్ ఇండియా, మెడ్ ఇన్ ఇండియా,స్కిల్ ఇండియా, స్టార్ట్ అఫ్ ఇండియా అంటూ హడావుడిచేస్తున్న ప్రభుత్వం, ఈ బడ్జెట్ సందర్భంలో కనీస ప్రస్తావన చేయకపోవడం నిరుద్యోగుల్ని మోసం చేయడమే. దేశంలోయేటేటా నిరుద్యోగం పెరుగుతోందని అనేక సర్వేలు వెల్లడిస్తున్నవి. సెంటర్ ఫర్ మానిటరింగ్ నివేదిక (సీఎంఐఈ) లెక్కల ప్రకారం దేశంలో పట్టణ ప్రాంతా ల్లో 7.8 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 8.6 శాతం నిరుద్యోగిత రెగ్యులర్‌గా పెరుగుతుందని వెల్లడిం చింది. కోట్లాదిమంది నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి మార్గాలు లేక అనేక అవస్తలు పడుతున్నది కళ్లముందు కనిపిస్తున్నదే. అందుకు కారణం కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ప్రయివేటుపరం చేసి, కార్పొరేట్ సంస్థలకు అప్పగించిన ఫలితం. బిఎస్ఎన్ఎల్, రైల్వేలు, అగ్రికల్చర్,రక్షణ రంగం తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో లక్షలాది పోస్టులు సంవత్సరాల తరబడి భర్తీకి నోచుకోవడం లేదు. ప్రభుత్వం కూడా నిర్దిష్ట ప్రణాళికతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చిత్తశుద్ధి చూపడం లేదు. ఆయా రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ ఖాళీలకు నోటిఫికేషన్లూ వేసినప్పుడు పరిమిత సంఖ్యలో ఉన్న పోస్టులకు వేలల్లో,లక్షల్లో యువత పోటీ పడుతున్న తీరే దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగితకు ప్రత్యక్ష ఉదాహ రణ. ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతోందని, యువశక్తి బలోపేతమవుతుందని చెప్పడం కాదు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి, వలసలు నివారించడం ప్రభుత్వ కర్తవ్యం. ఇతర దేశాలపై ఆధారపడకుండా చూడట నిరుద్యోగానికి పరిష్కారం. ఈ పనిచేయకుండా సర్కార్ ఎన్ని కబుర్లు చెప్పినా ఉపయోగం ఉండదు. పాలక వర్గాల విధానాలపై యువత నిరసన స్వరం మరింత పెంచాలి.

# తెరపైకి షుగర్ మమ్మీలు...

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, పెన్ పవర్:** ఒక మనిషి ప్రకృతి సిద్ధంగా నడుచుకుంటే అన్ని బాగానే ఉంటాయి. విధానాలపరంగా వ్యవహరిస్తే ఇబ్బందులు అనేవి తలెత్తకుండా ఉంటాయి. అదే మనిషి డబ్బు మాయలో పడి.. స్టేటస్ సింబల్ మాయలో పడి ప్రకృతికి విరుద్ధంగా నడుచుకుంటే.. ఆ తర్వాత అన్ని ప్రతికూల ఫలితాలు వస్తుంటాయి. డబ్బు అనేది మనిషిని ఆడిస్తూ ఉంటుంది. అవసరాలనేవి మనిషిని మరోవైపు నడిచేలా చేస్తాయి. డబ్బు లేకుండా మనిషి జీవించలేడు. అవసరాలు తీరకుండా మనుగడ సాగించలేడు. డబ్బు అనేది కొంతమందికి ప్రాధాన్యమైన అవసరమైతే.. మరికొందరికి జీవితం. ప్రాధాన్యమైన అవసరం లాగా డబ్బులు భావించేవారు జీవితాన్ని సుఖవంతంగా సాగిస్తుంటారు. కానీ జీవితమే అనుకునే వారు మాత్రం డబ్బు చుట్టూ పరిభ్రమిస్తుంటారు. డబ్బు చుట్టూ పరిభ్రమించడం మొదలైతే ఆ తర్వాత మనిషి తన ఆకృతిని.. తన అలవాట్లను.. తన వ్యవహారాలను పూర్తిగా మార్చుకోవాల్సి ఉంటుంది. డబ్బు కోసం "మనీ"షిగా మారాల్సి ఉంటుంది. డబ్బు అనేది మనిషిని ఆడించిన తర్వాత.. మనిషి చాలా వాటికి దూరమవుతూ ఉంటాడు. అందులో సంసార జీవితం కూడా ఉంటుంది. డబ్బు, కెరియర్, ఆస్తుల సంపాదన వ్యవహారాలు మనిషిని ఊపిరి తీసుకోకుండా చేస్తున్న నేపథ్యంలో చాలామంది 30 సంవత్సరాలు దాటేవరకు కూడా పెళ్లి చేసుకోవడం లేదు. గతంలో ఈ జాబితాలో పురుషులు ఉండేవారు. ఇప్పుడు మహిళలు కూడా చేరిపోయారు. పురుషులలో రిచ్ డాడిస్ అనేవారు విపరీతమైన కరువులో ఉంటారు. సో కాల్డ్ రిచ్ షుగర్ డాడీస్ 40 నుంచి 50 సంవత్సరాలు వచ్చేదాకా పనిచేస్తూనే ఉంటారు. కెరియర్ కోసం కష్టపడుతూనే ఉంటారు. ఎప్పుడో వారి వయసులో 15 సంవత్సరాల ప్రాయం ఉన్నప్పుడు కోరికలు మొదలవుతాయి. కనీసం 30 సంవత్సరాలు వచ్చేదాకా పెళ్లి కూడా చేసుకునే అవకాశంఉండదు. వివాహం తర్వాత కోరికలు తీసుకోవడానికి సమయం ఉండదు. జుట్టు తెల్లగా అయ్యేవరకు సంపాదనలోనే అసలు కాలం కాస్త పూర్తవుతుంది. అప్పటికి వయసు అయిపోతుంది. శరీరానికి షుగర్ అనేది తగిలినతర్వాత.. ఆ డాడి లకు షుగర్ బిడ్డలు తగులుతుంటారు. అందుకే షుగర్ కావాలని శరీరం కోరుతూ ఉంటుంది. వివాహం చేసుకొని డాడీలు అవ్వకుండా.. వయసు పెరిగిన తర్వాత షుగర్ కోసం తాపత్రయపడుతుంటారు. ఇక్కడ ఈ షుగర్ దాడిలతో వ్యవహారం సాగించేవారు కూడా అదే సమస్యతో ఉంటారు. షుగర్ డాడి ల గురించి తెలుసుకున్నాం కదా.. ఇప్పుడు షుగర్ మమ్మిల గురించి కూడా మాట్లాడుకోవాలి. పైన చెప్పిందే వీరికి కూడావర్తిస్తుంది. ఎందుకంటే నేటి కాలంలో ఆకాశంలో సగం.. అన్నిట్లోనూ సగం అని మహిళలు గట్టి నినాదంతో ముందుకు వెళ్తున్నారు. కెరియర్లో స్థిరపడిన తర్వాత అన్నీ అనుకుంటున్నారు. కానీ అప్పటికే సగం వయసు దాటిపోతుంది. ఇక అప్పుడు పెళ్లి చేసుకోవాలనే కోరిక కూడా చాలామందిలో చచ్చిపోతోంది. ఫలితంగా వారు షుగర్ మమ్మీలుగా మారిపోతున్నారు. దేహం పోరు పెట్టినప్పుడు.. తప్పదు కాబట్టి వారు అదేదారిలోవెళ్తున్నారు. ఇది నైతికమా? అనైతికమా? అనే ప్రశ్నలకు ఆస్కారం లేని వ్యవహారం. దాహం వేస్తే నీళ్లు తాగుతాం. ఆకలి వేస్తే ఆహారం తింటాం. నిద్ర వస్తే పడుకుంటాం. దేహంలో సెగలు రగిలితే.. వాటిని తగ్గించుకునేప్రయత్నం చేస్తాం. ఇందులో నీతికి.. ఇతర సిద్ధాంతాలకు తావులేదు. షుగర్ డాడి అనేది వెస్ట్రన్ కల్చర్. షుగర్ మమ్మి కూడా అదే బాపతు. కాకపోతే ఈ కల్చర్ మన హైదరాబాద్ నగరంలో విస్తృతంగా ఇప్పుడుకనిపిస్తోంది. వీటికోసం కొన్ని సంస్థలు కూడా పనిచేస్తున్నాయి. కాకపోతే అవి బయటపడవు. షుగర్ డాడిల కంటే షుగర్ మమ్మిలే భారీగా ఖర్చు పెడతారట. ఇదేదో మేం చెబుతున్న మాట కాదు.. ఈ వ్యవహారంసాగిస్తున్న కొన్ని సంస్థలు చెబుతున్న నగ్న సత్యాలు. ఇంకా లోతుగా ఈ సబ్జెక్టు గురించి చెప్పొచ్చు. కాకపోతే అదంతా సెన్సార్ లో ఉంటుంది.

## జగ్గారెడ్డిపై కేసు నమోదు చేయాలి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్



**సంగారెడ్డి: పెన్ పవర్:** జగ్గారెడ్డి ప్రజాస్వామ్యానికి అవమానించి ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయడం తన జన్మహక్కు అన్నట్లుగా వ్యవహరించారని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగ్గారెడ్డిని అదుపులో పెట్టడంలో అధికార వ్యవస్థ పూర్తిగా విఫలమైందన్నారు. సంగారెడ్డిలో పోలింగ్ సందర్భంగా పోలీసులు, ఎన్నికల సిబ్బంది, ఓటు వేయడానికి వచ్చిన సాధారణ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన జగ్గారెడ్డి ప్రవర్తన అత్యంత బాధాకరమని అన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందిపై దాడికి దిగేలా ప్రవర్తించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు వెంటనే జగ్గారెడ్డి పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు

## బ్యాలెట్ బాక్సుల దుర్వినియోగం జరగలేదు:



**భద్రాచలం, ఫిబ్రవరి 12పెన్ పవర్:** కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో బ్యాలెట్ బాక్సుల దుర్వినియోగం జరగలేదని కమిషనర్ సుజాత స్పష్టం చేశారు. 47వ డివిజన్‌లోని 156వ పోలింగ్ కేంద్రానికి సంబంధించి ఖాళీగా ఉన్న 'రిజర్వు' బ్యాలెట్ బాక్సును మాత్రమే వాహనంలో మరిచిపోయినట్లు ఆమె వివరించారు. ఈ ఆరోపణల్లో వాస్తవం లేదని, పోలింగ్ సజావుగా జరిగిందని, భద్రతా ప్రమాణాల మధ్య కౌంటింగ్ కేంద్రానికి బాక్సులను తరలించామని తెలిపారు.

# మోడీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న స్టేషన్లు



**విజయవాడ, ఫిబ్రవరి 12, పెన్ పవర్:**
ఏపీలో అమృత్ భారత్ స్కీమ్‌లో 73 రైల్వే స్టేషన్‌లను 3418 కోట్ల రూపాయలతో పూర్తిగా అధునీకరిస్తున్నారు వాటిలో విజయవాడ పరిధిలో 21 స్టేషన్‌లు ఉన్నాయి. కొన్ని ముఖ్యమైన రైల్వే స్టేషన్‌ల పనులు పూర్తి అయ్యాయి. త్వరలోనే దేశవ్యాప్తంగా రెడీ అయిన రైల్వే స్టేషన్‌లను ప్రధాని మోదీ ఒకేసారి ప్రారంభించనున్నారు. వాటిలో విజయవాడ డివిజన్ పరిధిలో 4 స్టేషన్‌లు ఉన్నాయి. అవే రాయనపాడు, నిడదవోలు,కాకినాడ టౌన్,తుని.

### 1) రాయనపాడు రైల్వే స్టేషన్

విజయవాడ స్టేషన్‌కు సాటిలైట్ స్టాప్‌గా ఏర్పడిన రాయనపాడు ఇప్పుడు పూర్తిగా రూపం మార్చుకుంది. కొన్ని విషయాల్లో విజయవాడ స్టేషన్ కంటే అందంగా ముస్తాబైంది. విజయవాడ స్టేషన్‌పై భారం తగ్గించేందుకు ఏర్పడిన రాయనపాడు పెరుగుతున్న విజయవాడ పరిధికి మరో స్టేషన్‌గా మారింది. ఇప్పటికే చాలా రైళ్లు విజయవాడ మెయిన్ స్టేషన్‌కు వెళ్లనవసరం లేకుండా గుణదల నుంచి రాయనపాడు లైన్‌లో ఖమ్మం రూట్‌లోకి వెళ్లిపోతున్నాయి. ఇలాంటి ట్రైన్స్‌కి రాయన పాడులో హాల్ట్ ఇస్తున్నారు. సికింద్రాబాద్‌కు చర్లపల్లి ఎలానో విజయవాడకు రాయనపాడు అలాంటిదే. ప్రస్తుతం ఈ స్టేషన్ చూడడానికి చాలా అద్భుతంగా ఉంది.

### 2) నిడదవోలు రైల్వే స్టేషన్

గోదావరి జిల్లాల్లో అతి ముఖ్యమైన రైల్వే జంక్షన్ ఇది. చెన్నై-హౌరా మెయిన్ లైన్‌లో ఈ స్టేషన్ ఉంటుంది. ఇక్కడి నుంచి తణుకు, భీమవరం, నరసాపురం, గుడివాడ, మచిలీపట్నం మీదుగా విజయవాడ వెళ్లే మరో రూట్ ఉండడం వల్ల ఈ స్టేషన్‌ను డెవలప్ చెయ్యడానికి రైల్వే డిసైడ్ అయి ఏకంగా 30 కోట్లు కేటాయించింది. ఇంతకు ముందు కేవలం 3 ప్లాట్ ఫామ్స్ ఉంటే ఇప్పుడు వాటి సంఖ్య 5కు చేరుకుంది. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న పట్టణం కావడంతో నిడదవోలు చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా, సాంస్కృతికపరంగా, టూరిజంపరంగా చాలా ముఖ్యమైన ఏరియా. రానున్న గోదావరి పుష్కరాలను కూడా దృష్టిలో పెట్టుకుని రాజమండ్రికి దగ్గరలో గల ఈ స్టేషన్‌ను డెవలప్ చేశారు. ముఖ్యంగా ఈ స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన లిఫ్ట్, ఎస్కలేటర్ ప్రయాణికులకు చాలా సౌకర్యంగా మారాయి.

### 3) కాకినాడ టౌన్ స్టేషన్

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ ప్రస్తుత రూపం చూస్తే ఎవరైనా అవాక్కవ్వాల్సిందే. దీని రూపం ఎంతెలా మారింది అంటే రైల్వే కూడా ఈ స్టేషన్ డెవలప్మెంటను ప్రమోట్ చేసుకొంటోంది. కాకినాడలోని పారిశ్రామిక ప్రాంతాలను దేశంలోని ఇతర పట్టణాలతో కలిపే కాకినాడ టౌన్ స్టేషన్ విజయవాడ డివిజన్‌లో చాలా ముఖ్యమైంది. కాకినాడలో రెండు రైల్వే స్టేషన్‌లు ఉన్నాయి. కాకినాడ పోర్ట్, కాకినాడ టౌన్. వీటిలో కాకినాడ టౌన్ స్టేషన్ నుంచే ప్రయాణికులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఒకప్పుడు ఇక్కడ నుంచి రైళ్లు చాలా తక్కువగా వెళుతుండేవి. కానీ ఇప్పుడు వాటి సంఖ్య బాగా పెరిగింది. దానితో 21 కోట్ల ఖర్చుతో స్టేషన్‌ను బాగా డెవలప్ చేశారు. అందమైన మొక్కలు, కొత్త బెంచీలు, కుర్చీలు, అధునాతన టాయిలెట్స్, స్టేషన్ గోడలపై స్వాతంత్ర్య సమరయోధుల పెయింటింగ్స్ ఇలా చాలా సౌకర్యాలు వచ్చేశాయి.

### 4) తుని రైల్వే స్టేషన్

చారిత్రక పట్టణం తుని స్టేషన్‌ను 19.కోట్లతో డెవలప్ చేసింది రైల్వే శాఖ. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జ్ఞాపకాలతో ముడిపడిన తుని సమీపంలోని గిరిజన గ్రామాలకు చాలా ముఖ్యమైన రైల్వే స్టేషన్. అటు వైజాగ్ వెళ్లాలన్నా ఇటు కాకినాడ, విజయవాడ లాంటి టౌన్ వెళ్లాలన్నా ఈ స్టేషన్ ద్వారానే ప్రయాణం చేస్తారు. చాలా కాలం నుంచి అభివృద్ధికి నోచుకోని తుని స్టేషన్ ఇప్పుడు అదిరిపోయే లుక్‌లోకి మారిపోయింది. ముఖ్యంగా స్టేషన్ ఎంట్రీ ముఖద్వారాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. అలానే స్టేషన్ లోపలి సౌకర్యాలను చక్కగా తీర్చిదిద్దారు.

# ఇక అమరావతి ఐటీ రాజధాని



**విజయవాడ, ఫిబ్రవరి 12, పెన్ పవర్:**
హైదరాబాద్‌ను హైటెక్ సిటీ పేరుతో ఐటీ హబ్‌గా మార్చినట్టుగానే, ఇప్పుడు అమరావతిని ప్రపంచ దేశాలు అబ్బురపడేలా క్వాంటం కంప్యూటింగ్ హబ్‌గా మార్చేందుకు ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తోంది.ఇది రాష్ట్ర చరిత్రలోనే మైలురాయిగా భావిస్తున్నారు. ఇది కేవలం టెక్ పార్క్ మాత్రమే కాదని రాబోయే తరాల భవిష్యత్‌ను మార్చే విజన్‌గా ప్రభుత్వం అభివర్ణిస్తోంది. మనం వాడుతున్న కంప్యూటర్లు, ఫోన్లు, బిట్స్ ఆధారంగా పని చేస్తాయి. అంటే చిన్నప్పుడు మీరు నేర్చుకున్న ద్విసంఖ్యామానం గుర్తుందా... అంటే ఎంత పెద్ద సంఖ్యలనైనా 0,1 రూపంలో రాయడం. వీటి ఆధారంగానే ఇప్పటి వరకు కంప్యూటర్, ల్యాప్‌టాప్, ఫోన్ పని చేస్తూ వచ్చాయి. ఇప్పుడు క్వాంటం కంప్యూటర్‌లో అలా కాదు. ఇక్కడ క్యూబిట్స్ ఆధారంగా పని చేస్తాయి. వీటి ప్రత్యేకత ఏంటంటే ఇవి ఒకే సమయంలో 0, 1 రెండూ అవ్వగలవు. దీన్నే సూపర్‌పొజిషన్ అంటారు. దీని వల్ల మామూలు కంప్యూటర్లు కొన్ని ఏళ్లు పని చేసే పనిని, క్వాంటం కంప్యూటర్లు కేవలం సెకన్లలో పూర్తి చేస్తాయి. ముఖ్యంగా మందుల తయారీ, వాతావరణ అంచనాలు, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. క్వాంటం కంప్యూటర్ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలో చేతులు కలిపింది. అమరావతిలో సుమారు యాభై ఎకరాల్లో ఈ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ఐబీఎం క్వాంటం సిస్టమ్ 2 అనే భారీ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 156 క్యూబిక్ హెరా ప్రాసెసర్‌ను వాడుతున్నారు. ఇది మన దేశంలోని అతి పెద్ద క్వాంటం కంప్యూటర్ కానుంది. ఈ వ్యాలీ కేవలం కంప్యూటర్లకే పరిమితం కాదు, ఇక్కడ హార్డ్‌వేర్ తయారీ, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, స్కిల్ ట్రైనింగ్ వంటివన్నీ ఒకే చోట ఉంటాయి. 2029 నాటికి దాదాపు ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. నిరుద్యోగులకు విద్యార్థులకు కలిగే ప్రయోజనం ఏంటీ?


ఈ ప్రాజెక్టు వల్ల ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెబుతున్నారు. దాదాపు లక్ష హై స్కిల్ ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం కేవలం ఉద్యోగాలు ఇవ్వడమే కాదు, యువతకు శిక్షణ కూడా ఇవ్వబోతోంది. వన్ ఎంటర్‌ప్రెన్యూర్ పర్ ఫ్యామిలీ అనే విజన్‌తో సుమారు పది లక్షల మంది యువతకు క్వాంటం స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వాలని ప్లాన్ చేశారు. ఇప్పటికే ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో యాభై వేల మంది విద్యార్థులకు ట్రైనింగ్ ఇస్తున్నారు. దీని వల్ల మన రాష్ట్ర యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే భారీ జీతాలతో ఉద్యోగాలు సంపాదించుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఢిల్లీ వంటి సంస్థల భాగస్వామ్యంతో ఈ శిక్షణ కొనసాగుతోందని వెల్లడిస్తున్నారు.

**ప్రజల జీవితాల్లో వచ్చే మార్పులేంటి?**

2030 నాటికి దాదాపు ఐదు వేల కోట్ల విలువైన ఎగుమతులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అమరావతి ఇండియాకే క్వాంటం క్యాపిటల్‌గా మారుతుందని చెబుతున్నారు. క్వాంటం కంప్యూటర్ల సహాయంతో క్యాన్సర్ వంటి వ్యాధులకు త్వరగా మందులు కనుగొనే అవకాశం ఉంది. వాతావరణాన్ని ముందే కచ్చితంగా అంచనా వేయడం ద్వారా రైతులకు పంటల విషయంలో ఎంతో లాభం కలుగుతుందని వివరిస్తున్నారు. ఆనలైన్ మోసాలు అరికట్టేందుకు కూడా సురక్షితమైన వ్యవస్థ తయారవుతుందని తెలుపుతున్నారు. దీనిపై మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ నాడు హైదరాబాద్‌ను ఐటీ రంగంలో ఎలాగైతే ముందు నిలిపారో, నేడు అమరావతిని డీప్‌టెక్ రంగంలో గ్లోబల్‌లీడర్‌గా చేయాలని చంద్రబాబు కంకణం కట్టుకున్నారని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎవర్నీ ఫాలో అవ్వని అందరికీ దారి చూపిస్తుందని ఇప్పుడు అదే బాటలో ఉందని టీడీపీకి చెందిన సీనియర్ నేత ఒకరు కామెంట్ చేశారు. క్వాంటం టెక్నాలజీ అంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఈ కంప్యూటర్లు వేడెక్కకుండా ఉండటానికి భారీ స్థాయిలో కూలింగ్ సిస్టమ్ అవసరం. అయితే ప్రభుత్వం ఇప్పటికే వీటిన్నింటికీ ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెబుతోంది. కేంద్రం చేపట్టిన నేషనల్ క్వాంటం మిషన్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది.

# ఏపీ పరిస్థితి ఇంత దారుణమా...

**గుంటూరు, ఫిబ్రవరి 12, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయ్యాయి.అయితే ఇంతలో కేంద్రం పార్లమెంట్‌లో పెట్టిన ఓ నివేదిక ఇక్కడ రాజకీయ చిచ్చు రేపింది. ఆంధ్రప్రదేశ్‌లోని రైతు అప్పుల ఊబిలో ఉన్నాడని చెప్పిన రిపోర్టు సంచలనంగా మారుతోంది. అయితే దీన్ని అధికార ప్రతిపక్షాలు ఇరువురు కూడా బురద చల్లేలా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. దేశానికి వెన్నెముక రైతు అని గర్వంగా చెప్పుకునే రైతు అప్పుల భారతంతో కుంగిపోతున్నాడని పార్లమెంట్‌లో కేంద్రం కీలక నివేదిక బయటపెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లోని రైతు కుటుంబాలు దేశంలోనే అత్యధిక అప్పుల భారంతో ఉన్నాయనేది చేదు నిజం. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాలు చూస్తుంటే ఏపీలో రైతు దీనస్థితి ఏంటో కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. ఫిబ్రవరి 10న లోక్‌సభలో ఏపీ రైతు అప్పులపై ఒక కీలక చర్చ జరిగింది. దీనిపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఈ ప్రకటన ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో రైతులు ఎంతటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారో దేశానికి స్పష్టమైంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న రైతులతో పోలిస్తే



ఆంధ్రప్రదేశ్ రైతుల అప్పులే అత్యధికంగా ఉన్నట్టు తేలింది. మంత్రి శివరాజ్ సింగ్ వెల్లడించిన గణాంకాల ప్రకారం జులై 2018-జూన్ 2019 మధ్య కాలానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లోని ఒక సగటు రైతు కుటుంబం అప్పు 2,35, 554 రూపాయలుగా ఉంది. ఇది కేవలం ఒక అంచనా మాత్రమే కాదు. ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన వాస్తవం. అంటే మన రాష్ట్రంలో ఒక సాధారణ రైతు కుటుంబం సుమారు రెండు లక్షల ముప్పై ఐదు వేల రూపాయల అప్పుతో కాలం వెళ్లదీస్తోంది.పక్కనే ఉన్న తెలుగు రాష్ట్రం తెలంగాణతో పోల్చి చూసినా ఏపీ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. తెలంగాణలో ఒక రైతు కుటుంబం సగటు అప్పు 1,52, 113రూపాయలుగా ఉంది. అంటే ఏపీ కంటే ఇది చాలా తక్కువ. భారత్‌లో మొత్తం మీద ఒక రైతు కుటుంబం సగటు అప్పు కేవలం 74, 121 రూపాయలు మాత్రమే. జాతీయ సగటు 74వేలు ఉంటే ఏపీలో అది 2.35 లక్షలకు చేరడం ఆందోళనకరంగా ఉంది. దేశ సగటు కంటే ఏపీలో రైతులు దాదాపు మూడు రెట్లు ఎక్కువ అప్పుల్లో ఉన్నారని లెక్కలు చెబుతున్నాయి. కేంద్ర మంత్రి ప్రకటన ద్వారా అప్పుల భారం అయితే తెలిసింది కానీ, సామాన్యంగా రైతుకు ఈ తిప్పలు ఎందుకు వస్తాయో అందరికి తెలిసిందే. పెట్టుబడి పెరగడం, గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రకృతి వైపరిత్యాలు వంటి ఎన్నో కారణాలు రైతును అప్పుల వైపు నెడుతున్నాయి. ఒక్కో రైతు కుటుంబంపై ఇంత భారీ స్థాయిలో అప్పు ఉండటం అనేది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. పార్లమెంట్ సాక్షిగా బయటపడిన ఈ లెక్కలు ఇటు టీడీపీపై వైసీపీ దుమ్మెత్తి పోస్తుంటే, వారి హయాంలోనే ఇలాంటి లెక్కలు వెలుగు చూశాయని అప్పటి ప్రభుత్వం చేతకానితనం వల్లే ఇదంతా జరిగిందని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. మొత్తానికి ఈ కేంద్ర విడుదల చేసిన లెక్కలను ఇరు వర్గాలు వాడుకుంటున్నారు.

## రాజ్యసభకు చింతకాయల విజయ్...

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ నుండి జూన్‌లో ఖాళీ కాబోతున్న నాలుగు రాజ్యసభ స్థానాలపై తెలుగుదేశం పార్టీలో అప్పుడే చర్చ మొదలైంది. కూటమి ప్రభుత్వానికి ఉన్న బలం దృష్ట్యా ఈ నాలుగు సీట్లు సులువుగా దక్కే అవకాశం ఉండటంతో, అభ్యర్థుల ఎంపికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కసరత్తు మొదలుపెట్టారు. ఈ రేసులో ప్రస్తుతం టీడీపీ ఐటీ వింగ్ బాధ్యతలు చూస్తున్న యువనేత చింతకాయల విజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనకు ఎంపీ సీటు దాదాపు ఖరారైనట్లు పార్టీ వర్గాల్లో బలమైన ప్రచారం సాగుతోంది.టీడీపీకి వెన్నెముకగా ఉండే బీసీ సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలనేది అధిష్టానం ఆలోచన. ఉత్తరాంధ్రలో బలమైన బీసీ నేతగా, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వారసుడిగా విజయ్‌కు మంచి గుర్తింపు ఉంది. ఇప్పటికే అయ్యన్నపాత్రుడు అసెంబ్లీ స్పీకర్‌గా గౌరవప్రదమైన హోదాలో ఉండగా, ఆయన కుమారుడికి ఢిల్లీ స్థాయిలో అవకాశం కల్పించడం ద్వారా ఉత్తరాంధ్రలోని బీసీలకు పెద్దపీట వేసినట్లు అవుతుందని చంద్రబాబు భావిస్తున్నారు.గత ప్రభుత్వ హయాంలో టీడీపీ ఐటీ వింగ్‌పై అనేక కేసులు నమోదైనప్పుడు విజయ్ వెనకడుగు వేయకుండా పోరాడారు. పార్టీ సోషల్ మీడియా సైనికులకు అండగా నిలవడమే కాకుండా, ప్రభుత్వంపై నిరంతరం డిజిటల్ అస్త్రాలను సంధించారు. ఈ క్రమంలో ఆయన అనేక రాజకీయ ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పార్టీ కోసం ఆయన పడిన కష్టానికి ప్రతిఫలంగా ఈ గౌరవం దక్కాలని మెజారిటీ నేతలు అభిప్రాయపడుతున్నారు. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత చంద్రబాబు దృష్టిలో కూడా విజయ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టింది.పార్లమెంటులో పార్టీ వాణిని బలంగా వినిపించేందుకు చదువుకున్న, విషయ పరిజ్ఞానం ఉన్న యువతను పంపాలని చంద్రబాబు యోచిస్తున్నారు. విజయ్ విదేశాల్లో చదువుకోవడం, ఆధునిక సాంకేతికతపై అవగాహన ఉండటం, జాతీయ రాజకీయాల పట్ల ఆసక్తి కలిగి ఉండటం ఆయనకు అదనపు అర్హతలుగా మారాయి. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేయడమే కాకుండా, రాష్ట్ర ప్రయోజనాల కోసం గొంతు వినిపించగల సత్తా విజయ్‌కు ఉందని పార్టీ పెద్దలు నమ్ముతున్నారు.అదే సమయంలో చింతకాయల విజయ్ అభ్యర్థిత్వానికి ఉన్న అతిపెద్ద ప్లస్ పాయింట్ నారా లోకేష్‌తో ఉన్న సాన్నిహిత్యం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు, ముఖ్యంగా లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో ఐటీ వింగ్ ద్వారా సోషల్ మీడియాలో పార్టీ గొంతుకను బలంగా వినిపించడంలో విజయ్ కీలక పాత్ర పోషించారు. లోకేష్ వ్యక్తిగత బృందంలో ఒకరిగా ఉంటూ, డిజిటల్ క్యాంపెయినింగ్‌ను విజయవంతంగా నడిపించడమే కాకుండా, పార్టీ కేడర్‌ను సమన్వయం చేయడంలో తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. ఈ విధేయతే ఆయనను రేసులో ముందు నిలబెడుతోందని టీడీపీ వర్గాలుచెబుతున్నాయి. ప్రస్తుతానికి అధికారికంగా ఎటువంటి ప్రకటనా రానప్పటికీ, విజయ్ పేరుపై చంద్రబాబు , లోకేష్ ఇప్పటికే ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ సీనియర్లకు, యువతకు మధ్య సమతుల్యత దెబ్బతినకుండా ఈ ఎంపిక ఉండబోతోంది. అన్నీ అనుకూలిస్తే, రాజ్యసభలో టీడీపీ తరపున చింతకాయల విజయ్ అడుగు పెట్టడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఒకేసారి నలుగురు మంత్రులకు బెదిరింపులు

**విజయవాడ,ఫిబ్రవరి 12 పెన్ పవర్:** అసెంబ్లీ సమావేశాల సమయంలో నలుగురు మంత్రులకు మావోయిస్టుల నుంచి బెదిరింపులు లేఖలు కలకలం రేపాయి. రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, సత్య కుమార్ యాదవ్, కందుల దుర్గేష్‌లకు మావోయిస్టుల నుంచి బెదిరింపు లేఖలు వచ్చాయి. ఈ పరిణామంతో అప్రమత్తమైన నిఘా వర్గాలు విచారణ ప్రారంభించాయి. మావోయిస్టుల పేరిట వచ్చిన ఈ బెదిరింపు లేఖల వార్త చూసి తన కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని, స్నేహితులు, శ్రేయోభిలాషుల నుంచి పెద్ద ఎత్తున ఫోన్లు వచ్చాయని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.మావోయిస్టుల లేఖ అంశంపై మంత్రి కందుల దుర్గేష్ అసెంబ్లీ మీడియా పాయింట్‌లో చిట్‌చాట్ సందర్భంగా స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను నిర్వహిస్తున్నది పర్యాటక శాఖ వంటి చిన్న శాఖ అని, తనకు మావోయిస్టులు లేఖలు రాయాల్సినంత పెద్ద వివాదాలు ఏముంటాయని ఆయన ప్రశ్నించారు. వ్యక్తిగతంగా గానీ, శాఖాపరంగా గానీ తాము ఎక్కడా ఎలాంటి తప్పులు చేయలేదని కందుల స్పష్టం చేశారు. సాధారణంగా మావోయిస్టుల నుంచి వచ్చే లేఖల శైలి ఇలా ఉండదని, ఎవరో కావాలని ఉద్దేశపూర్వకంగానే తప్పుడు లేఖలు సృష్టించి ఉంటారని మంత్రి అభిప్రాయపడ్డారు.ఈ బెదిరింపుల లేఖలపై మంత్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ లేఖ వెనుక ఉన్న కుట్రను, అసలు కారకులను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. మంత్రుల భద్రతను పర్యవేక్షించే అధికారులు కూడా ఈ లేఖల అసలు మూలాలను ఆరా తీస్తున్నారు. కేవలం భయాందోళనలు సృష్టించేందుకే గుర్తుతెలియని వ్యక్తులు ఇటువంటి చర్యలకు పాల్పడి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. మావోయిస్టుల లేఖలు వచ్చిన కారణంగా ఆ నలుగురు మంత్రుల నివాసాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

## వైసీపీ ధీమా లెక్కేంటీ...

**విశాఖపట్టణం ఫిబ్రవరి 12, పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలకు సిద్ధమవుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా జమిలి ఎన్నికలు వస్తాయని, తెలంగాణ ఎన్నికలు 2029 లో జరుగుతాయని తెలిపారు. జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన కూడా జరగనుంది. తెలంగాణ లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2029కి ఆరేళ్లవుతుంది. అయితే ఆంధ్రప్రదేశ్ లో శాసనసభకు ఎన్నికలు సకాలంలోనే జరుగుతాయి. 2024లో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికలు జరిగాయి. అంటే తిరిగి 2029లో శాసనసభ ఎన్నికలు జరగాల్సి ఉంది. జమిలి ఎన్నికలు ఒక ఏడాది ముందుగా వస్తాయని వైసీపీ తొలుత భావించింది. కానీ ఫ్యాన్ పార్టీ ఆశలపై కేంద్ర ప్రభుత్వం నీళ్లు చల్లినట్లయింది.ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటికే రాజకీయాలు వేడెక్కాయి. తొలి నుంచి రాజకీయ వాతావరణం వేడి వేడిగానే కొనసాగుతుంది. జగన్ కు కూడా జమిలి ఎన్నికల సమాచారం తెలియడంతోనే ఏడాదిన్నర తర్వాత మాత్రమే పాదయాత్ర చేయాలని నిర్ణయించారంటున్నారు. 2029 ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడానికి 2027లో ఆయన పాదయాత్ర చేపట్టనున్నారు. తొలుత 2028 నాటికి జమిలి ఎన్నికలు వస్తాయని భావించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం 2029 కే దేశ వ్యాప్తంగా ఎన్నికలు జరపాలని నిర్ణయించడంతో ఏపీలో మరో మూడేళ్లకు కాని ఎన్నికలు జరగవు. దీంతో అధికార తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేశాం కాబట్టి, మిగిలిన హామీలను కూడా నెరవేర్చి ఎన్నికలకు వెళ్లేలా ప్లాన్ చేస్తుంది.అమరావతి, పోలవరం పనులను పూర్తి చేస్తే ప్రజలు కూటమికి మరోసారి పట్టం కడతారని అంటున్నారు. గుజరాత్ తరహాలో వరసగా అధికారం ఇస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్న నినాదంతో కూటమి ఈసారి ఎన్నికలకు సిద్ధమవుతుంది. వైసీపీ మాత్రం కూటమి ప్రభుత్వంలో అవినీతి, సంక్షేమ పథకాలు అందరికీ చేరకపోవడంతో పాటు కక్ష పూరిత రాజకీయాలు, అక్రమ కేసులు వంటివి నినాదాలుగా వెళ్లాలనుకుంటుంది. కాంగ్రెస్ కు, కమ్యూనిస్టులకు ఈసారి కూడా అవకాశం ఉండదు. వచ్చే ఎన్నికల్లోనూ కూటమి, వైసీపీ మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందన్నది వాస్తవం. జమిలి ఎన్నికలు వస్తే ఏపీలో పెద్దగా తేడా ఉండదు. ఏపీలో ఎప్పటి నుంచో అసెంబ్లీ, పార్లమెంటుకు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి. తెలంగాణలో మాత్రం ఒక ఏడాది ముందు శాసనసభ, తర్వాత పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయి. జమిలి ఎన్నికల వల్ల ఏపీకి నష్టం లేదు. లాభం లేదు. మళ్లీ గెలవాలని టీడీపీ ప్రయత్నిస్తుంది. వైసీపీ గెలిచేందుకు సర్వశక్తుల ఒడ్డుతుంది.

## మెరుపు తీగలా మారిన అనిల్

**నెల్లూరు, ఫిబ్రవరి 12, పెన్ పవర్:**మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కొంత రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత నుంచి ఆయన పెద్దగా పార్టీ కార్యక్రమాల్లోనూ, ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల్లోనూ కనిపించడం లేదు. వైసీపీ నేతలపై వరస కేసులు నమోదవుతుండటంతో తనను లక్ష్యంగా పెట్టుకుంటారన్న కారణంతోనే అనిల్ కుమార్ యాదవ్ కొంత పార్టీకి దూరంగా మసలు కుంటున్నారని తెలిసింది. మొన్నటి ఎన్నికల్లో కూటమి గెలవడంతో అక్కడ టిడిపి పట్టు బిగిస్తోంది. అయినా వైసీపీ నేతగా, మాజీ మంత్రిగా పార్టీకి పూర్వవైభవం తేవాలన్న ప్రయత్నం అనిల్ కుమార్ యాదవ్ చేయకపోవడాన్ని పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు. మొన్నటి ఎన్నికలకు ముందు, తర్వాత చాలామంది వైసీపీ నేతలు టిడిపిలో చేరిపోయారు.అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక వెలుగు వెలిగిన మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ఇప్పుడు ఎక్కడ కనిపించడం లేదు. అప్పుడప్పుడు కనిపించినా అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారు. అసలు ఆయన పార్టీలో ఉన్నారా? లేదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. సొంత సామాజిక వర్గం వారిని కాదని అనిల్ కుమార్ యాదవ్ కు ఛాన్స్ ఇచ్చారు జగన్. కానీ ఇప్పుడు వైసిపి సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంటే అనిల్ కుమార్ యాదవ్ కనిపించకపోవడం ఏమిటి అనే ప్రశ్న వినిపిస్తోంది. నెల్లూరు టౌన్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలిచిన అనిల్ కుమార్ యాదవ్ జగన్ కేబినెట్ లో మంత్రిగా చేరారరు. 2009లో కాంగ్రెస్ తరపున పోటీ చేశారు కానీ అనిల్ కుమార్ యాదవ్ గెలవలేదు.వైసీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో చేరారు. 2014లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. కానీ టిడిపి అధికారంలోకి వచ్చింది. అయినా సరే దూకుడుగా వ్యవహరిస్తూ.. జగన్మోహన్ రెడ్డికి అత్యంత ఆప్తుడిగా మారిపోయారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడం.. నెల్లూరు నుంచి అనిల్ కుమార్ యాదవ్ గెలవడంతో మంత్రివర్గంలో ఆయనకు చాన్స్ ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. సొంత సామాజిక వర్గం నేతలు ఉన్న అనిల్ కుమార్ యాదవ్ కు ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. అయితే అనిల్ తీరుకు నిరసనగా చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడం కాదు.. నెల్లూరు జిల్లాలో దారుణ పరాజయం చూసింది.అనిల్ కుమార్ యాదవ్ ను నెల్లూరు నుంచి నరసరావుపేట ఎంపీ స్థానం నుంచి పోటీ చేయాల్సి వచ్చింది.కూటమి హవాలో ఆయన ఓటమి తప్పలేదు. అయితే ఓడిపోయిన తర్వాత అనిల్ కుమార్ యాదవ్ పక్క రాష్ట్రాల్లో వ్యాపారాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే అప్పుడప్పుడు చుట్టూ చూపుగా వచ్చి వెళ్ళిపోతున్నారు తప్ప పార్టీకి పూర్తి సమయాన్ని కేటాయించడం లేదు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## కెనడా స్కూల్‌లో కాల్పులకు పాల్పడింది ఓ ట్రాన్స్‌జెండర్..

**హైదరాబాద్ పెన్ పవర్:** కెనడాలోని బ్రిటిష్ కొలంబియా రాష్ట్రంలో నిన్న ఓ పాఠశాలలో జరిగిన కాల్పుల్లో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు పాల్పడింది ఓ ట్రాన్స్‌జెండర్ మహిళ అని పోలీసులు తాజాగా వెల్లడించారు. కాల్పుల అనంతరం నిందితురాలు తనను తాను కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతుల్లో నిందితురాలి కన్నతల్లి, సోదరుడు కూడా ఉండటం గమనార్హం. ఈ కిరాతకానికి వెనుక కుటుంబ కలహాలు, మానసిక అస్థిరత కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం 18 ఏళ్ల జెస్సీ వాన్ రూట్‌సెలార్ ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు గుర్తించారు. ఈమె ఆరేళ్ల క్రితం లింగమార్పిడి చేయించుకుని పురుషుడి నుంచి మహిళగా మారినట్లు అధికారులు ధ్రువీకరించారు. తొలుత ఇంట్లో ఉన్న తన తల్లి, సవతి సోదరుడిని తుపాకీతో కాల్చి చంపింది. ఆ తర్వాత, తాను నాలుగేళ్ల క్రితం చదువు మానేసిన సమీపంలోని హైస్కూల్‌లోకి ప్రవేశించి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడింది. ఈ బీభత్సంలో ఓ ఉపాధ్యాయురాలితో పాటు, 12 నుంచి 13 ఏళ్ల వయసున్న ఐదుగురు అమాయక విద్యార్థులు (ముగ్గురు బాలికలు, ఇద్దరు బాలురు) అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు.సమాచారం అందిన కేవలం రెండు నిమిషాల్లోనే తాము పాఠశాలకు చేరుకున్నామని, అప్పటికే లైబ్రరీ, మెట్ల మార్గంలో మృతదేహాలు పడి ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఆ దృశ్యం హృదయ విదారకంగా ఉందని వారు పేర్కొన్నారు. నిందితురాలి మానసిక పరిస్థితిపై కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జెస్సీ గత కొంతకాలంగా తీవ్ర మానసిక సమస్యలతో బాధపడుతోందని, ఆయుధాలతో ప్రమాదం పొంచి ఉందని పలుమార్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయని అధికారులు అంగీకరించారు. గతంలో ఆమె ఇంటి నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నప్పటికీ, చట్టప్రకారం వాటి యజమాని కోరడంతో తిరిగి ఇవ్వాల్సి వచ్చిందని వారు వివరించడం గమనార్హం.

### ప్‌స్టీన్‌ను నియమించుకోలేదు: గేట్స్ ఫౌండేషన్

**హైదరాబాద్ పెన్ పవర్:** జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇటీవల అమెరికా ప్రభుత్వం విడుదల చేసిన ఫైళ్లలో ఎప్‌స్టీన్, దాతృత్వ సంస్థ గేట్స్ ఫౌండేషన్ సిబ్బంది మధ్య సంభాషణ జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఫౌండేషన్ ఓ ప్రకటన విడుదల చేసింది. తాము అతడిని నియమించుకోలేదని, ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరపలేదని వెల్లడించింది. "ఆరోగ్య సంరక్షణ, అభివృద్ధి కోసం విరాళాలు ఇచ్చే దాతలను సమకూరుస్తానని ఎప్‌స్టీన్ చెప్పడంతో ఫౌండేషన్ సిబ్బంది కొందరు అతడితో సంభాషణలు జరిపారు. అయితే తర్వాత దీనిపై ముందుకువెళ్లలేదు. ఎలాంటి నిధి ఏర్పాటు చేయలేదు. విషయం ఏదైనా సిబ్బంది అతడితో మాట్లాడటంపై చింతిస్తున్నాం" అని తన ప్రకటనలో పేర్కొంది. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్, మిలిందా 2000 సంవత్సరంలో బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్‌ను స్థాపించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు చేపడుతోంది. దీనికి బిల్‌గేట్స్ ఛైర్మన్‌గా ఉన్నారు. కాగా.. ఇటీవల అమెరికా ప్రభుత్వం 30 లక్షల 'ఎప్‌స్టీన్' పేజీలను బయటపెట్టింది. వీటితోపాటు 2,000 వీడియోలు, 1,80,000 ఫొటోలనూ విడుదల చేసింది. జైల్లో చనిపోయిన మిలియనీర్ ఫైనాన్షియర్ ఎప్‌స్టీన్ ఆధ్వర్యంలో మైనరు బాలికలపై జరిగిన లైంగిక వేధింపులకు సంబంధించిన వివరాలు అందులో ఉన్నాయి. ఈ విషయంలో ఆయన ట్రంప్, బిల్ క్లింటన్, ఎలాన్ మస్క్, బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూలతో జరిపిన సంభాషణలు ఉన్నాయి

## రష్యా చమురును భారత్ కొనబోదన్నది ట్రంప్ ఒక్కరే



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాతో వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేయనుందంటూ వార్తలొస్తున్న వేళ.. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ తమ దేశ పార్లమెంటులో కీలక వ్యాఖ్యలు చేశారు. మాస్కో నుంచి చమురు కొనుగోలును దిల్లీ ఆపేస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మినహా మరెవరూ చెప్పలేదన్నారు. పార్లమెంటు దిగువ సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు లావ్రోవ్ బుధవారం ఈ మేరకు సమాధానమిచ్చారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయబోమని ప్రధాని మోదీ సహా ఇతర భారతీయ నేతలెవరూ ప్రకటించలేదన్నారు. భారత్ వేదికగా ఈ ఏడాది జరగబోయే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో 'ఇంధన భద్రత' ఓ కీలకాంశంగా ఉండబోతోందని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ ఇటీవల వ్యాఖ్యానించిన సంగతిని లావ్రోవ్ గుర్తుచేశారు. ఆ సదస్సు సందర్భంగా మోదీతో రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దిల్లీతో సంబంధాల విషయంలో మాస్కో ఆకాశమే హద్దుగా ఎంత దూరమైనా వెళ్తుందని ఉద్ఘాటించారు.ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతున్నాయి. ఖర్కీవ్ ప్రాంతంలో మాస్కో బలగాలు మంగళవారం రాత్రి జరిపిన డ్రోన్ దాడిలో ఓ ఇల్లు ధ్వంసమైంది. ఈ ఘటనలో 34 ఏళ్ల ఓ వ్యక్తి, అతడి ముగ్గురు పిల్లలు మృత్యువాతపడ్డారు. మృతుల్లో ఇద్దరు రెండేళ్ల వయసున్న కవల బాలురు కాగా, మరొకరు ఏడాది వయసున్న పాప. దాడిలో ఆ పిల్లల తల్లి (35 వారాల గర్భిణి) తీవ్రంగా గాయపడింది.

## రష్యాలో వాట్సాప్ బంద్.. సొంత యాప్స్‌కే మొగ్గు!



**హైదరాబాద్ పెన్ పవర్:** రష్యాలో వాట్సాప్‌ను పూర్తిగా బ్లాక్ చేసే దిశగా చర్యలు జరుగుతున్నాయని మెటా ఆరోపించింది. దేశంలోని ఇంటర్నెట్ వ్యవస్థల్లో వాట్సాప్ డొమైన్‌లను నిరోధించినట్లు తెలుస్తోందని పేర్కొంది. స్థానిక డిజిటల్ వేదికలపై నియంత్రణ పెంచేందుకు సొంత 'మ్యాక్స్' యాప్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విమర్శించింది. వినియోగదారులతో అనుసంధానం కొనసాగించేందుకు తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని మెటా వెల్లడించింది. మరోవైపు రష్యా పౌరులను మ్యాక్స్ యాప్ వినియోగించాలంటూ అధికార వర్గాలు సూచిస్తున్నాయి.గ్లోబల్ టెక్ కంపెనీలన్నీ కూడా తమ దేశీయ చట్టాలను పాటించడంలో విఫలమయ్యాయని, సున్నిత సమాచారాన్ని బహిర్గతం చేస్తోన్నాయని, సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ల ద్వారా అవాస్తవాలనూ ప్రచారం చేస్తోన్నాయని రష్యా చాలాకాలం నుంచి ఆరోపిస్తూ వస్తోంది. తమ దేశంలో వాట్సాప్ సేవలు తిరిగి పునరుద్ధరణకు నోచుకోవాలంటే మెటా.. స్థానిక చట్టాలకు లోబడి ఉండాలని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. మెటా రాజీ పడని వైఖరిని అవలంబిస్తే, వాట్సాప్ పునరుద్ధరణకు అవకాశం ఉండబోదని తేల్చి చెప్పారు.

## వాతావరణ మార్పుల కట్టడిలో రేడియో ప్రసారాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ మానవాళికి ఆత్మీయ నేస్తంగా గత 130 ఏండ్ల నుంచి సమాచార వినోద విజ్ఞాన క్రీడా సమకాలీన వార్తలను ఇంటింటి చేర్చుతున్న ఎలక్ట్రానిక్ ఉపకరణంగా రేడియో అమూల్య సేవలను అందిస్తున్నది. టెలివిజన్, ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ రాకతో రేడియో వినియోగం కొంత తగ్గినా, నేటికీ మారుమూల మానవాళి మనసులను సహితం దోస్తున్న ఉపకరణం రేడియో మాత్రమే. నమ్మకానికి పెట్టింది పేరు మన రేడియో. సాపేక్షంగా చవకైన సాధనంగా రేడియో ప్రపంచ వార్తలను క్షణాల్లో అందిస్తూ, సహజ/మానవ తప్పిద విపత్తుల సమయంలో ప్రజలకు విలువైన సమాచారాన్ని అందిస్తున్న రేడియో ప్రాధాన్యం ఎన్నటికీ చెక్కుచెదరదు. వాహన ప్రయాణ సమయాల్లో మనందరికీ ఉపయోగకరమైన రేడియో మన నిత్య స్నేహితుడిగా వ్యవహరిస్తున్నది. 1895లో ఇటాలియన్ గుల్గిమో మార్కోనీ ఆవిష్కరించిన రేడియో కాలక్రమంలో 1919లో అమెరికాలో తొలి రేడియో స్టేషన్ ప్రారంభం కావడం, 1939లో ఎఫ్ఎం రేడియో ప్రసారాలు ప్రారంభం అయ్యాయి. 1994లో డిజిటల్ రంగులు అద్దుకోని 24 – గంటల సమాచార వితరణ ప్రసారాలు చేస్తున్న రేడియో నేటికీ ప్రతి ఇంట్లో మారుమోగుతానే ఉన్నది. ప్రపంచవ్యాప్త సమాచారం, విద్య, వైజ్ఞానిక, వ్యవసాయ, వినోద, వాతావరణ హెచ్చరికలు, స్థానిక వార్తలు, సంగీతం, లలిత గీతాలు, క్రీడా విశేషాలు, రన్నింగ్ కామెంటరీలు, చర్చలు, మార్కెటింగ్ అంశాలు, సమకాలీన సమస్యలు లాంటి అనేక అంశాలను నిత్యం మన వద్దకు చేర్చుతున్న రేడియో ప్రయోజనాలు అనంతం. 2011లో యునెస్కో చొరవ, ప్రతిపాదనలతో 2012 నుంచి ఐరాస సభ్య దేశాలు ప్రతి ఏట 13 ఫిబ్రవరి రోజున "ప్రపంచ రేడియో దినోత్సవం (వరల్డ్ రేడియో డే)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. రేడియో విలువను అవగాహన పరచడం, ఎఫ్ఎం లాంటి నవ్య టెక్నాలజీలను అందిపుచ్చుకొని అవసర మార్పులు చేసుకుంటూ నేటికీ రేడియో తన ఉనికిని చాటుకుంటూనే ఉన్నది. ప్రపంచ రేడియో దినోత్సవం వేదికగా స్థానిక, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ రేడియో ప్రసారాలు నిర్విరామంగా కొనసాగడాన్ని ప్రజలకు అవగాహన పరచడం కూడా జరుగుతుంది. అంతర్జాల డిజిటల్ టెక్నాలజీలను అందిపుచ్చుకొని వాతావరణ సమాచారాన్ని, వాతావరణ మార్పుల కట్టడికి నడుంబించిన మన నమ్మకమైనా మిత్రుడు రేడియో అంటూ ఏకరువు పెట్టడం కూడా జరుగుతుంది. ప్రపంచ మానవాళినా ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాతావరణ ప్రతుల మార్పులను ప్రజల చెత్తకు చేర్చుతూ పర్యావరణ పరిరక్షణ, సుస్థిర వాతావరణ స్థాపన, పౌర సమాజ పాత్రను సహితం వివరించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో రేడియో ప్రధాన భూమికను నిర్వహిస్తున్న వేళ ప్రపంచ రేడియో దినం–2026 ఇతివృత్తంగా "రేడియో – కృత్రిమ మేధ (రేడియో అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్" అనే అంశాన్ని తీసుకొని ప్రచారాలు నిర్వహించడం జరుగుతుంది. ప్రపంచ రేడియో దినం వేదికగా కార్యశాలలు, వెబినార్లు, సదస్సులు, చర్చలు, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, విద్యా వైజ్ఞానిక సమావేశాలు లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించాలి. నేటి ఆధునిక డిజిటల్-ఏఐ యుగంలో కూడా రేడియో అవసర మార్పులు చేసుకుంటూ మానవాళి ప్రియ విశ్వాస నేస్తంగా రేడియో సేవలు అందిస్తున్న వేళ అందరికీ ప్రపంచ రేడియో దినోత్సవ శుభాకాంక్షలను తెలుపుకుందాం, రేడియో ప్రసారాలతో ప్రయోజనం పొందుదాం.

## టాపిక్, ప్లేస్ డిసైడ్ చేయండి.. వట్టి చేతులతో వస్తా

**హైదరాబాద్ పెన్ పవర్:** గయానా పార్లమెంట్‌లో ఆసక్తికర ఘటన చోటుచే?సుకుంది. ఓ చర్చ సందర్భంగా తన హిందీ భాషా పరిజ్ఞానం గురించి ప్రతిపక్ష ఎంపీ చేసిన విమర్శలకు భారత సంతతికి చెందిన వికాష్ రామ్‌కిసూన్ అనర్గళంగా ప్రసంగించి విమర్శకుల నోళ్లు మూయించారు.హిందీలో ఆయన ఇచ్చిన సమాధానంతో చర్చ ఊహించని మలుపు తిరిగింది. రామ్‌కిసూన్‌కు హిందీ అర్థం కాలేదని ప్రతిపక్ష సభ్యుడు విమర్శించడంతో వాగ్వాదం మొదలైంది. స్పీకర్ అనుమతి కోరుతూ.. ఆ వ్యాఖ్యపై నేరుగా ప్రస్తావించడానికి తాను హిందీలోనే స్పందిస్తానని రామ్‌కిసూన్ అన్నారు.అనంతరం ఆయన సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ప్రతిపక్ష సభ్యుని పేరు చెప్పి బహిరంగ సవాలు విసిరారు. తన ప్రత్యర్థి ఎంపిక చేసిన ఏ అంశంపైనైనా.. ఏ ప్రదేశంలోనైనా చర్చించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. చర్చను టీవీ ఛానెల్‌లోనైనా నిర్వహించకోవచ్చని, నోట్స్ లేదా పేపర్లపై రాసి చదవకుండా పూర్తిగా హిందీలో మాట్లాడుతానని ఆయన అన్నారు. 'టాపిక్, ప్లేస్ మీరు డిసైడ్ చేయండి.. నేను ఎటువంటి పేపర్ లేకుండా సమాధానం చెబుతాను'అని సవాల్ చేశారు. తనకు హిందీలో ప్రావీణ్యం లేదనే వాదనలను తిప్పికొడుతూ.. ఆ భాషలో తాను స్వేచ్ఛగా మాట్లాడతానని ఆయన నొక్కి చెప్పారు. తన ప్రసంగంతో సభలోని ప్రజాప్రతినిధుల దృష్టిని రామ్‌కిసూన్ ఆకర్షించారు. అంతేకాదు, ఈ ప్రసంగం గయానా, విదేశాలలో ఉన్న భారత సంతతికి చెందిన సభ్యుల దృష్టిని త్వరగా ఆకర్షించింది. దీనికి సంబంధించిన వీడియోను గయానాలోని భారత హైకమిషన్ కార్యాలయం ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేయడంతో క్షణాల్లోనే సోషల్ మీడియా వైరల్‌గా మారింది. హిందీలో ఆయన ప్రసంగానికి ఫిదా అవుతున్నారు. గయానాలో భారత సంతతికి చెందిన జనాభా అధికంగా ఉన్నారు. ఇంగ్లీష్ ఆ దేశ
అధికారిక భాష అయినప్పటికీ హిందీ సాంస్కృతికంగా ముఖ్యమైందిగా ఉంది. వికాష్ రామ్‌కిసూన్ ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీకామ్, కామర్స్ అండ్ ఫైనాన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. హిందీపై తనకున్న పట్టు కేవలం అకడమిక్ పరంగానే కాదు తన సాంస్కృతిక గుర్తింపులో కూడా పాతుకుపోయిందని నొక్కి చెప్పారు. గతేడాది సెప్టెంబర్ 13న బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రామ్‌కిసూన్ భారత్, గయానా మధ్య సాంస్కృతిక వారధిగా తనను తాను మరింతగా నిలబెట్టుకున్నారు. ఇరు దేశాల ఉమ్మడి వారసత్వం, భాషా సంబంధాలను నొక్కి చెప్పారు.

## డేకేర్ సెంటర్‌లో దుండుగుడు కాల్పులు.. 23 మంది చిన్నారులు సహా 34 మంది మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** థాయ్‌లాండ్‌లో దారుణం చోటుచేసుకుంది. దక్షణ థాయ్‌లాండ్‌లోని స్లోంకాలో ఓ డేకేర్ సెంటర్‌లో దుండుగులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడి 34 మందిని పొట్టనబెట్టుకున్నారు.మృతుల్లో 23 మంది చిన్నారులు ఉన్నట్టు గుర్తించారు. తుపాకులతో డే కేర్ స్కూల్‌లోకి చొరబడిన ఆగంతకులు.. కాల్పులకు పాల్పడ్డారు. దీంతో భయపడిపోయిన విద్యార్థులు, సిబ్బంది హాహాకారాలు చేస్తూ బయటకు పరుగులు తీశారు. ఇందుకు సంబంధించిన విజువల్స్ ప్రస్తుతం వైరల్‌గా మారాయి. హట్ యా స్కూల్‌లోకి బుధవారం మధ్యాహ్నం తుపాకితో 18 ఏళ్ల యువకుడు చొరబడి, కాల్పులు జరిపినట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో పిల్లలు, సిబ్బంది సహా పలువురు గాయపడినట్టు తొలుత పోలీసులు ప్రకటించారు. స్థానిక కాలమానం ప్రకారం.. బుధవారం సాయంత్రం 4.45 గంటల ప్రాంతంలో జరిగినట్టు మీడియా కథనాలు వెలువరించాయి. ఎంత మంది చనిపోయారు, ఎందరు గాయపడ్డారనేది అధికారులు ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటన చేయలేదని తెలిపాయి. నిందితుడ్ని ఖేమ్‌గా గుర్తించినట్టు పేర్కొన్నాయి.ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు, భద్రతా సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అయితే, అప్పటికే నిందితుడు ఘటనా స్థలి నుంచి పరారయ్యాడని, దుండగుడు కాల్పులకు వినియోగించిన ఎం4 రైఫిల్‌ను అక్కడ వదిలేసినట్టు మీడియా పేర్కొంది. దుండుగుడు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడటంతో బీతావాహ పరిస్థితి నెలకుంది. చిన్నారుల అరుపులు, ఆర్తనాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఒక్క సంఘటనతో ఆ చిన్నారుల తల్లిదండ్రుల ఆశలు, కలలు కుప్ప కూలిపోయాయి. నిందితుడు ఇంతటి దారుణానికి పాల్పడటానికి కారణం ఏంటి? అనేది తెలియాల్సి ఉంది. ఈ దుర్ఘటన మరోసారి థాయ్‌లాండ్‌లో భద్రతపై ఆందోళనను రేకిత్తించింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అయితే, గతంలోనూ ఇలాంటి ఘటనలు థాయ్‌లాండ్‌లో జరిగిన దాఖలాలు ఉన్నాయి. అక్టోబరు 2022లో ఈశాన్య థాయ్‌లాండ్‌లోని ఓ స్కూల్‌లోకి కత్తి, తుపాకితో మాజీ పోలీస్ అధికారి ప్రవేశించి మారణహోమానికి పాల్పడ్డాడు.

## రాహుల్ గాంధీ ఆరోపణలు పచ్చి అబద్ధం.. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తనపై చేసిన ఆరోపణలన్నీ పూర్తిగా నిరాధారమైనవని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీ సభలో ప్రస్తావించిన అంశాల్లో ఏమాత్రం వాస్తవం లేదని, అవన్నీ అబద్ధాలేనని ఆయన కొట్టిపారేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి అసత్య ప్రచారాలు చేయడం తగదని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే రాహుల్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని పురి మండిపడ్డారు.తమ మధ్య జరిగిన సంభాషణల గురించి వివరిస్తూ, రాహుల్ గాంధీ చెబుతున్నవి కేవలం కట్టుకథలని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. "లక్షలాది ఈమెయిల్స్‌లో నా గురించి కేవలం నాలుగు లైన్లు మాత్రమే ఉన్నాయి, మా మధ్య కేవలం ఒకే ఒక్క మెయిల్ సంభాషణ జరిగింది" అని పురి స్పష్టం చేశారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంపై చర్చల సందర్భంలో తామిద్దరం గతంలో కొన్నిసార్లు భేటీ అయిన మాట వాస్తవమేనని, అయితే వాటిని రాహుల్ ఇప్పుడు వక్రీకరించి చెప్తున్నారని ఆయన విమర్శించారు.గతంలో కూడా రాహుల్ గాంధీ ఇలాంటి నిరాధారమైన విమర్శలు చేశారని, వాటన్నింటికీ కాలమే సమాధానం చెప్పిందని పురి గుర్తు చేశారు. ముఖ్యంగా గతంలో రాహుల్ చేసిన 'ఓట్ చోరీ' ఆరోపణలు కూడా అబద్ధమని ఇప్పటికే తేలిపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. పదేపదే అబద్ధాలు చెబుతూ తన రాజకీయ అస్తిత్వాన్ని కాపాడుకోవాలని రాహుల్ ప్రయత్నిస్తున్నారని, కానీ ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని మంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు. పార్లమెంట్ వేదికగా ఒకరి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హర్దీప్ సింగ్ పురి హితవు పలికారు. వాస్తవాలను సరిచూసుకోకుండా నోటికొచ్చినట్లు మాట్లాడటం రాహుల్ గాంధీకి అలవాటుగా మారిందని ఆయన ధ్వజమెత్తారు. తనపై చేసిన ప్రతి ఆరోపణకు తగిన ఆధారాలు చూపాలని, లేదంటే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హర్దీప్ సింగ్ పురి తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

## హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో కస్టమర్‌తో ఘర్షణ

### వైరల్ వీడియో పై స్పందించిన మహిళా ఉద్యోగి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో ఒక మహిళా ఉద్యోగి ఒక కస్టమర్‌తో తీవ్ర ఘర్షణకు దిగుతున్నట్లు చూపించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీని తర్వాత, ఆస్తా సింగ్ అనే ఉద్యోగి కార్యాలయంలో కఠినమైన భాషను ఉపయోగించకూడదని తనకు తెలుసు అయినప్పటికీ, 'తనకు గుణపాఠం నేర్పుతానని' ఎవరైనా బెదిరిస్తే తాను సహించనని స్పష్టం చేశారు.హెచ్‌డిఎఫ్‌సి పాంకి బ్రాంచ్ నుండి వచ్చిన వైరల్ వీడియోలో, సింగ్ ఒక కస్టమర్‌పై దుర్భాషలాడుతూ, కుల ప్రస్తావనతో కూడిన వ్యాఖ్యలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎక్స్‌లో వైరల్ అయిన ఈ వీడియోలో, సింగ్ కోపంగా బ్యాంకులోని ఒక వ్యక్తిని చూపుతూ ఉన్నట్లు చూపించారు.ఆమె "ఠాకూర్ హూన్ మైన్ (నేను ఠాకూర్)" అని చెప్పింది, ఆమెతో గొడవ పడవద్దని ఆ వ్యక్తిని హెచ్చరించింది. ఈ వ్యాఖ్య కొంతమంది ఆమె ప్రకటనను బెదిరింపుల కోసం కుల గుర్తింపును ఉపయోగించుకునే ప్రయత్నంగా భావించినందున కొంతమంది విమర్శలకు దారితీసింది. వైరల్ వీడియోపై పెరుగుతున్న ఊహాగానాల మధ్య, హెచ్‌డిఎఫ్‌సి సిబ్బంది ఒక వివరణ జారీ చేశారు.సింగ్ మాట్లాడుతూ, మొదటగా, ఈ వీడియో ఇటీవలి సంఘటన కాదని, ఇది జనవరి 6 నాటిదని స్పష్టం చేశారు. "రెండవది, ఈ వీడియో ఒక కస్టమర్‌కు సంబంధించినది కాదు. నేను ఒక కస్టమర్‌తో తప్పుగా ప్రవర్తించలేదు. ఈ వీడియో నాలాగే అదే బ్యాంకు శాఖలో పనిచేస్తున్న మరొక మహిళా ఉద్యోగి భర్తతో జరిగిన వాదన నుండి వచ్చింది" అని సింగ్ తన క్లారిఫికేషన్ వీడియోలో పేర్కొంది.ఈ వీడియోను నేను ఒక కస్టమర్‌తో వాదిస్తున్నట్లు చూపించడానికి తప్పుగా అర్థం చేసుకోడమే కాకుండా, కుల గుర్తింపుపై వివాదం కూడా సృష్టించింది.సింగ్ ఈ సంఘటన గురించి తన కథనాన్ని మరింత వివరంగా చెప్పారు. తన సహోద్యోగులలో ఒకరు రాజీనామా చేశారని మరియు అదే రోజు ఉపశమనం పొందాలని కోరుకుంటున్నారని ఆమె చెప్పారు.తన సహోద్యోగి భర్త పని గంటలు తర్వాత బ్రాంచ్‌లో వచ్చాడని ఆమె ఆరోపించింది. "అతను సాయంత్రం 4:30 గంటలకు బ్యాంకులోకి చొరబడి నాతో అనుచితంగా ప్రవర్తించాడు. నేను ఏ కులానికి చెందినవాడిని (కౌన్సీ జాతి కే హో) అని నేరుగా అడిగాడు మరియు నాకు చాలా అహంకారం ఉందని చెప్పాడు" అని సింగ్ జోడించారు.

# తగ్గిన క్రెడిట్ కార్డ్ చెల్లింపులు



**హైదరాబాద్ పెన్ పవర్:** పండగ సీజన్ ముగియడంతో క్రెడిట్ కార్డు ద్వారా చేస్తున్న ఖర్చులు తగ్గుముఖం పట్టాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) తాజా గణాంకాల ప్రకారం, గతేడాది డిసెంబర్‌లో క్రెడిట్ కార్డు ఖర్చులు అంతకుముందు ఏడాదితో పోలిస్తే 8.9 శాతం తగ్గింది. విలువ పరంగా క్రెడిట్ కార్డు ఖర్చులు రూ. 2.05 లక్షల కోట్లుగా ఉన్నాయి. అయితే, నెలవారీ ప్రాతిపదికన నవంబర్‌లో కంటే వీటి ఖర్చులు 8.4 శాతం పెరిగాయి. ఖర్చులు ఎక్కువగానే ఉన్నప్పటికీ, క్రెడిట్ కార్డుల వాడకం తక్కువగా ఉందని ఆర్‌బీఐ డేటా సూచిస్తోంది. నెలవారీగా పెరిగేందుకు ఈ-కామర్స్ కార్యకలాపాలు, అధిక ప్రయాణ గిరాకీ దోహదపడ్డాయి. డిసెంబర్ నెలలో ఒక్కో క్రెడిట్ కార్డు నెలవారీ సగటు ఖర్చు 8 శాతం పెరిగి రూ. 17,712కి పెరిగింది. ఇక, క్రెడిట్ కార్డుల విస్తరణ స్థిరంగా కొనసాగుతోంది. డిసెంబర్ నాటికి క్రెడిట్ కార్డుల సంఖ్య 11.6 కోట్లకు పెరిగింది. అంతకుముందు ఏడాది ఇదే నెలలో 10.8 కోట్లు ఉన్నాయి. మొత్తం క్రెడిట్ కార్డ్ ఖర్చుల్లో ప్రైవేట్ రంగ బ్యాంకులు 72.5 శాతం వాటాను కలిగి ఉన్నాయి. అయితే, అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఈ వాటా 3.75 శాతం తగ్గింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రం ఖర్చుల వాటాను 17.7 శాతం నుంచి 22.2 శాతానికి పెంచుకున్నాయి.

# నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ. 19.43 లక్షల కోట్లు




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఫిబ్రవరి 10 నాటికి రూ. 19.43 లక్షల కోట్లకు పైగా వసూలైనట్లు ఆదాయ పన్ను విభాగం బుధవారం తెలిపింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇవి 9.4 శాతం వృద్ధి చెందాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ మంది పన్నులు సరిగ్గా చెల్లించడంతో పాటు వ్యాపార కార్యకలాపాలు పెరగడం వల్లనే ఈ పెరుగుదలకు ప్రధాన కారణమని ఆదాయ పన్ను విభాగం పేర్కొంది. ఆదాయపు పన్ను శాఖ బుధవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు 14.51 శాతం పెరిగి రూ. 8.90 లక్షల కోట్లకు చేరుకోగా, వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్‌లు) సహా కార్పొరేటేయేతర సంస్థల నుంచి వచ్చే పన్నులు 5.91 శాతం పెరిగి రూ. 10.03 లక్షల కోట్లకు చేరుకున్నాయి. సెక్యూరిటీ లావాదేవీల పన్ను వసూళ్లు రూ. 50,279 కోట్లుగా ఉన్నాయి. ఇదే సమయంలో పన్ను రీఫండ్లు 18.82 శాతం తగ్గి రూ. 3.34 లక్షల కోట్లకు చేరుకున్నాయి. రిఫండ్‌ల సర్దుబాటు చేయడానికి ముందు స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఫిబ్రవరి 10 నాటికి 4.09 శాతం

పెరిగి రూ. 22.78 లక్షల కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సవరించిన అంచనాలలో ప్రభుత్వం ప్రత్యక్ష పన్ను వసూళ్లను రూ.24.84 లక్షల కోట్లుగా అంచనా వేసింది.

# అమెరికా - వెనెజువెలా నుంచి మరింత చమురు!




**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, వెనెజువెలా నుంచి ముడిచమురు కొనుగోళ్లు పెంచడాన్ని పరిశీలించాల్సిందిగా ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి ప్రభుత్వరంగ రిఫైనరీ సంస్థలను ప్రభుత్వం కోరింది. తమతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా చమురు కొనుగోలు చేయడాన్ని భారత్ నిలిపి వేయనుందని అమెరికా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, టెండర్ల ద్వారా స్పాట్ మార్కెట్ నుంచి చమురు కొనుగోలు చేసే సమయంలో అమెరికా గ్రేడ్‌లకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం కోరినట్లు రిఫైనరీ వర్గాలు తెలిపాయి. వెనెజువెలా ముడిచమురు విషయంలోనూ ప్రభుత్వం ఇటువంటి సూచనే చేసినట్లు వెల్లడించాయి. రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇంధన భద్రతకు ప్రాధాన్యమిస్తామని, దేశ అవసరాలకు అనుగుణంగా అవకాశం ఉన్న చోట కొనుగోలు చేస్తామనే మనదేశం వెల్లడించింది. అమెరికా, వెనెజువెలా చమురు కొనుగోళ్ల విషయంలో భారత రిఫైనరీలకు పరిమితులు ఉన్నాయి. అమెరికా చమురు గ్రేడ్‌లలో తక్కువ గంధకం (సల్ఫర్) ఉంటుంది. అయితే భారత రిఫైనరీలు తమ యూనిట్లను మధ్యరకం చమురును శుద్ధి చేసేందుకు వీలుగా ఏర్పాటు చేశాయి. అందువల్ల అమెరికా చమురు ఎంతవరకు సరిపోతుందో చూడాల్సిందే. దీంతోపాటు చమురు రవాణా ఖర్చులూ అధికమవుతాయి. పశ్చిమ ఆఫ్రికా, కజకిస్థాన్ నుంచి అయితే ఖర్చు తగ్గుతుంది. వెనెజువెలా ముడిచమురు నిల్వలను విక్రయించడంపై అమెరికా దృష్టి పెట్టింది. మనదేశం నుంచి ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం రిఫైనరీలు ఇటీవల 4 మిలియన్ బ్యారెళ్ల వెనెజువెలా ముడిచమురును దిగుమతి చేసుకున్నాయని సమాచారం.

# మహిళా శక్తి : భారత పురోగతికి పునాది

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ సామాజిక చరిత్రలో మహిళల పాత్రను, వారి సాధనలను, సమానత్వం కోసం సాగిన పోరాటాన్ని స్మరించుకునే ముఖ్యమైన సందర్భాలలో జాతీయ మహిళా దినోత్సవం ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ప్రతి ఏటా ఫిబ్రవరి 13న జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా భారత సమాజం మహిళా శక్తిని గౌరవిస్తూ, వారి కృషి దేశ నిర్మాణంలో ఎంత కీలకమో గుర్తు చేసుకుంటుంది. ఈ దినోత్సవం కేవలం ఉత్సవంగా మాత్రమే కాకుండా, మహిళల హక్కులు, అవకాశాలు, సవాళ్లు, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఆలోచనకు ప్రేరేపించే వేదికగా నిలుస్తుంది. భారతదేశం వంటి వైవిధ్యభరిత దేశంలో మహిళల స్థానం, వారి పురోగతి, ఇంకా ఎదుర్కొంటున్న అడ్డంకులు ? ఇవన్నీ ఈ సందర్భంగా విశ్లేషించాల్సిన కీలక అంశాలుగా నిలుస్తాయి. భారతీయ సంస్కృతిలో మహిళను శక్తి స్వరూపిణిగా భావించే పరంపర ఎంతో పురాతనమైనది. వేదకాలంలోనే గార్గి, మైత్రేయి వంటి మహిళలు తత్వచింతనలో విశిష్ట స్థానాన్ని సంపాదించగా, మధ్యయుగాల్లో అనేక సామాజిక ఆంక్షలు మహిళల స్వేచ్ఛను పరిమితం చేశాయి. అయినప్పటికీ, భారత మహిళలు ప్రతి దశలోనూ తమ ప్రతిభను, పట్టుదలను చాటుతూ ముందుకు సాగారు. జాతీయ మహిళా దినోత్సవం ఆ చారిత్రక ప్రయాణాన్ని గుర్తు చేస్తూ, సమాన హక్కుల కోసం జరిగిన ఉద్యమాల ప్రాధాన్యాన్ని వెలుగులోకి తీసుకొస్తుంది. మహిళా విద్య, ఆర్థిక స్వావలంబన, రాజకీయ భాగస్వామ్యం వంటి అంశాలు సమాజ పురోగతికి ఎంత అవసరమో ఈ దినోత్సవం స్పష్టంగా తెలియజేస్తుంది. స్వాతంత్ర్య సమరంలో భారత మహిళల పాత్ర విశేషమైనది. సరోజినీ నాయుడు, అరుణ ఆసఫ్ అలీ, కస్తూర్బా గాంధీ వంటి మహనీయులు దేశ స్వాతంత్ర్యానికి తమ వంతు కృషి చేశారు. వారి త్యాగాలు, నాయకత్వం మహిళల సామాజిక చైతన్యానికి దారితీశాయి. స్వాతంత్ర్యం అనంతరం భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులను కల్పించడం ద్వారా సామాజిక న్యాయానికి పునాది వేసింది. అయినప్పటికీ, చట్టపరమైన సమానత్వం ఉన్నప్పటికీ సామాజిక వాస్తవికతలో అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ విరుద్ధ పరిస్థితిని సరిచేయడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఆధునిక భారతదేశంలో మహిళలు విద్య, విజ్ఞానం, సాంకేతికత, వైద్యం, క్రీడలు, రాజకీయాలు, వ్యాపారం వంటి అనేక రంగాల్లో అద్భుత విజయాలను సాధిస్తున్నారు. అంతరిక్ష పరిశోధనలో నుంచి కార్పొరేట్ నాయకత్వం వరకు మహిళల ప్రతిభ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. అయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో బాలికల విద్య, ఆరోగ్యం, పోషణ, ఉపాధి అవకాశాల విషయంలో ఇంకా అసమానతలు కనిపిస్తున్నాయి. లింగ వివక్ష, బాల్య వివాహాలు, గృహ హింస వంటి సమస్యలు సమాజానికి సవాలుగా మిగిలే ఉన్నాయి. జాతీయ మహిళా దినోత్సవం ఈ సమస్యలను బహిర్గతం చేస్తూ, పరిష్కార మార్గాలపై చర్చకు దోహదం చేస్తుంది. మహిళా సాధికారత అనేది కేవలం ఆర్థిక స్వాతంత్ర్యంతో పరిమితం కాదు; అది సామాజిక గౌరవం, నిర్ణయాధికారం, వ్యక్తిగత స్వేచ్ఛ, భద్రత వంటి అంశాల సమాహారం. మహిళలు కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి కృషికి తగిన గుర్తింపు లభించడం చాలా సందర్భాల్లో కష్టసాధ్యమవుతోంది. ఈ నేపథ్యంలో జాతీయ మహిళా దినోత్సవం మహిళల శ్రమను, మేధస్సును, నాయకత్వాన్ని గౌరవించే సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందిస్తుంది. మహిళలపై ఉన్న మూఢనమ్మకాలు, సామాజిక పరిమితులను అధిగమించడానికి విద్య, చట్టపరమైన అవగాహన, సామాజిక మద్దతు అత్యంత అవసరం.

ప్రభుత్వ విధానాలు మహిళా సంక్షేమానికి కీలకంగా మారాయి. స్వయం సహాయక సంఘాలు, మహిళా ఉపాధి పథకాలు, ఆరోగ్య బీమా కార్యక్రమాలు, బాలికల విద్యను ప్రోత్సహించే పథకాలు మహిళల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తున్నాయి. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచడం కూడా ఒక ముఖ్యమైన ముందడుగు. అయితే, విధానాల అమలు సమర్థవంతంగా జరగకపోతే లక్ష్యాలు నెరవేరవు. అందుకే అవగాహన, పర్యవేక్షణ, సమాజ భాగస్వామ్యం కీలకం. మహిళలపై హింస, వివక్ష వంటి సమస్యలను నిర్మూలించడానికి కేవలం చట్టాలు సరిపోవు; సామాజిక దృక్పథం మారాలి. కుటుంబ స్థాయిలోనే సమానత్వ భావనను పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు సానుకూల దిశానిర్దేశం చేయవచ్చు. పాఠశాల విద్యలో లింగ సమానత్వంపై అవగాహన కల్పించడం, మీడియా ద్వారా సానుకూల సందేశాలు పంపించడం, సమాజంలో ఆదర్శ మహిళల కథనాలను ప్రచారం చేయడం ద్వారా చైతన్యం పెరుగుతుంది. జాతీయ మహిళా దినోత్సవం ఈ దిశగా సమాజాన్ని ఆలోచింపజేసే వేదికగా నిలుస్తుంది.

ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్రను గుర్తించడం అత్యంత అవసరం. మహిళల ఉపాధి అవకాశాలు పెరిగితే కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా దేశ ఆర్థిక వృద్ధికి కూడా దోహదం చేస్తుంది. సూక్ష్మ, చిన్న పరిశ్రమలు, వ్యవసాయం, సేవారంగం వంటి విభాగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతోంది. డిజిటల్ సాంకేతికత మహిళలకు కొత్త అవకాశాలను తెరుస్తోంది. ఆన్‌లైన్ వ్యాపారం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, స్వయం ఉపాధి కార్యక్రమాలు మహిళల స్వావలంబనకు బాటలు వేస్తున్నాయి. ఈ మార్పులు సమాజంలో మహిళల స్థానాన్ని బలపరుస్తున్నాయి. జాతీయ మహిళా దినోత్సవం ఒక స్మరణిక మాత్రమే కాదు ? అది సమానత్వం, న్యాయం, గౌరవం అనే విలువలను పునరుద్ఘాటించే

సామాజిక ఉద్యమం. మహిళల సాధికారత లేకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదు. సమాజంలోని ప్రతి వర్గం మహిళల హక్కులను గౌరవిస్తూ, వారికి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలి. కుటుంబం నుంచి ప్రభుత్వ వ్యవస్థల వరకు ప్రతి స్థాయిలో మహిళా భాగస్వామ్యం పెరిగితేనే సమాజం సుస్థిరంగా అభివృద్ధి చెందుతుంది. భారత మహిళల చరిత్ర పోరాటాల, విజయాల, ఆశయాల సమాహారం. ఫిబ్రవరి 13న జరుపుకునే జాతీయ మహిళా దినోత్సవం ఆ చరిత్రను స్మరించుకుంటూ భవిష్యత్తు దిశగా అడుగులు వేయడానికి ప్రేరణనిస్తుంది. మహిళల ప్రతిభకు, శ్రమకు, ఆత్మవిశ్వాసానికి సముచిత గౌరవం లభించినప్పుడే నిజమైన సామాజిక సమానత్వం సాధ్యమవుతుంది. ఈ దినోత్సవం మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది ? మహిళా సాధికారత అనేది దేశ అభ్యున్నతికి పునాది. మహిళలను గౌరవించే సమాజమే శక్తివంతమైన, సమానత్వభరితమైన భవిష్యత్తును నిర్మించగలదు.ు

# తగ్గిన బంగారం ధరలు




**హైదరాబాద్ పెన్ పవర్:** ధర గురువారం భారీగా తగ్గింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో ఇవాళ 24 క్యారెట్ల 10గ్రాముల పసిడి ధర రూ. 1,200 తగ్గి రూ.1,58,400కు చేరింది. 22 క్యారెట్ల 10గ్రాముల గోల్డ్ రేటు రూ.1,100 తగ్గి రూ.1,45,200వద్ద కొనసాగుతోంది. అటు వెండి ధరల్లో ఎలాంటి మార్పులేదు. ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.3లక్షలుగా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాల్లో ధరల్లో స్వల్ప తేడాలున్నాయి.గత నెలలో రికార్డ్ గరిష్ఠాలను తాకిన బంగారం, వెండి రేట్లు వెనక్కి దిగివచ్చిన సంగతి తెలిసిందే. అయితే, మళ్లీ ఇప్పుడు వరుసగా పెరుగుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. అయినప్పటికీ కూడా ఆల్ టైమ్ హై స్థాయి కన్నా దాదాపు రూ.20 వేల తక్కువగానే ఉన్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. కొనుగోలు చేసేందుకు ఇది సరైన సమయంగా చెబుతున్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులతో బంగారంలో పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య పెరుగుతోందని, పసిడి రేట్లు మరింత పెరగుతాయని అంచనా వేస్తున్నారు. ఓవైపు బంగారం ధరలు పెరుగుతూ ఆందోళన కలిగిస్తున్న తరుణంలో వెండి స్వల్ప ఊరట కల్పించింది. వరుసగా రెండో రోజూ ఎలాంటి మార్పు లేకుండా స్థిరంగా కొనసాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రేటు రూ.3,00,000 మార్క్ వద్దే స్థిరంగా ట్రేడవుతోంది.

# ఉద్యోగులకు గూగుల్ ఊహించని షాక్




**హైదరాబాద్ పెన్ పవర్:** టెక్నాలజీ రంగంలో ప్రస్తుతం అధికంగా వినిపిస్తున్న మాట ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ). అన్ని రంగాల్లోనూ శరవేగంగా విస్తరిస్తోంది. ఏఐని అందిపుచ్చుకునేందుకు చాలా కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. వ్యయ నియంత్రణ, టెక్నాలజీ అప్‌గ్రేడ్ పేరుతో ఉద్యోగుల్లో కోత పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ షాకింగ్ ప్రకటన చేసింది. గూగుల్ తన ఉద్యోగులకు ఒక ఆఫర్ ఇచ్చింది. కంపెనీ ఏఐ ప్రణాళికలకు సిద్ధంగా లేని వారు స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసి వెళ్లిపోవాలని సూచించింది. వారికి వాలంటరీ రిటైర్మెంట్ ప్యాకేజీని ఆఫర్ చేసింది. ఈ మేరకు గూగుల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఫిలిప్ షిండ్లర్ పేర్కొన్నట్లు చెబుతూ బిజినెస్ ఇన్‌సైడర్ ఓ కథనం ప్రచురించింది. గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్ లోని కొందరు ఉద్యోగులకు ఈ స్వచ్ఛంద నిష్క్రమణ ప్యాకేజీ వర్తిస్తుందని కథనం పేర్కొంది. గూగుల్ కంపెనీలోని జీబీఓ యూనిట్ సంస్థ ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన ప్రకటనలు, గ్లోబల్ రెవెన్యూ గ్రోత్ ను పర్యవేక్షిస్తుంది. 2025 సంవత్సరానికి గూగుల్ పేరెంట్ కంపెనీ ఆల్ఫాబెట్ రెవెన్యూ 400 బిలియన్ డాలర్లుగా ఉంది. 2026ను మెరుగ్గా ఆరంభించింది. అయినప్పటికీ ఏఐ పరిధిని విస్తరించాలనే వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఏఐని అందిపుచ్చుకునే వారినే కంపెనీ కోరుకుంటున్నట్లు షిండ్లర్ పేర్కొన్నట్లు కథనం వెల్లడించింది. అమెరికాలోని కస్టమర్ సేల్స్ టీమ్స్, కస్టమర్ ఫేసింగ్ పొజిషన్స్ ఉద్యోగులకు ఈ ప్యాకేజీ వర్తించదని ఆయన తెలిపారు.

# మరో హెల్త్ బ్రాండ్ కొనుగోలు చేసిన రిలయన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ వ్యాపార విస్తరణలో దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఇటీవల ఆస్ట్రేలియాకు చెందిన గుడ్ నెస్ గ్రూపులో మెజారిటీ వాటాను దక్కించుకున్న రిలయన్స్, తాజాగా తమిళనాడుకు చెందిన సదరన్ హెల్త్ ఫుడ్స్ ను రూ.156.42 కోట్లకు కొనుగోలు చేసింది.దీంతో మిల్లెట్ ఆధారిత ఆహార ఉత్పత్తుల రంగంలోకి రిలయన్స్ ప్రవేశించింది. మన్నా బ్రాండ్ పేరుతో ఈ సంస్థ రెండు దశాబ్దాలుగా ఆరోగ్య ఆహార ఉత్పత్తులను అందిస్తోంది. ఈ కొనుగోలుతో రిలయన్స్ తన వ్యాపార పోర్ట్ ఫోలియోను మరింత విస్తరిస్తోంది.ఈ సంస్థకు చెందిన మన్నా బ్రాండ్ పేరుతో మొత్తం పాతిక కంటే ఎక్కువ ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను అందిస్తోంది. చిన్నారుల నుంచి అన్ని వయసుల వారికి అందుబాటులో ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఆరోగ్యం మీద ఎక్కువ శ్రద్ధ చూపుతున్న ప్రజల తీరుకు అనుగుణంగా ఈ సంస్థ కొనుగోలు ఉన్నట్లుగా చెబుతున్నారు. ప్రస్తుతం తమిళనాడు.. దక్షిణాది రాష్ట్రాల్లో బలంగా ఉన్న మన్నా బ్రాండ్ రానున్న రోజుల్లో దేశ వ్యాప్తంగా పాపులర్ చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లుగా చెబుతారు. ఇక్కడో ఆసక్తికర అంశాన్ని చెప్పి ముగించాలి. గడిచిన ఐదేళ్ల కాలంలో పాతిక కంటే ఎక్కువ సంస్థల్ని రిలయన్స్ ను కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.లక్ష కోట్లను వినియోగించింది.

## ఆకాసా ఎయిర్ కో-ఫౌండర్ ప్రవీణ్ అయ్యర్ రాజీనామా

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ విమానయాన సంస్థ ఆకాసా ఎయిర్ కో-ఫౌండర్, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ప్రవీణ్ అయ్యర్ రాజీనా చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ ఆఖరులో ఆయన సంస్థను వీడుతున్నట్టు కంపెనీ ఓ ప్రకటనలో వెల్లడిచింది.దీంతో ఆకాసా ఎయిర్ నుంచి నిష్క్రమించిన రెండో కో-ఫౌండర్ ప్రవీణ్ అయ్యర్ నిలిచారు. గతేడాది అక్టోబర్‌లో సంస్థ మరో కో-ఫౌండర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్(ఇంటర్నేషన్ ఆపరేషన్స్) నీలు ఖత్రి సంస్థను వీడిన సంగతి తెలిసిందే. ఎయిర్‌లైన్ వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన ఖత్రి, ఆకార్ ఎయిర్ అంతర్జాతీయ కార్యకలాపాలను నిర్మించడం, విస్తరించడంలో కీలక పాత్ర పోషించారు. 2025లో సంస్థలోని సీనియర్ మేనేజ్‌మెంట్ మధ్య గందరగోళం తర్వాత కో-ఫౌండర్లు వరుసగా రాజీనామాలు చేస్తున్నారు. 2025, జూన్‌లో వైస్ ప్రెసిడెంట్ (ఇన్-ఫ్లైట్ సర్వీసెస్) అజిత్ భగ్‌చందాని వ్యక్తిగత కారణాలను చూపుతూ రాజీనామా చేశారు. మే నాటికి, లాంగ్-టర్మ్ ఆపరేషన్స్, స్ట్రాటజీ, ఎక్సలెన్స్ అండ్ ప్లానింగ్ హెడ్ రిషబ్ దేవ్, వైస్ ప్రెసిడెంట్ (ఎయిర్‌క్రాఫ్ట్ అక్విజిషన్ అండ్ లీజింగ్) అమోల్ మానే సహా పలువురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు రాజీనామా చేశారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ (క్యాటరింగ్) వినీత్ మిశ్రా కూడా గత ఏడాది మే నెలలో మరో క్యారియర్‌లో చేరేందుకు వెళ్లిపోయారు. కో-ఫౌండర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఆనంద్ శ్రీనివాసన్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని అకాసా ప్రకటించింది.

# రాత్రి నిద్రలో పదే పదే మెలకువ వస్తుందా?



రాత్రిపూట తరచుగా మేల్కొనే వారికి తగినంత నిద్ర ఉండదు. ఇలా నిద్ర రాకపోతే దానిని సాధారణ సమస్యగా విస్మరించకూడదు. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనం ప్రకారం రాత్రిపూట తరచుగా మేల్కొని తగినంత నిద్ర లేకపోతే అది గుండె ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా చేయవల్సింది సరిగ్గా నిద్రపోవడం. రాత్రిపూట తరచుగా మేల్కొనే వారికి తగినంత నిద్ర ఉండదు. ఇలా నిద్ర రాకపోతే దానిని సాధారణ సమస్యగా విస్మరించకూడదు. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనం ప్రకారం రాత్రిపూట తరచుగా మేల్కొని తగినంత నిద్ర లేకపోతే అది గుండె ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. ఈ సమస్య ఎక్కువ కాలం కొనసాగితే ఇది అనేక ప్రమాదకరమైన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. పరిశోధన ప్రకారం ఒక వ్యక్తి రాత్రి పూట కనీసం 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలి. లేకుంటే అది ఆరోగ్యాన్ని మరింత దిగజార్చుతుంది. మీకు కూడా నిద్రపోతున్నప్పుడు తరచుగా మెలకువ వస్తుందా? దీనివల్ల మీ నిద్ర చెదిరిపోతుందా? నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం తగినంత నిద్ర రాని వారికి అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంది. తగినంత నిద్ర రానప్పుడు శరీరం తనను తాను పూర్తిగా రిపేర్ చేసుకునే అవకాశం లభించదు. ఇది గుండె పనితీరును ప్రభావితం చేస్తుంది. అంతే కాదు ఇది మెదడును కూడా ప్రభావితం చేస్తుందని పరిశోధనలో వెల్లడైంది. మంచి రాత్రి నిద్రలో గుండె విశ్రాంతి పొందుతుంది. దీంతో రక్తపోటు సాధారణ స్థాయిలో ఉంటుంది. కానీ నిద్రలో పదేపదే అంతరాయం కలిగితే, గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. ఇది వాపుకు దారితీస్తుంది. అంతేకాకుండా, గుండెపోటు ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. రాత్రికి 2 నుంచి 3 సార్లు మేల్కొనే వారికి గుండె జబ్బులు వచ్చే ప్రమాదం 30% ఎక్కువగా ఉంటుంది. నిద్రలో తరచుగా మేల్కొనడానికి కారణం మీ మెదడు. అంటే మీరు నిద్రపోయిన తర్వాత కూడా అది మరింత చురుకుగా ఉంటుంది. దీని అర్థం మీరు దేని గురించో ఎక్కువగా ఆలోచిస్తూ ఉండవచ్చు లేదా మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారని అర్థం. మానసిక ఒత్తిడి ఉంటే అది గుండెను కూడా ప్రభావితం చేస్తుంది. ఎందుకంటే మానసిక ఒత్తిడి గుండెపోటుకు ఒక సాధారణ కారణం. అందువల్ల మీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. మీకూ రాత్రి సమయంలో తరచుగా మేల్కొనే సమస్య ఉంటే తప్పకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించండి.

# గ్యాస్ తగ్గాలని సోడా తాగుతున్నారా?



పొట్టలో గ్యాస్, ఉబ్బరం ఉన్నప్పుడు చాలామంది సోడా లేదా కూల్ డ్రింక్స్ తాగితే ఉపశమనం లభిస్తుందని భావిస్తారు. పొట్టలో గ్యాస్, ఉబ్బరం తగ్గించడానికి సోడా తాగడం తాత్కాలిక ఉపశమనం ఇవ్వొచ్చు కానీ, ఇది ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. కార్బోనేటెడ్ డ్రింక్స్ స్పింటర్‌ను దెబ్బతీసి యాసిడ్ రిఫ్లక్స్‌కు దారితీస్తాయి. తద్వారా అన్నవాహిక క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. కొంచెం ఎక్కువగా తిన్నా.. లేదా పొట్టలో గ్యాస్, ఉబ్బరం లేదా తేపుల సమస్యలతో బాధపడుతున్నప్పుడు చాలామంది సోడా, కూల్ డ్రింక్స్ లేదా ఇతర కార్బోనేటెడ్ పానీయాలను తాగుతారు.. ఇలా చేస్తే వెంటనే ఉపశమనం లభిస్తుందని నమ్ముతారు.. అయితే.. సోడా తాగిన తర్వాత.. తక్షణమే కొంత తేలికపడిన అనుభూతి కలిగించినా.. ఈ అలవాటు ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాలను కలిగిస్తుందని గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు పేర్కొంటున్నారు. ఈ పానీయాలు కేవలం తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే అందిస్తాయి తప్ప, మూల సమస్యకు పరిష్కారం కాదని వైద్యులు పేర్కొంటున్నారు. కార్బోనేటెడ్ డ్రింక్స్, కెఫీన్ బేస్డ్ డ్రింక్స్, ఫ్లేవర్డ్ డ్రింక్స్ వంటివి మన శరీరంలోకి వెళ్ళినప్పుడు, జీర్ణవ్యవస్థలోని ముఖ్యమైన భాగమైన స్పింటర్‌లను ప్రభావితం చేస్తాయి. స్పింటర్‌లు అంటే అన్నవాహిక ? పొట్ట మధ్య ఉండే కండర వలయాలు. ఇవి ఆహారం, పొట్టలోని ఆమ్లం పైకి, అంటే అన్నవాహికలోకి తిరిగి రాకుండా నిరోధిస్తాయి. మనం తలకిందులుగా యోగాసనాలు వేసినా కూడా పొట్టలోని పదార్థాలు పైకి రాకుండా ఈ స్పింటర్‌లు రక్షిస్తాయి. అయితే, సోడా వంటి కార్బోనేటెడ్ పానీయాలను అధికంగా తాగడం వల్ల ఈ స్పింటర్‌లు బలహీనపడతాయి లేదా కృత్రిమంగా రిలాక్స్ అవుతాయి. ఇలా క్రమంగా దెబ్బతింటాయి. స్పింటర్‌లు డ్యామేజ్ అవ్వడం వల్ల పొట్టలో ఉండాల్సిన ఆమ్లం ఫుడ్ పైప్‌లోకి ప్రవేశించడం ప్రారంభమవుతుంది. దీనినే యాసిడ్ రిఫ్లక్స్ అంటారు. అన్నవాహికలోని మ్యూకోసా (లోపలి పొర) పొట్టలోని ఆమ్లాన్ని తట్టుకునే విధంగా ఉండదు. నిరంతరం యాసిడ్ రిఫ్లక్స్ వల్ల అన్నవాహికలోని కణజాలం దెబ్బతిని, బ్యారెట్ ఈసోఫేగస్ అనే స్థితికి దారితీస్తుంది. ఇది క్యాన్సర్‌కు పూర్వ దశగా పరిగణిస్తారు. గత 20-25 సంవత్సరాలుగా ఇండియాలో, ముఖ్యంగా సబ్ కాంటినెంట్ ప్రాంతంలో అన్నవాహిక (ఈసోఫేగస్), పొట్ట పై భాగంలో వచ్చే క్యాన్సర్‌లు (అప్పర్ జీఐ క్యాన్సర్‌లు) విపరీతంగా పెరిగాయి. ఇంతకు ముందు పాశ్చాత్య దేశాల్లో ఎక్కువగా కనిపించే ఈ సమస్యలు, ఇప్పుడు మన దేశంలో కార్బోనేటెడ్ డ్రింక్స్ వినియోగం పెరగడం వల్ల విస్తరిస్తున్నాయని వైద్య నిపుణులు, అధ్యయనాలు పేర్కొంటున్నాయి.. ఈ పానీయాల వల్ల ఎలాంటి ఉపయోగం లేకపోగా, దీర్ఘకాలంలో శరీరానికి, ముఖ్యంగా జీర్ణవ్యవస్థకు తీవ్రమైన హాని కలిగిస్తాయి.కొంతమంది చాతి నొప్పిని కూడా గ్యాస్ సమస్యగా పొరబడి, సోడా తాగితే తగ్గుతుందని భావిస్తారు. అయితే, చాతి నొప్పి కొన్నిసార్లు గుండె సంబంధిత సమస్యలకు సూచన కావచ్చు. అలాంటి కీలక సమయంలో సోడా తాగి ఆలస్యం చేయడం ప్రమాదకరం. సోడా లేదా గ్యాస్ డ్రింక్స్ ఎటువంటి చికిత్స కాదని గుర్తుంచుకోవాలి. ఇవి కేవలం తాత్కాలికంగా

గ్యాస్‌ను బయటికి పంపించడంలో సహాయపడవచ్చు.. కానీ మూల కారణాన్ని పరిష్కరించలేవని వైద్య నిపుణులు చెబుతున్నారు. . నెలలు లేదా సంవత్సరాల తరబడి వీటిని అలవాటు చేసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలు వచ్చే అవకాశాలు చాలా ఎక్కువ. కనుక, ఇటువంటి పానీయాలను పూర్తిగా మానేయడం లేదా వీలైనంత వరకు తగ్గించడం ఆరోగ్యానికి చాలా మంచిదని పేర్కొంటున్నారు.

# పాదాల్లో ఆనెలు ఎందుకు వస్తాయి?



పాదాల్లో ఆనెలు చర్మం గట్టిపడి గడ్డల్లా మారడం వల్ల ఏర్పడతాయి. ఎక్కువ ఒత్తిడి, చెప్పులు లేకుండా నడవడం, అధిక బరువు వంటివి ప్రధాన కారణాలు. ఆనెలను నివారించడానికి సరైన పాదరక్షలు, పాదాల పరిశుభ్రత ముఖ్యం. ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవడం వల్ల నొప్పిని తగ్గించి, సమస్యను పూర్తిగా పరిష్కరించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. పాదాల్లో ఆనెలు (ఫుట్ కార్న్స్) గురించి వైద్య నిపుణులు అందిస్తున్న పూర్తి సమాచారాన్ని ఈ కథనంలో తెలుసుకుందాం. ఆనెలు చూడటానికి పెద్ద సమస్యలా అనిపించకపోయినా, అవి రోజువారీ కార్యకలాపాలకు, ముఖ్యంగా నడిచేటప్పుడు తీవ్రమైన అసౌకర్యాన్ని, నొప్పిని కలిగిస్తాయి. అసలు ఆనెలు అంటే ఏమిటి, అవి ఎందుకు వస్తాయి, వాటిని ఎలా గుర్తించాలి, చికిత్స.. నివారణ పద్ధతుల గురించి క్లియర్ కట్‌గా తెలుసుకుందాం.

ఆనెలు అంటే శరీరంలోని చర్మం గట్టిపడి, ఒక గడ్డలాగా ఏర్పడటం. ఇవి సాధారణంగా పాదాల్లో కనిపిస్తాయి, అయితే కొన్నిసార్లు చేతుల్లో కూడా ఏర్పడవచ్చు. చర్మంపై నిరంతరం ఒత్తిడి లేదా ఘర్షణ పడటం వల్ల రక్షణ కోసం చర్మం మందంగా మారడం దీనికి ప్రధాన కారణం. అధిక ఒత్తిడి: పాదాలపై ఏదైనా ఒక పాయింట్‌పై దీర్ఘకాలం పాటు అధిక ఒత్తిడి పడటం వల్ల చర్మం గట్టిపడుతుంది. నడిచేటప్పుడు పాదాలపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. చెప్పులు లేకుండా నడవడం: గరుకు ఉపరితలాలపై చెప్పులు లేకుండా నడవడం వల్ల పాదాలపై ఒత్తిడి పెరిగి, ఆనెలు ఏర్పడతాయి. అధిక బరువు: అధిక బరువు ఉన్నవారి పాదాలపై ఎక్కువ భారం పడి, ఆనెలు రావడానికి దారితీస్తుంది. అబ్నార్మల్ గేట్ (నడిచే పద్ధతిలో లోపం): కొంతమందికి కాళ్ళలోని ఎముకల అమరిక సరిగా ఉండదు. దీని వల్ల నడిచేటప్పుడు పాదం ఒక వైపు అధిక ఒత్తిడికి గురై, ఆనెలు ఏర్పడతాయి. సరిగ్గా పాదం మొత్తం నేలపై ఆనించకుండా నడిచే వారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. గట్టి చెప్పులు: గట్టి చెప్పులు లేదా సరిగా సరిపోని పాదరక్షలు ధరించడం వల్ల కూడా ఆనెలు వస్తాయి. వృత్తి సంబంధిత కారణాలు: ఎక్కువ బైక్ డ్రైవ్ చేసేవారు లేదా బరువైన వస్తువులను ఎత్తేవారి చేతుల్లో కూడా చర్మం గట్టిపడటం గమనించవచ్చు, ఇది ఆనెల ప్రారంభ రూపం. లక్షణాలు: ఆనెలు వస్తున్నాయని గుర్తించడానికి మొదటి లక్షణం చర్మం గట్టిపడటం. ఇది సాధారణంగా పాదాల్లోని బొటనవేలు కింద, ఎముకల ప్రామినెన్సెస్ వద్ద ఎక్కువగా కనిపిస్తుంది. చర్మం గట్టిపడటాన్ని నిర్లక్ష్యం చేస్తే, అది నొప్పిని కలిగించే ఆనెలుగా మారుతుంది. నడిచినప్పుడు నొప్పి రావడం సాధారణం. ఆనెలు రాకుండా నివారించడం లేదా ప్రారంభ దశలోనే వాటిని తగ్గించుకోవడం ముఖ్యం: ఒత్తిడి తగ్గించడం: చర్మం గట్టిపడటం మొదలైనప్పుడు, ఆ ప్రాంతంపై ఒత్తిడి పడకుండా జాగ్రత్త పడాలి.సరియైన పాదరక్షలు: మృదువైన, సౌకర్యవంతమైన చెప్పులు ధరించాలి. గట్టి లేదా బిగుతైన పాదరక్షలను నివారించాలి. పాదాల పరిశుభ్రత: పాదాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి.మాయిశ్చరైజర్‌లు: చర్మం పొడిబారకుండా మాయిశ్చరైజర్‌లను ఉపయోగించి మృదువుగా ఉంచాలి. బరువు తగ్గడం: అధిక బరువు ఉన్నవారు బరువు తగ్గడం వల్ల పాదాలపై ఒత్తిడి తగ్గుతుంది.ఎముకల అసాధారణతలకు చికిత్స: కాళ్ళలోని ఎముకల అమరికలో ఏదైనా లోపాలు ఉంటే, వాటిని సరిచేయించుకోవడం వల్ల ఆనెలు ఏర్పడకుండా నివారించవచ్చు. చికిత్స: ఆనెలు ఏర్పడినట్లయితే నిపుణులైన వైద్యులు దానికి చికిత్స అందిస్తారు. ఆనెలు పూర్తిగా పెరిగినప్పుడు, ఆ గడ్డను సర్జికల్ పద్ధతిలో జాగ్రత్తగా కట్ చేసి తొలగిస్తారు. చికిత్స తర్వాత కూడా పాదాలను శుభ్రంగా ఉంచుకోవడం, మాయిశ్చరైజర్‌లు ఉపయోగించడం, మృదువైన పాదరక్షలు ధరించడం వంటి జాగ్రత్తలు పాటిస్తే ఆనెలు మళ్లీ రాకుండా చూసుకోవచ్చు. ఆనెలు కేవలం ఒక సౌందర్య సమస్య కాదని, సరైన సమయంలో చికిత్స చేయకపోతే నొప్పి, అసౌకర్యాన్ని కలిగిస్తుందని గుర్తించడం ముఖ్యం. నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా.. ప్రారంభ దశలోనే వైద్య సహాయం పొందడం ద్వారా ఈ సమస్యను సమర్థవంతంగా నిర్వహించవచ్చు.

## జామ ఆకులు చేసే అద్భుతాలు




సాధారణంగా మనందరికీ జామ పండ్ల వల్ల కలిగే లాభాలు తెలుసు. మలబద్ధకం నివారణకు, జీర్ణక్రియకు జామ మేలు చేస్తుందని భావిస్తాం. అయితే జామ పండు కంటే దాని ఆకుల్లోనే అమూల్యమైన ఔషధ గుణాలు దాగి ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. క్యాన్సర్, గుండె జబ్బులకు చెక్: జామ ఆకుల్లో క్వెర్సెటిన్, ఫ్లేవనాయిడ్లు వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని కణజాలం దెబ్బతినకుండా కాపాడతాయి. తద్వారా క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గుతుంది. అంతేకాకుండా ఇవి వృద్ధాప్య ఛాయలు త్వరగా రాకుండా చేయడంలో తోడ్పడతాయి. బరువు తగ్గడం: నేటి కాలంలో అధిక బరువు పెద్ద సమస్యగా మారింది. జామ ఆకులతో తయారు చేసిన హెర్బల్ టీ తాగడం వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. ఇది శరీరంలోని కొవ్వును వేగంగా కరిగించి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మధుమేహ నియంత్రణ: టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి జామ ఆకుల టీ ఎంతో మేలు చేస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడమే కాకుండా ఇన్సులిన్ ఉత్పత్తిని క్రమబద్ధీకరిస్తుంది. భోజనం తర్వాత చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా అడ్డుకోవడంలో ఇది కీలకంగా పనిచేస్తుంది. జీర్ణక్రియ మెరుగు:కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలతో బాధపడేవారికి జామ ఆకులు మంచి పరిష్కారం. వీటిలోని శోథ నిరోధక లక్షణాలు జీర్ణక్రియను మెరుగుపరిచి, కడుపు సంబంధిత సమస్యలను నివారిస్తాయి. మెరిసే చర్మం: జామ ఆకులను పేస్టులా చేసి చర్మంపై రాసుకుంటే అద్భుతమైన ఫలితాలు ఉంటాయి. వీటిలోని యాంటీ-మైక్రోబయల్ లక్షణాలు మొటిమలు, నల్ల మచ్చలను తొలగించి, చర్మానికి సహజమైన మెరుపును ఇస్తాయి. నోటి ఆరోగ్యం భద్రం: చిగుళ్ల వాపు, దంతాల మధ్య బ్యాక్టీరియా సమస్యలు ఉన్నవారు జామ ఆకులను శుభ్రం చేసి నమలడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వీటిని మౌత్ వాష్‌గా కూడా ఉపయోగించవచ్చు, ఇది నోటి దుర్వాసనను పోగొట్టి దంతాలను ఆరోగ్యంగా ఉంచుతుంది

## అమ్మాయిలూ ఈ టిప్స్‌తో మీ జుట్టును నల్లగా మార్చేయండి!



అమ్మాయిల్లో చాలా మంది తెల్లగా ఉన్న జుట్టు నల్లబడటానికి అనేక ముందులు, కొత్త కొత్త ప్రొడక్ట్స్ వాడుతారు. అయినా కూడా ఉపయోగం ఉండదు. అయితే, ఇలాంటి వాళ్లు మీ ఇంట్లో ఉండే వాటితోనే తెల్ల జుట్టును నల్లగా మార్చేయండి. వయస్సు పెరిగే కొద్దీ నల్లగా జుట్టు నెరవడం మొదలవుతుంది. అంటే నల్లగా జుట్టు తెల్లగా మారుతుంది. దీని వలన ఎంతో మంది బయటకు కూడా వెళ్ళలేక ఇంట్లోనే ఉండిపోతారు. దీని కోసం హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూనే ఉంటారు. అలా బయట డబ్బులు పెట్టే కన్నా మీ ఇంటి చిట్కాలతో తెల్ల జుట్టును నల్లగా మార్చేయండి.శరీరంలో ఉండే కణాలు మెలనిన్ ఉత్పత్తిని ఆపినప్పుడు వాటి రంగును కోల్పోయి తెల్లగా అవుతాయి. ఇంకా చెప్పాలంటే పోషకాహార లోపాలు వల్ల ఇలా తెల్లబడుతుంది. కాబట్టి, తీసుకునే ఫుడ్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. బ్లాక్ టీ: టీ ఆకులు మనం ఎక్కువగా టీ చేసుకోవడానికి ఎక్కువగా ఉపయోగిస్తాము. ఇవి రుచికి మాత్రమే కాకుండా ఎర్రగా ఉన్న జుట్టును కూడా నల్లగా మారుస్తాయి. ముందుగా ఒక గ్లాస్ నీళ్ళు తీసుకుని దానిలో బ్లాక్ టీ ఆకులు వేసి నల్లగా మారే వరకు మరిగించాలి. వీటితో జుట్టును కడిగితే జుట్టు నల్లగా మారుతుంది.ఉసిరి నూనెను రోజూ తలకు రాసుకుంటే జుట్టు ఊడిపోదు. అలాగే, తెల్ల జుట్టు కూడా నల్లగా మారుతుంది. కరివేపాకు: కరివేపాకు మన కళ్ళకు మంచిదని వైద్యులు కూడా చెప్పారు. ఇవి కళ్ళకు మాత్రమే కాకుండా జుట్టుకు కూడా చాలా మంచిది. ఎందుకంటే, వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, బీటా కెరోటిన్ ఉన్నాయి. ముందుగా కొబ్బరినూనెను తీసుకుని దానిలో కరివేపాకు ఆకులను బాగా మరిగించాలి. ఆ నూనె చల్లారిన తర్వాత జుట్టుకు అప్లై చేయండి. ఇలా చేయడం వలన జుట్టు నల్లగా మారుతుంది.

## పీరియడ్స్ పెయిన్ పై బ్రహ్మాస్త్రం



చాలా మంది మహిళలకు ప్రతి నెలా పీరియడ్స్ సమయం ఒక పీడకలలా మారుతుంది. భరించలేని కడుపు నొప్పి, నడుము నొప్పి దైనందిన జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తాయి. ఇలాంటి సమయంలో పెయిన్ కిల్లర్స్ వాడటం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయని భయపడేవారికి ఒక అద్భుతమైన సహజ సిద్ధమైన చిట్కా అందుబాటులోకి వచ్చింది. మన వంటింట్లో ఉండే అనాస పండు దాల్చినచెక్క కలయిక పీరియడ్స్ నొప్పిని గణనీయంగా తగ్గిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. హోలిస్టిక్ హెల్త్ న్యూట్రిషనిస్ట్ ఖుషీ ఛబ్రా వెల్లడించిన వివరాల ప్రకారం.. అనాస పండులో ఉండే 'బ్రోమెలైన్' అనే ఎంజైమ్ వాపును తగ్గించి, గర్భాశయ కండరాలను సడలించడంలో సహాయపడుతుంది. దీనికి తోడు దాల్చినచెక్కలోని 'సిన్నమాల్డిహైడ్' రక్త ప్రసరణను మెరుగుపరిచి నొప్పిని తగ్గిస్తుంది. అనాస పండు : ఇందులోని బ్రోమెలైన్ ఎంజైమ్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలను కలిగి ఉంటుంది. ఇది పీరియడ్స్ సమయంలో గర్భాశయ కండరాల సంకోచాన్ని తగ్గించి, నొప్పి నుండి ఉపశమనం ఇస్తుంది. దాల్చినచెక్క : ఇది శరీరంలో రక్త ప్రసరణను క్రమబద్ధీకరిస్తుంది. అనేక పరిశోధనల ప్రకారం, పీరియడ్స్ మొదటి 2-3 రోజుల్లో 1 నుండి 3 గ్రాముల దాల్చినచెక్క పొడిని తీసుకోవడం వల్ల నొప్పి తీవ్రత తగ్గుతుంది. రక్తాన్ని పలచబరిచే మందులు: ఇప్పటికే బ్లడ్ థిన్నర్స్ వాడుతున్న వారు లేదా రక్తస్రావం సమస్యలు ఉన్నవారు బ్రోమెలైన్ సప్లిమెంట్లకు దూరంగా ఉండాలి. పండుగా తినడం సురక్షితమే. గర్భిణీలు: గర్భవతులు అధిక మొత్తంలో బ్రోమెలైన్ తీసుకోవడం శ్రేయస్కరం కాదు.లివర్ సమస్యలు: దాల్చినచెక్కను అతిగా తీసుకోవడం వల్ల కాలేయంపై ప్రభావం పడే అవకాశం ఉంది, కాబట్టి పరిమితంగా వాడాలి.డయాబెటిస్: మధుమేహం ఉన్నవారు దాల్చినచెక్కను మందుల రూపంలో తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. నెలసరి సమయంలో కొన్ని అనాస పండు ముక్కలపై కొద్దిగా దాల్చినచెక్క పొడిని చల్లుకుని తినవచ్చు. లేదా వేడి నీటిలో దాల్చినచెక్క వేసి టీ లాగా మరిగించి తాగడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది.

# టీ20 వరల్డ్ కప్: సొంతగడ్డపై లంక జైత్రయాత్ర.. ఒమన్‌పై భారీ విజయం

**టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య శ్రీలంకకు వరుసగా రెండో విజయం**

**ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 105 పరుగుల భారీ తేడాతో గెలుపు**

**లంక జట్టులో కుశాల్ మెండిస్, పవన్ రత్నాయకే, శనక హాఫ్ సెంచరీలు**

**ఒమన్ బ్యాటర్ మహమ్మద్ నదీమ్ ఒంటరి పోరాటం**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో ఆతిథ్య శ్రీలంక జైత్రయాత్ర కొనసాగిస్తోంది. గ్రూప్-బిలో భాగంగా గురువారం ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 105 పరుగుల భారీ తేడాతో శ్రీలంక ఘనవిజయం సాధించింది. ఈ మెగా టోర్నీలో లంకకు ఇది వరుసగా రెండో గెలుపు కావడం విశేషం. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి పసికూన ఒమన్‌ను చిత్తు చేసింది.పల్లెకెలె అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఒమన్ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోరు సాధించింది. లంక బ్యాటర్లు కుశాల్ మెండిస్ (45 బంతుల్లో 61), పవన్ రత్నాయకే (28 బంతుల్లో 60) అద్భుత అర్ధశతకాలతో రాణించారు. ఆఖర్లో కెప్టెన్ దసున్ శనక కేవలం 20 బంతుల్లోనే 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 50 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు.

అనంతరం 226 పరుగుల భారీ లక్ష్యఛేదనకు దిగిన ఒమన్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. లంక బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 120 పరుగులకే పరిమితమైంది. ఒమన్ జట్టులో మహమ్మద్ నదీమ్ (53 నాటౌట్) ఒక్కడే అర్ధశతకంతో ఒంటరి పోరాటం చేశాడు. శ్రీలంక బౌలర్లలో మహీశ్ తీక్షణ, దుష్మంత చమీర రెండేసి వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ విజయంతో గ్రూప్-బిలో శ్రీలంక అగ్రస్థానానికి చేరింది.

# నమీబియా బ్యాటర్లకు చుక్కలే: బుమ్రా రెండో మ్యాచ్ ఆడటం కన్ఫామ్..!




**హైదరాబాద్ పెన్ పవర్:** ముంబై: టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌కు భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా దూరమైన సంగతి తెలిసిందే. తీవ్ర జ్వరం కారణంగా అతడు మ్యాచ్ ఆడలేదు. అయితే.. అనారోగ్యం నుంచి కోలుకున్న బుమ్రా గురువారం (ఫిబ్రవరి 12) అరుణ్ జైట్లీ స్టేడియంలో నమీబియాతో జరగనున్న రెండో మ్యాచులో బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బుమ్రా హెల్త్ కండీషన్‌పై తిలక్ వర్మ క్లారిటీ ఇచ్చాడు. నమీబియాతో మ్యాచుకు ముందు జరిగిన ప్రీ-మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తిలక్ మాట్లాడుతూ.. బుమ్రా ఫిట్‌గా ఉన్నాడని తెలిపాడు. రెండో మ్యాచుకు అతడు అందుబాటులో ఉన్నాడని చెప్పాడు. తిలక్ వ్యాఖ్యలతో నమీబియాతో జరగనున్న రెండో మ్యాచులో బుమ్రా ఆడటం ఖాయమని స్పష్టమైంది. దీంతో భారత యార్కర్ కింగ్‌తో నమీబియా బ్యాటర్లకు చుక్కలు కనిపించడం ఖాయమంటున్నారు అభిమానులు. టీ20 వరల్డ్ కప్‌లో టీమిండియా రెండో మ్యాచ్‌కు రెడీ అయ్యింది. గురువారం జరిగే గ్రూప్ఎ లీగ్ మ్యాచ్‌లో పెద్దగా అనుభవం లేని నమీబియాతో తలపడనుంది. అయితే ఈ మ్యాచ్ తర్వాత పాకిస్తాన్‌తో హై ఓల్టేజ్ మ్యాచ్ ఉండటంతో ఇండియా బ్యాటర్లపై ప్రధానంగా దృష్టి నెలకొంది. అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో సూర్యకుమార్ మినహా మిగతా వారంతా తేలిపోయారు. ఒక్కరంటే ఒక్కరు వికెట్ కాపాడుకునే ప్రయత్నం కూడా చేయలేదు. దాంతో నమీబియాతో మ్యాచ్‌లో బ్యాటింగ్ వీరులందరూ గాడిలో పడాలని మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. ఏమాత్రం తేడా వచ్చినా రాబోయే మ్యాచ్‌కు ఆత్మవిశ్వాసం దెబ్బతింటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నమీబియా బౌలింగ్‌ను చితక్కొట్టి తొలిసారి మూడొందల మార్క్‌ను అందుకోవాలని టీమిండియా ప్రణాళికలు వేస్తోంది. ఇది ఎంతవరకు విజయవంతమవుతోంది చూడాలి.

# ఒమన్ బౌలర్లను వణికించిన షనక, పవన్.. అనామక జట్టుపై శ్రీలంక భారీ స్కోర్







**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా ఒమన్‌తో జరుగుతోన్న మ్యాచులో శ్రీలంక బ్యాటర్లు దుమ్మురేపారు. ముఖ్యంగా శ్రీలంక యంగ్ బ్యాటర్ పవన్ రత్నాయక్, కెప్టెన్ దసునా షనక, వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. పవన్ (60), షనక (50), మెండిస్ (61) ముగ్గురు అర్ధ సెంచరీలతో హోరెత్తించడంతో శ్రీలంక 20 ఓవర్లలో 220 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఈ మ్యాచులో టాస్ గెలిచిన నమీబియా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ చేసిన అతిథ్య శ్రీలంక బ్యాటర్లు అనామక ఒమన్ బౌలర్లపై విశ్వరూపం చూపించారు. ఓపెనర్లు నిశాంక (13), కమిల్ మిశ్రా (8) విఫలమైన.. పవన్ రత్నాయక్, కెప్టెన్ షనక, వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ రఫ్ఫాడించారు.

ముగ్గురు హాఫ్ సెంచరీలతో పరుగుల వరద పారించారు. పవన్ 28 బంతుల్లోనే 8 ఫోర్లు, ఒక సిక్స్ బాది 60 పరుగులు.. శనక 20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లు కొట్టి 50 రన్స్ చేశారు. మెండిస్ 75 బంతుల్లో 7 ఫోర్ల సహాయంతో 61 పరుగులు చేసి ఔట్ అయ్యాడు.

చివర్లో కమిందు మెండిస్ (7 బంతుల్లో 19 పరుగులు) మెరుపులు మెరిపించాడు. దీంతో శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఒమన్ బౌలర్లలో జితేన్ రామనంది 2 వికెట్లు పడగొట్టాడు. సుఫ్యాన్ మెహమూద్, ఒడెద్రా చెరో వికెట్ తీశారు.

# రుక్మిణి టాలీవుడ్‌కు మరో రష్మిక అవుతుందా?





కన్నడ భామలకు తెలుగులో మంచి క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. -ఛలో- మూవీతో టాలీవుడ్‌లోకి ప్రవేశించిన రష్మిక మందన్న వరుస క్రేజీ ఆఫర్లతో స్టార్ హీరోయిన్ జాబితాలో చేరిపోయింది. తెలుగులో స్టార్ హీరోల సినిమాల్లో నటిస్తూ బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకున్న రష్మిక నేషనల్ క్రష్ అనిపించుకుంది. స్వతహాగా కన్నడ అయినా తెలుగు సినిమాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో కన్నడ ప్రేక్షకులు రష్మికపై ఫైర్ అయ్యారు.మాతృ భాషకు సంబంధించిన ఇండస్ట్రీని మరిచిందని కామెంట్‌లు చేశారు. ఆ విమర్శల్ని ఎదుర్కొని ఇప్పుడు వన్ ఆఫ్ ది టాప్ హీరోయిన్‌ల జాబితాలో చేరింది. ఇండియా వైడ్‌గా స్టార్ హీరోయిన్‌గా క్రేజ్‌ని సొంతం చేసుకోవడమే కాకుండా అదే స్థాయిలో పాన్ ఇండియా సినిమాలని దక్కించుకుంటూ యమ బిజీగా గడిపేస్తోంది. 2024లో పుష్ప 2తో పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్‌ని సొంతం చేసుకున్న రష్మిక అదే హవాని కొనసాగిస్తూ గత ఏడాది -చావా-,-కుబేర- వంటి హిట్‌లని తన ఖాతాలో వేసుకుంది.ప్రస్తుతం కాక్‌టైల్ 2, లేడీ ఓరియెంటెడ్ మూవీ -మైసా-ల్లో నటిస్తున్న రష్మిక తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాన్ వరల్డ్ మూవీలో నటించే ఛాన్స్‌ని దక్కించుకుంది. ఇప్పుడు రష్మిక తరహాలో మరో కన్నడ సోయగం రుక్మిణీ వసంత్ నడుస్తున్నట్టుగా తెలుస్తోంది. తెలుగు సినిమాల్లో రష్మిక పాపులర్ అయినట్టుగానే రుక్మిణి కూడా ప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలుస్తోంది. రుక్మిణీ వసంత్..కన్నడ నాట మారుమ్రోగుతున్న పేరిది. ప్రస్తుతం టాలీవుడ్‌లోనూ ఈ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. కాంతార ప్రీక్వెల్ -కాంతార: చాప్టర్ 1తో భారీ క్రేజ్‌ని సొంతం చేసుకున్న రుక్మిణి ఈ సినిమాతో తెలుగు మేకర్స్ దృష్టిని ఆకర్షించింది. రెండేళ్ల క్రితమే నిఖిల్ తో -అప్పుడో ఇప్పుడో ఎప్పుడో- మూవీ చేసింది. సుధీర్ వర్మ డైరెక్ట్ చేసిన ఈ సినిమా టైటిల్‌కు తగ్గట్టే ఎప్పుడొచ్చిందో ఎప్పుడు వెళ్లిందో తెలియకుండానే వెళ్లిపోయింది. దీంతో రుక్మిణి టాలీవుడ్ ఎంట్రీ గురించి పెద్దగా ఎవరికీ తెలియలేదు. -కాంతార:చాప్టర్ 1- తరువాతే టాలీవుడ్ మేకర్ల దృష్టి తనపై పడింది. ప్రస్తుతం రుక్మిణి మాస్ ఆఫ్ యాక్షన్ ఎన్టీఆర్ నటిస్తున్న భారీ యాక్షన్ మూవీ -డ్రాగన్-లో నటిస్తోంది.దీన్ని భారీ స్కేల్ లో రిలీజ్ చేయాలని దర్శకుడు ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నాడు. తెలుగు సినిమాలకు పాన్ ఇండియా రేంజ్‌లో మంచి మార్కెట్ ఉన్న నేపథ్యంలో రష్మిక మందన్న తరహాలోనే రుక్మిణి కూడా టాలీవుడ్‌కే ప్రాధాన్యతనిస్తుందా? ..లేక కన్నడలోనూ నటిస్తూ రెండు భాషల్లోనూ పాపులారిటీని దక్కించుకోవాలని భావిస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secunderabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965